


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 214 పేజీలు: 10+4 వెల: 6.50




GOVERNMENT OF TELANGANA

TELANGANA RISING CURE-PURE-RARE



## ప్రజా ప్రభుత్వానికి 1000 రోజులు

### సంక్షేమం.. అభివృద్ధి.. సామాజిక న్యాయం
### ప్రపంచ స్థాయికి తెలంగాణ

**ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో సెప్టెంబర్ 1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజులు మైలురాయిని చేరుకున్న ప్రజా ప్రభుత్వం**

- 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ. 2 లక్షల వరకు రుణ విముక్తి
- రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు.. రైతు సంక్షేమానికి రూ. 1.72 లక్షల కోట్ల వ్యయం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు దాదాపు రూ.12,167 కోట్ల బస్సు ఛార్జీల ఆదా
- గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు
- 43 లక్షల కుటుంబాలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్
- 4.54 లక్షల మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు. రూ.1900 కోట్ల వడ్డీ రాయితీ
- తొలి విడత 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం. గ్రేటర్ సిటీలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్, లక్ష మందికి ఇందిరమ్మ ఇండ్లు
- 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ. మరో 7437 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్
- 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ.. 15.46 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ
- సామాజిక భద్రతను మరింత విస్తరిస్తూ కొత్తగా 2.25 లక్షల మందికి పెన్షన్లు
- 22 లక్షలకు పైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం. రూ.720 కోట్లు కేటాయింపు
- ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5,18,186 మంది పేద రోగులకు రూ.2,527 కోట్ల సాయం
- రిటైర్డ్ ఉద్యోగులకు 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- 2025-26 లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లు.. 12.14 లక్షల ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు
- హైదరాబాద్‌లో 355 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు

జారీచేసిన వారు : సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం




**ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం...**



రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదుకు వ్యతిరేకంగా మంగళవారం కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

# 'హైడ్రా' రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

>> ఉత్తర్వులను సవాల్ చేస్తూ రంగనాథ్ అప్పీలు దాఖలు చేశారు. రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. హైడ్రా నిబంధనల మేరకే నడుచుకుందని వాదించారు. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ నిర్వహించి స్వల్ప వ్యవధిలోనే సింగిల్ బెంచ్ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్ కంపెనీ అనుభవిస్తున్న భూమి విషయంలో వివాదం ఉందన్నారు. ప్రభుత్వ భూములు కాపాడటానికే హైడ్రా ఏర్పాటైందని, అతి పురాతనమైన, చారిత్రక నేపథ్యం ఉన్న కొండ రాళ్లను తొలగిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు అక్కడికి వెళ్లారన్నారు. ఈ భూమికి సంబంధించి ప్రస్తుతం సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశామని రంగనాథ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ భూమి వద్దకు వెళితే అరెస్ట్ చేయాలంటూ ఆర్మీ బ్రిగేడియర్‌కు లేఖ రాయాలని రిజిస్ట్రీ జనరల్‌ను సింగిల్ బెంచ్ ఆదేశించారని, ఈ ఉత్తర్వులు అసంబద్ధంగా ఉన్నాయని కోర్టులో వాదనలు వినిపించారు. ఆభూమి వివాదాస్పదంగా ఉన్నప్పుడు, హైడ్రా అధికారులు ఎందుకు కూల్చివేశారని ఎవరైనా చట్టప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది కదా అని రంగనాథ్ తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. జియో ఫెన్సింగ్ సర్వే ప్రకారం ఆ భూమి ప్రభుత్వానిదేనని రంగనాథ్ తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు రంగనాథ్‌ను తప్పించాలంటూ సింగిల్ బెంచు ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి ౖ, షాదీముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు డివిజన్ బెంచ్ భారీ ఊరట నిచ్చింది. ఈ పథకాల అమలుపై సింగిల్ బెంచ్ విధించిన స్టే ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధిస్తూ మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్ అప్పీలు పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారు. పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ఈ పథకాలు ఆర్థికంగా కొండంత చేయూతను అందిస్తున్నాయని కోర్టుకు తెలిపారు. రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి, నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికి ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని వివరించారు. ప్రభుత్వం తరుఫున వినిపించిన వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ సంక్షేమ పథకాల అమలుకు ఎదురైన చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయినట్లయింది.

# అప్రజాస్వామిక ప్రభుత్వం

>> న్యాయం?తప్పు చేసిన వారిని వదిలేసి, ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయడం అంటే చట్టం ఎవరి కోసం పనిచేస్తున్నట్లు? పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటోంది. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు, ఎవరు దాడి చేశారు, ఎవరు బాధితులు, ఎవరు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు అన్నది ప్రజలకు స్పష్టంగా తెలుసు.తెలంగాణ గడ్డపై ఎన్నో ప్రజా ఉద్యమాలు జరిగాయి. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఈ నేలపై నిర్బంధం, బెదిరింపులు, హౌజ్ అరెస్టులు, అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే అది ఎన్నటికీ సాధ్యం కాదు.బీజేపీ నాయకులను ఎన్ని సార్లు అరెస్ట్ చేసినా, ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల కోసం మా పోరాటం ఆగదు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎండగట్టడం, బాధితుల పక్షాన నిలబడటం మా బాధ్యత అని స్పష్టం చేశారు.

# మహారాష్ట్రతో చర్చలు ఓకే

>> రక్షణల ద్వారా దీనిని పరిష్కరించవచ్చని తెలంగాణ ప్రతినిధి బృందం పేర్కొంది. సిడబ్ల్యుసి చైర్మన్ తెలంగాణను తన సాంకేతిక అధికారులను కనుగొన్న వాటిని పరిశీలించడానికి వీలుగా మహారాష్ట్ర ప్రభుత్వంతో వివరణాత్మక మునిగిపోయిన డేటా, సహాయక అధ్యయనాలను పంచుకోవాలని కోరారు. తదుపరి సంప్రదింపుల ముందు అవసరమైన సమాచారాన్ని అందించడానికి తెలంగాణ అంగీకరించింది. ప్రతిపాదిత బ్యారేజీ మహారాష్ట్రలోని ప్రాజెక్టులను లేదా ఇతర అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేయదని నిర్ధారించడానికి కట్టుబడి ఉన్నామని రాష్ట్రం సమావేశానికి హామీ ఇచ్చింది. తగిన సాంకేతిక,కార్యాచరణ రక్షణలు అభివృద్ధి చేయబడతాయి, సంబంధిత అధికారుల ముందు ఉంచబడతాయి.ప్రాణహిత వ్యవస్థలో నీటి లభ్యత తదుపరి సాంకేతిక పని అవసరమయ్యే మరో ముఖ్యమైన సమస్యగా ఉద్భవించింది. ప్రాజెక్టుకు విశ్వసనీయంగా వినియోగించే నీటి పరిమాణంపై 2 రాష్ట్రాలు, సిడబ్ల్యుసి ఉమ్మడి అవగాహనకు రావాల్సిన అవసరాన్ని ఈ సమావేశం నొక్కి చెప్పింది. ప్రాణహిత జలాలను సమర్ధవంతంగా వినియోగించుకోవడం, రాష్ట్రానికి మొదట్లో ఊహించిన సాగునీటి ప్రయోజనాలను పొందే వ్యూహంలో భాగంగా తుమ్మిడిహట్టిని పునరుద్ధరించాలని తెలంగాణ కోరుతోంది. సాంకేతిక ఆధారాల ఆధారంగా చర్చలు కొనసాగించేందుకు అన్ని పక్షాలు సుముఖత వ్యక్తం చేయడంలో మంగళవారం నాటి సమావేశానికి ప్రాధాన్యత ఉందని అధికారులు తెలిపారు. తెలంగాణ ఇప్పుడు మహారాష్ట్రకు అవసరమైన ముంపు, సంబంధిత ప్రాజెక్టు వివరాలను అందజేస్తుంది, నీటి లభ్యత, అంతర్‌రాష్ట్ర భద్రతలపై తదుపరి పనులు చేపట్టబడతాయి. 152 మీటర్ల తుమ్మిడిహట్టి బ్యారేజీ ప్రతిపాదనపై పరస్పర అంగీకారయోగ్యమైన పరిష్కారానికి మార్గం సుగమం చేసి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌ను అమలు చేసే దిశగా సిడబ్ల్యుసి అధ్యక్షతన జరిగిన విస్తృత సానుకూల చర్చల అంచనాలను బలపరిచింది.

# నోటీసులు

>> పురోగతిని తెలియజేస్తూ రాష్ట్ర ఎన్నికల సీఈవో సుదర్శన్‌రెడ్డి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మిగిలిన 29,80,215 నోటీసులను 119 మంది ఈఆర్‌ఓలు,1973 మంది ఈఇఆర్ ఓల ద్వారా గడువులోగా విచారించను న్నారు. ఇప్పటి వరకు అందిన మొత్తం క్లెయిమ్‌లు, అభ్యంతరాలు:9,07,292 అందులో ఫారం6 (కొత్త ఓటరు):3,94, 517, ఫారం 6ఏ (ప్రవాస భారతీయులు): 6,346, ఫారం7 (పేర్ల తొలగింపు): 48,752, ఫారం8 (సవరణలు/మార్పులు): 4,57,677 ఉన్నాయి. కాగా, సర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను 17.08.2026న ఆయా ఇఆర్‌ఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఈ జాబితాతో పాటు ఎఎస్‌డిడి ఓటర్ల వివరాలను సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

కాగా, క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు:.. 17.08.2026 నుండి 16.09.2026 వరకు గడువు విధించారు. నోటీసుల జారీ, పరిష్కారం:.. 17.08.2026 నుండి 15.10.2026 వరకు గడువు ఇచ్చారు. ప్రత్యేక ప్రచార (స్పెషల్ క్యాంపెయిన్) తేదీలు: మొదటి విడత: 05.09.2026, 06.09.2026, రెండవ విడత:12.09.2026, 13.09.2026 ఖరారు చేశారు. ప్రత్యేక ప్రచార దినాలలో బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలను లేదా ఇఆర్‌ఓ కార్యాలయాలను సందర్శించి తమ పేర్లను సరిచూసుకోవాలని, ఫారాలు 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సీఈవో కోరారు.

# భారీ ఊరట

>> రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు స్వేచ్ఛనిచ్చింది. ఇక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపరిహారం చెల్లింపులపై విధివిధానాలు రూపొందించాలని సూచించింది. విధివిధానాలు రూపొందించిన మూడు నెలల్లోగా కేంద్రప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహనకు కట్టుబడి ఉండాలనే షరతుకి లోబడి ఆర్టికల్ 142 కింద ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసినట్లు స్పష్టం చేసింది. కేసులు కొట్టేయడంతో సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను రద్దు చేస్తున్నట్లు సిజెపి ప్రకటించింది. సెప్టెంబర్ 5న చేపట్టాల్సిన నిరసన పిలుపును ఉపసంహరించుకున్నట్లు సిజెపి ప్రతినిధులు తెలిపారు.

## వారం - వర్జ్యం

02-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె
తి.పంచమి ఉ.6.12, షష్ఠి తె.4.25
న.భరణి రా.1.41
వర్జ్యం ఉ.11.53 - మ.1.25
దు.ఉ.11.42-మ.12.32
రాహు. మ.12.00-సా.1.30
శుభ ఉ.5.00-ఉ.6.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి విజయం సాధిస్తారు. పనుల్లో పురోగతి సాధిస్తారు.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయం పొందుతారు. తగాదాలకు దూరంగా వుండండి.

**మిథునం :** ఆర్థిక పరిస్థితిలో ప్రోత్సాహం లభిస్తుంది. బంధువులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కరించుకుంటారు.

**కర్కాటకం :** శ్రమ ఫలిస్తుంది. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ, వివాహ యత్నాలు కలిసివచ్చే కాలం.

**సింహం :** పనులలో ఎదురైన ఆటంకాలు కొంత వరకు తొలగుతాయి. ప్రయాణాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు.

**కన్య :** బధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. మానసిక ప్రశాంతత పొదుతారు.

**వృశ్చికం :** విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**ధనుస్సు :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం :** దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. ఆకస్మిక ప్రయణాలు లాభిస్తాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం :** ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. సంతానం నుండి శుభవార్తలు.

**మీనం :** ఉద్యోగ, వివాహయత్నాలు, సాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఆర్థిక ప్రగతి సాధిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఒకే మాటపై ఉందాం

>> కుంటున్నాయని ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆస్తిగా మారకూడదని తేల్చిచెప్పారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో అన్ని దేశాలు ఒకే వైఖరితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరిపోదని, వారి వెనుక ఉన్న నిధులు, నియామకాలు, తీవ్రవాద భావజాలం, సురక్షిత స్థావరాల వ్యవస్థను కూడా పూర్తిగా నిర్మూలించాల్సి ఉందని చెప్పారు. అలాగే, ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఘర్షణలపైనా మోడీ స్పందించారు. యుద్ధభూమిలో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని అన్నారు. అన్ని వివాదాలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఒక ప్రాంతంలో మొదలైన యుద్ధం ఇప్పుడు ఆ ప్రాంతానికే పరిమితం కావడం లేదని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలు ప్రపంచ ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్లోబల్ సౌత్ దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయని చెప్పారు.

**డ్రగ్స్‌పైనా హెచ్చరిక**

మాదకద్రవ్యాల అక్రమ రవాణా కూడా తీవ్రమైన సమస్యగా మారుతోందని ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ కేవలం నేరం మాత్రమే కాదని, అవి యువత భవిష్యత్తుతో పాటు ప్రాంతీయ భద్రతకు కూడా ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ఎస్‌సిఒ దేశాల మధ్య మరింత సమన్వయం అవసరమని చెప్పారు. భద్రత, సమాచార భద్రత, డ్రగ్స్ వంటి అంశాలపై ఎస్‌సిఒ ఏర్పాటు చేస్తున్న వ్యవస్థలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

**కనెక్టివిటీకి షరతులతో భారత్ మద్దతు**

ఎస్‌సిఒ దేశాల మధ్య వాణిజ్యం, రవాణా, అనుసంధానం పెరగాలని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి మోడీ పునరుద్ఘాటించారు. మార్కెట్లను కలపడం, వాణిజ్యాన్ని సులభతరం చేయడం, కొత్త అభివృద్ధి అవకాశాలు కల్పించే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే కనెక్టివిటీ పేరుతో చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా ప్రతి దేశం సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. రోడ్లు, రైల్వేలు, విమాన మార్గాలతో పాటు కస్టమ్స్ ప్రక్రియలను సులభతరం చేయడం, డిజిటల్ డాక్యుమెంటేషన్, మెరుగైన లాజిస్టిక్స్‌పై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.ఎస్‌సిఒ సహకారం వల్ల సాధారణ ప్రజలకు నేరుగా ప్రయోజనం కలగాలని మోడీ అన్నారు. యువత, రైతులు, పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు రావాలని చెప్పారు. భారత్‌కు ఎస్‌సిఒ అంటే కేవలం భద్రత, వాణిజ్య సహకార వేదిక మాత్రమే కాదని, వివిధ నాగరికతలు, సంస్కృతులు, ఆలోచనలు కలిసే వేదిక అని అభివర్ణించారు. రాబోయే సంవత్సరాల్లో ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు.

**పుతిన్‌తో భేటీ.. జిన్‌పింగ్‌తో పలకరింపు**

షాంఘై సహకార సంఘం సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తోనూ చర్చలు జరిపారు. ప్రాంతీయ పరిణామాలు, భద్రత, వాణిజ్యం, ఇతర ద్వైపాక్షిక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇక ఈ సదస్సు సందర్భంగా జరిగిన గ్రూప్ ఫొటోలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడటం, పలకరించడం కనిపించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా అక్కడే ఉన్నప్పటికీ.. మోడీ, షరీఫ్ మధ్య ప్రత్యేకంగా సమావేశం జరగలేదు. కనీసం కంటి చూపునకు కూడా నోచుకోలేకపోవడం విశేషం.

మొత్తంగా బిష్కెక్ ఎస్‌సిఒ వేదికగా మోడీ ఇచ్చిన సందేశం స్పష్టంగా ఉంది. ఉగ్రవాదంపై ఎలాంటి డబుల్ స్టాండర్డ్స్ ఉండకూడదు.. ఉగ్రవాదానికి నిధులు, ఆశ్రయం, మద్దతు ఇచ్చే మొత్తం వ్యవస్థను కూల్చేయాలి అని భారత్ మరోసారి తేల్చి చెప్పింది. అదే సమయంలో యుద్ధాలకు బదులు చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది.

# మింగేస్తున్న ఎల్‌నినో

>> అంచనాల్లో తెలంగాణలో సాధారణం కంటే గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడంతో పాటు, ఈ నెల పొడిగా ఉంటుందని ఐఎమ్‌డి పేర్కొంది. సెప్టెంబర్ తర్వాత పరిస్థితి ఎలా ఉండబోతుందనే ప్రశ్నకు, ఎల్ నినో మరింత బలపడుతోందని, వచ్చే ఏడాది వేసవి వచ్చే వరకు అది కొనసాగే అవకాశం ఉందని ఐఎమ్‌డి తెలిపింది. ద్వీపకల్ప భారతదేశంలో, ముఖ్యంగా తెలంగాణలో ఆగస్టు నెల వర్షపాతానికి సంబంధించి, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షం కురుస్తుందని అంచనా వేసినప్పటికీ, వాస్తవానికి రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదని ఐఎండి డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ మహాపాత్ర ఆన్‌లైన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఐఎండి సెప్టెంబర్ అంచనాలు నిజమైతే, తెలంగాణలో సెప్టెంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఇది ఇప్పటికే ఉన్న వర్షపాత లోటును మరింత పెంచి, భూగర్భ జలమట్టాలపై ప్రభావం చూపించే వీలుందని తెలిపారు. ద్వీపకల్ప భారతదేశానికి సంబంధించిన అంచనాలు కూడా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలన్నింటినీ దాదాపు సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉన్న కేటగిరీలో ఉంచాయి. ఇది పరోక్షంగా తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై ఉన్న జలాశయాల్లోకి వచ్చే నీటి ప్రవాహంపై ప్రభావం చూపవచ్చని వెల్లడించారు. ఎల్ నినో ప్రస్తుత స్థితిపై ఐఎండి మాట్లాడుతూ, అది మరింత బలపడిందని, వచ్చే ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని, ముఖ్యంగా 2027 మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కూడా ఇది ఒక బలమైన దశలో కొనసాగవచ్చని తెలిపారు. అయితే, ఎల్ నినో ఇంతకాలం కొనసాగడం 2027 నైరుతి రుతుపవన కాలంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అంచనా వేయడం చాలా తొందరపాటు అవుతుందని డాక్టర్ మహాపాత్ర అన్నారు. సెప్టెంబరులో బంగాళాఖాతంలో కొన్ని అల్పపీడన ప్రాంతాలు ఏర్పడతాయని అంచనా వేసినప్పటికీ, అవి ఆగస్టులో ఏర్పడిన ఐదు సారూప్య వాతావరణ వ్యవస్థలను అనుసరించి వాయువ్య దిశగా కదులుతూ బీహార్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మరియు ఒడిశాలోని కొన్ని ప్రాంతాలకు వర్షాలను తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. హిందూ మహాసముద్ర ద్విధ్రువ పరిస్థితులు సానుకూల దశలోకి ప్రవేశిస్తున్నాయనే కొన్ని ఆశలు ఉన్నప్పటికీ, ।వీదీ పరిస్థితులు తిరిగి తటస్థ స్థితికి రావడంతో ఆ ఆశలు సన్నగిల్లాయని డాక్టర్ మహాపాత్ర అన్నారు.


భారీగా వర్షాలు కురుస్తుండటంతో మంగళవారం గువాహతిలో రోడ్డుపైకి చేరిన నడుములోతు వరద నీటిలో మహిళా ప్రయాణికులను రిక్షాలో తరలిస్తున్న కార్మికుడు

# చూపులన్నీ హస్తినపైనే

>> స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది.

ఈ మేరకు కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు ఖాయమనే ప్రచారం జోరందుకుంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. చిన్నారెడ్డి మాత్రం ఢిల్లీకి వెళ్లలేదు. కాగా. కొండా సురేఖ హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే, పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండు రోజుల క్రితం రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆమె సిఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి సిఎంకు, ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాఖీ కట్టి వచ్చారు. రాఖీ కట్టడంతో పరిస్థితి సద్దుమణిగిందని భావించినప్పటికీ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉందనే అంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

అయితే ఆమె కుటుంబం అధిష్ఠానం మీద కోపగించుకోకుండా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామనే హామీ పొందే అవకాశం ఉందని తెలుస్తోంది.కొండా సురేఖ ఎమ్మెల్యేగా, కొండా మురళి ఎమ్మెల్సీగా కొనసాగతనున్నారు. నవంబర్ గవర్నర్ కోటాలో 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ సమయంలో కొండా మురళికి ఎమ్మెల్సీ స్థానం దక్కే అవకాశం ఉందని ప్రచారం. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.అలాగే, కేసీ వేణుగోపాల్‌ను.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా కలుస్తారని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణ ఊహాగానాల నేపథ్యంలో ఢిల్లీకి ఆశావాహులు వరుస కడుతున్నారు. తనకు మంత్రి పదవి ఇస్తానని హై కమాండ్ హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి చెబుతున్నారు. తనకు ఇచ్చిన హామీని గుర్తు చేసేందుకు ఢిల్లీకి వెళ్తున్నట్లు రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం ఉదయం ఢిల్లీకి వెళ్తనున్నారు.

# ఉద్యోగుల మహాధర్నా

>> వేగవంతం చేసి ప్రకటించాలి, పెండింగ్‌లో ఉన్న 6 డిఏలను వెంటనే విడుదల చేయాలి. దీర్ఘకాలంగా నిలిచిపోయిన ఉద్యోగుల వివిధ రకాల ఆర్థిక బకాయిలను చెల్లించాలి,అన్ని శాఖల్లో నిలిచిపోయిన ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి, అంతర్గత ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి అని నినాదాలు చేశారు. సచివాలయ ప్రధాన ద్వారమైన బాహుబలి గేటు వద్ద ఉద్యోగులు ప్లకార్డులతో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం బాహుబలి గేటు నుండి మీడియా లాంజ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సచివాలయ అధికారుల సంఘం, తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సహకార పరపతి సంఘం, తెలంగాణ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం మరియు క్లాస్4 ఉద్యోగుల సంక్షేమ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ ధర్నాలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి ప్రేమ్, అధికారుల సంఘం అధ్యక్షుడు జి. సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి. లింగమూర్తి, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రేండ్ల రాజేష్, ఉపాధ్యక్షుడు టి. జయహరి గౌడ్, కార్యదర్శి టి. స్వరణ్ రాజ్, మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కే. రమాదేవి, కార్యదర్శి నివేదిత, క్లాస్4 ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. రాజకుమార్, కార్యదర్శి సాయికుమార్, వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, డైరెక్టర్లు, అన్ని సంఘాల కార్యవర్గ సభ్యులు, అన్ని స్థాయిల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతోనే నిరసన తెలపాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో గణేశ నిమజ్జనంపై కొత్త వివాదం

## తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా

## అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు1:** హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది.

హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

# 'నీటిని ఆయుధంగా వాడొద్దు'

**బిష్కెక్, సెప్టెంబర్ 1:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్- పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం ఈ అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అస్త్రంగా మలుచుకోకూడదని భారత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఒప్పందాలను వాటి అసలు స్ఫూర్తికి అనుగుణంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం సింధు జలాల ఒప్పందం చెల్లుబాటును సమర్థిస్తూ, వివాద పరిష్కార యంత్రాంగం కొనసాగుతుందని తీర్పు వెలువరించిన మరుసటి రోజే షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలంగాణ ప్రభుత్వం
వైరా - మునిసిపాలిటీ కార్యాలయం, ఖమ్మం జిల్లా
నిట్ నం. E/Wyra/174/2026, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 31.08.2026
1) రెండు (2) పనులు. మొత్తం 12.00 లక్షలు (2) పనులకు. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ 02.09.2026 ప్రారంభం. ముగింపు తేది: 04.09.2026. 2) వైరా మునిసిపాలిటీలో 3వ పార్టీ Q.C. ఏర్పాటు కొరకు EOI పిలవబడింది. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభం 02.09.2026 ముగింపు 09.09.2026. ఏవైనా విచారణలకు సంప్రదించండి: AE - 9515626861 /కమిషనర్-7396507165. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. సం/- కమిషనర్, వైరా మునిసిపాలిటీ
DIPR.No.8995-PP/CL/Advt/1/2026-27, తేది: 01.09.2026

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 214 పేజీలు: 10+4 వెల: 6.50

కర్నూలులో అనుమానిత ఉగ్రవాది అరెస్టు
బంగారం కొనకండి.. స్వదేశీ వస్తువులే వాడండి: ప్రధాని 5


9 నేపాల్‌లో ఒకే ఇంట్లో 24 మృతదేహాలు
ఎటుచూసినా విషాదమే


5 ఘాటెక్కిన ఉల్లి
కిలో రూ. 60 పైకి చేరిన ధర


6 క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్
ఖనిజాల పరిశోధనకు త్రిముఖ భాగస్వామ్యం: డి.సిఎం భట్టి

# ఒకే మాటపై ఉందాం



## ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలొద్దు
### షాంఘైలో ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ వార్నింగ్
### యుద్ధభూమిలో సమస్యలకు పరిష్కారం లభించదు
### చర్చలు, దౌత్యం ద్వారానే వివాదాలకు పరిష్కారం
### డ్రగ్స్‌తో ప్రాంతీయ భద్రతకూ ముప్పు

**బిష్కెక్, సెప్టెంబర్ 1:** ఉగ్రవాదంపై భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసింది. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) 26వ శిఖరాగ్ర సమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదంపై గట్టి సందేశం ఇచ్చారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తీవ్రమైన అంశంపై అన్ని దేశాలు ఒకే గొంతుతో మాట్లాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని తమ విధానంలో భాగంగా ఉపయోగించే దేశాలతో పాటు ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు కూడా గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదానికి నిధులు అందించడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం, నియామకాలు చేపట్టడం, ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి మొత్తం వ్యవస్థను కూల్చివేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తదితర దేశాల అధినేతలు హాజరయ్యారు. అయితే మోడీ తన ప్రసంగంలో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. అయినప్పటికీ ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదాన్ని కొన్నిదేశాలు తమవ్యూహాత్మక ప్రయోజనాలకోసం ఉపయోగించు >>2

# చూపులన్నీ హస్తినపైనే

## కేబినెట్‌లో మార్పులు, చేర్పులు ఖాయం!
### కెసి వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘ భేటీ
### కాంగ్రెస్ హైకమాండ్ నుంచి మంత్రి కొండా సురేఖకు పిలుపు



ఢిల్లీకి చేరిన పంచాయితీ..
నేటి ఉదయం ఢిల్లీకి డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు1:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు,చేర్పులు ఖాయమనే ప్రచారం జోరందుకుంది. ఇప్పటికే ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చేరుకున్నారు. ఇదే సమయంలో మంత్రి కొండా సురేఖకు ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె మంగళవారం ఢిల్లీకి వెళ్లారు. విదేశీ పర్యటన నుంచి ఢిల్లీకి చేరుకున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురు నేతలు రెండు గంటల పాటు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణతో పాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆమోదం కోసం ఆయన వేణుగోపాల్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది.
ఇదే సమయంలో పార్టీలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ సంఘం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వారు సమర్పించిన వివరణలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధిష్ఠానం అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాగా, అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీనేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు..పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా >>2

# మహారాష్ట్రతో చర్చలు ఓకే



### 152 మీటర్ల బ్యారేజి కోసం తెలంగాణ పట్టు.. తుమ్మిడిహెట్టి అవరోధాల పరిష్కారానికి చర్యలు
### మూడోవారంలో మరోసారి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు1:** ప్రాణహిత నదిపై ప్రతిపాదిత తుమ్మిడిహట్టి బ్యారేజీకి సంబంధించి తెలంగాణ, మహారాష్ట్రలమధ్య కేంద్రజల సంఘం ప్రాయోజిత అంతర్రాష్ట్ర చర్చలు మంగళవారం ఢిల్లీలో సానుకూలంగా ముగిశాయి, ఈ ప్రాజెక్టుకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి పురోగతిపై ఆశలు రేకెత్తుతున్నాయి, సిడబ్ల్యూసి ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 152 మీటర్ల బ్యారేజీని నిర్మించాలన్న తెలంగాణ ప్రతిపాదన, పూర్తిస్థాయి రిజర్వాయర్ లెవల్‌లో మహారాష్ట్రలో ముంపునకు గురికావడం, ప్రాణహితజలాల లభ్యత,రెండు రాష్ట్రాల ప్రాజెక్టులు, ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన భద్రతలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రతినిధి బృందంలో నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజనీర్ఇన్‌చీఫ్ (జనరల్) ఓ.వి.రమేష్ బాబు, ఇతర సీనియర్ నీటిపారుదల, సాంకేతిక అధికారులు ఉన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇద్దరు కీలక అధికారులు మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించారు. తుది నిర్ణయం తీసుకోనప్పటికీ, అధికారులు చర్చలను నిర్మాణాత్మకంగా, ప్రోత్సాహకరంగా వివరించారు, సిడబ్ల్యూసి అత్యుత్తమ సాంకేతిక, అంతర్రాష్ట్ర సమస్యలపై వివరణాత్మక పరిశీలనను సులభతరం చేసింది. సెప్టెంబర్ మూడో వారంలో మరో దఫా చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రతిపాదిత 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఏర్పడే ముంపుపై మహారాష్ట్ర ఆందోళన మంగళవారం నాటి సమావేశంలో కీలకాంశంగా ఉంది. తెలంగాణ తన సాంకేతిక స్థితిని ప్రదర్శించింది వివిధ స్థాయిలలో సంభావ్య ప్రభావంపై నిర్వహించిన అధ్యయనాలను వివరించింది. మట్టాన్ని 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచడం వల్ల ఏర్పడే అదనపు ముంపు అంతంత మాత్రమేనని, తగిన సాంకేతిక చర్యలు, >>2



## 'హైడ్రా' రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట
### సింగిల్ బెంచి ఉత్తర్వులను సస్పెండ్ చేసిన డివిజన్ బెంచ్

**హైదరాబాద్, సెప్టెంబరు 1,ప్రభాతవార్త:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనను హైడ్రా కమిషనర్ స్థానం నుంచి తప్పించాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన భూమిలో హైడ్రా జోక్యం చేసుకోవద్దని ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. శాంతాశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ స్థానం నుంచి తప్పించి ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ >>2

# అప్రజాస్వామిక ప్రభుత్వం

### బాధిత నేతల పరామర్శకు వెళ్తుంటే హౌస్ అరెస్టులు చేస్తారా?
### ప్రశ్నించే గొంతులను అణచివేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు: కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అప్రజాస్వామిక, నియంతృత్వ పాలనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ.. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తున్న, ప్రతిపక్ష నాయకులను నిర్బంధిస్తున్నారంటూ మండిపడ్డారు. నల్లగొండలో బాధితులను పరామర్శించేందుకు బయలుదేరిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నాయకులను హౌజ్ అరెస్ట్ చేయడం దుర్మార్గం. బాధితులను పరామర్శించేందుకు వెళ్తే హౌజ్ అరెస్ట్ చేస్తారా? ప్రజలను కలవకుండా అడ్డుకుంటారా? ఇదేనా కాంగ్రెస్ చెప్పే ప్రజాస్వామ్యం? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణి?కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేకపోతుందని, ప్రజల తరఫున బిజెపి ప్రశ్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. ప్రశ్నించే వారినే అరెస్ట్ చేస్తుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష గొంతులను అణిచివేయడానికి పోలీసులను ఉపయోగిస్తుందన్నారు. ఇది పూర్తిగా కక్ష సాధింపు రాజకీయమే అన్నారు. నల్గొండలో బిజెపి జిల్లా అధ్యక్షుడి నివాసంపై దాడి జరిగినప్పుడు, బిజెపి రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తుందని ప్రశ్నించారు. దాడులు చేసిన వారిని వదిలిపెట్టి, బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బిజెపి నాయకులనే అరెస్ట్ చేయడం ఎక్కడి >>2



# నైరుతిని మింగేస్తున్న ఎల్‌నినో
### రాష్ట్రంలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవన కాలంలోని చివరి నెల అయిన ఈ నెల, తెలంగాణకు మరింత ప్రతికూలంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) తెలిపింది. ఇప్పటికే సగటున మైనస్ 17 శాతం వర్షపాత లోటుతో తెలంగాణ అల్లాడుతుండగా, ఆగస్టు నెలలోనే ఈ లోటు మరింత పెరిగి మైనస్ 38 శాతంగా నమోదైంది. ఈ మేరకు విడుదల చేసిన సెప్టెంబర్ నెల >>2

## తెలంగాణ సచివాలయ ఉద్యోగుల
# మహాధర్నా
### పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్


మంగళవారం సెక్రటేరియట్ ద్వారం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు1:** డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని ప్రభుత్వ ఉద్యోగులు సుదీర్ఘకాలంగా పరిష్కారం కాని తమ సమస్యలపై ఉద్యమబాట పట్టారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులందరూ విధులు బహిష్కరించి భారీ మహాధర్నా, ర్యాలీ నిర్వహించారు. నూతన పిఆర్‌సి నివేదికను తక్షణమే >>2

## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
### కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో మంత్రి తుమ్మల భేటీ
5

## 61 లక్షల మందికి అందని
# నోటీసులు
### ఇప్పటి వరకు 31,74,952 మందికి అందజేత
### 1,94,737 నోటీసులపై విచారణ పూర్తి, గడువు సరిపోయేనా?



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు1:** తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియ రెండో దశలో భాగంగా నోటీసుల పంపిణీ, నోటీసులపై విచారణ ప్రక్రియలు కొనసాగుతున్నాయి. మొత్తం 92,88,112 మందికి నోటీసులు రూపొందించగా ఇప్పటి వరకు మొత్తం 31,74,952 మంది ఓటర్లకు నోటీసులు అందాయి అందులో 1,94,737 నోటీసులపై విచారణ పూర్తయింది. రాష్ట్రంలో 61లక్షల 13వేల 160 మంది ఓటర్లకు ఇంకా నోటీసులు అందలేదు. దీంతో సర్ ప్రక్రియ పూర్తికి ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని అభిప్రాయాలు వెల్లడి అవుతున్నాయి. నోటీసుల ప్రక్రియపై >>2



## సిజెపి నిరసనకారులకు భారీ ఊరట
### ఎఫ్‌ఐఆర్‌లు కొట్టేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్1:** ఢిల్లీలోని జంతర్‌మంతర్‌కు నిరసన తెలిపేందుకు వచ్చిన యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్టికల్ 142 కింద కేసులు రద్దు చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. జులై 20 నుంచి 25 మధ్య జరిగిన సిజెపి నిరసనల్లో నమోదైన ఎఫ్ఆర్‌లు అన్నింటిని రద్దు చేసింది. జులై 20 నుంచి 25 మధ్య జరిగిన సిజెపి నిరసనపై దేశంలో ఎక్కడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయొద్దని ఆదేశించింది. 2,873 నేరచరిత్ర కలిగిన వారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు >>2


వార్త

> రాజనీతిజ్ఞుడు తాను ప్రభుత్వానికి చెందిన వాడినని అనుకుంటే రాజకీయవేత్త ప్రభుత్వమే తనది అని అనుకుంటాడు.
>
> - డబ్ల్యు.ఆర్. ఆల్జర్

# పురోగమనమా! తిరోగమనమా?

విషయ పరిజ్ఞానం, సమగ్ర అవగాహన ఉన్నవారెవరైనా ముందు చదువులకు అర్హులేనన్న భావనలో ప్రభుత్వాలు విద్యావిధానాన్ని గందరగోళపరుస్తున్నాయి. 'నో డిటెన్షన్' విధానం గతంలోనే ఉందనుకున్నా, దాని నుంచి సత్ఫలితాలు లేవనే ఆలోచన మేధావులలో ఎప్పుడో ఏర్పడింది. విద్యావ్యవస్థను ఎప్పటికప్పుడు సంస్కరించాలని ప్రభుత్వాలు తలపోయడం, అమలులో డొల్లతనం వలన చతికిలపడిపోవడం చూస్తూనే ఉన్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మిశ్రమ వ్యవస్థగా ఉన్న విద్యా వ్యవస్థలో ఎన్ని మార్పులు చేసినా వాటిలో చిత్తశుద్ధి లోపం బయటపడుతూనే ఉంది. మసిపూసి మారేడు కాయగా మారిన చందాన విద్యాసంస్కరణలు వెక్కిరిస్తున్నాయి. బీహార్ ప్రభుత్వం తమ రాష్ట్ర విద్యారంగ చరిత్ర నుంచి 'నో ఫెయిల్' అనే పదాన్నే కనపడకూడదని శాసిస్తోంది. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం మూల్యాంకనంలో ఎక్కువో తక్కువో మార్కులు రావడం, వారిని ర్యాంకులతో కీర్తించడం అత్తెసరు మార్కులు సాధించిన వారికి మళ్లీ పరీక్షలు, వాళ్ల ఆత్మహత్యల కథనాలకు వగచడం ఇవన్నీ వద్దనుకునితాజాగా 'నో ఫెయిల్' విధానాన్ని ప్రవేశపెట్టచూస్తోంది. ఇలాంటి విధానాల వలన కనీస విద్యాప్రమాణాలు లేని వారు సైతం అవలీలగా పట్టభద్రులైపోయినా ఆశ్చర్యపడనక్కర్లేదు. కనీస అభ్యసన ప్రమాణాలు లేవనో అలాంటి విద్యార్థికి అదనపు బోధన, మూల్యాంకన విశ్లేషణలు గుర్తించాలంటే తదుపరి తరగతికి వెళ్లడం కష్టమన్న భావన ప్రతి విద్యార్థికి కలిగినప్పుడే వారిలో విద్యా జిజ్ఞాస పెరుగుతుంది. చదివినా చదవకపోయినా చిట్టచివరికి ఏదో ఒక డిగ్రీ సర్టిఫికెట్ చేతికొస్తుందిలే. అదే ఉద్యోగానికి అర్హత అవుతుంది. 'చాల్లే ఇది చాల్లే' అనే ధోరణికి విద్యార్థి అలవాటు పడ్డాడో ఇక విద్యావ్యవస్థ సర్వనాశనమవడం తథ్యం. బీహార్ రాష్ట్రమంటేనేబీమార్ 'రాష్ట్రంగా పిలువబడుతుంటుంది. అలాంటి రాష్ట్రంలో ఉత్తీర్ణతతో సంబంధం లేని చదువులు అక్కడి విద్యార్థులకు బతుకు తెరువుకు కష్టమయ్యే పరిస్థితులను తెచ్చిపడతాయి. ఒక తరగతిలో నేర్చుకోదగిన విషయాలు, ప్రమోట్ చేసేస్తే తర్వాతి తరగతిలో చదువుకుంటాడులే అని వదిలేస్తే కొత్త పాఠాలు ఆ విద్యార్థిని బడుద్దాయిని చేస్తాయనడంలో సందేహం లేదు. విద్యావిధానంలో 'నోఫెయిల్' భావనను 2009లో అప్పటి కేంద్ర ప్రభుత్వమే తెచ్చింది అదీ విద్యాహక్కు చట్టం ద్వారా. విద్య నేర్చుకునేందుకు చట్టం అవసరమవుతుందేమోకానీ ఎలాగైనా పట్టభద్రులైపోవాలనే యోచన మంచిది కాదు. ఆ చట్ట ప్రకారం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఏ విద్యార్థినీ ఫెయిల్ చేయకూడదని కేంద్ర ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ఇక పాఠాలు వినేవారెవరుంటారు. అందునా తమ విలువైన కాలాన్ని 'వాట్సాప్ రీల్స్' చూడటానికే గడిపే వారిని తరగతి గదుల్లో బంధించగల పరిస్థితి కానరాదు. తరగతి నుంచి పైతరగతికి మారినప్పుడల్లా అభ్యసన లోటు పేరుకుపోతే ఆ విద్యార్థి ఎందుకూ పనికి రాకుండా పోతాడు. విద్యార్థులను ఫెయిల్ చేయకపోవడంలో ప్రభుత్వ మూల్యాంకనం ఖర్చులు తగ్గవచ్చు. పరీక్షల్లో లీకుల్లేకుండా నిర్వహించలేని ప్రభుత్వాలకు అవే విజయగాథలు కూడాకావచ్చు. కానీ విద్యార్థులు నిరక్షరాస్యులుగా తయారౌతారేమోనన్న సోయి ప్రభుత్వాలకు లేకపోవడం ఆందోళనకరమైన విషయం. 'నో ఫెయిల్' అనగానే అదేదో మానవీయతకు మరో రూపమనుకుంటూ జబ్బలు చరుచుకునే విధానంగా భావించలేం. ఆ రకమైన భావనకు పురుడుపోసి విద్యార్థుల భవితను అంధకారంలో ముంచడం ఏమాత్రం సరికాదు. ఉచిత ప్రమోషన్ హక్కు కల్పించాల్సి వస్తే వారి అభ్యసన ప్రమాణాలు, నిరంతర అంతర్గత మూల్యాకనం వంటి అంశాల్లో ఎలా వ్యవహరించాలో కూడా అధ్యయనం చేయడం అవసరం.గతంలో ప్రవేశపెట్టిన 'నో డిటెన్షన్ పాలసీ'లో కూడా ఎక్కడో ఓ తరగతి వద్ద డిటెన్షన్ అయ్యే పరిస్థితి ఉండేది. అలాంటి విద్యార్థులను దొడ్డిదారిన మరో పరీక్ష ద్వారా ప్రమోషన్ చూపించే వ్యవస్థ కూడా ఉండేది. ఇలాంటి విద్యా విధానాల వల్లనే నిరంతరం విద్యార్థి చదువుల మీద శ్రద్ధ పెట్టే ప్రైవేట్ విద్యాసంస్థలు అవసరమొచ్చాయి. ఇప్పుడు అలాంటి ఏర్పాట్లున్న విద్యాసంస్థల్లో సంపన్నులు అత్యధిక ఫీజులు చెల్లించి తమ పిల్లలను చదివిస్తున్నారు. 2015లోనే 'నో డిటెన్షన్' విధానం పట్ల 28 రాష్ట్రాలకు 23రాష్ట్రాలు వ్యతిరేకత వ్యక్తం చేశాయి. పిల్లల్లో నేర్చుకోవడం తగ్గిపోతుందని విశ్లేషించగానే 2019లో విద్యాహక్కు చట్టాన్ని సవరించి 5,8 తరగతుల్లో పరీక్షలు నిర్వహించి సరైన చదువులేకపోతే 'ఫెయిల్' విధానాన్ని పునఃస్వాగతం పలికింది. ఆ తర్వాత కొన్ని రోజులకే తమిళనాడు, త్రిపుర, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, అసోం, బీహార్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ వంటి 18 రాష్ట్రాలు 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేశాయి. గతంలో 'నో ఫెయిల్' విధానానికి వ్యతి రేకంగా నిర్ణయం తీసుకున్న 'బీహార్' ఇప్పుడు మళ్లీ అదే విధానం కోసం పట్టుబడుతోంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిబిఎస్ఇ విద్యావిధానం లో తమ మార్క్ షీట్‌లలో ఫెయిల్, కంపార్టుమెంటల్ అనే పదాలకు బదులుగా 'ఎసెన్షియల్ రిపీట్' అని సరిపెట్టుకుంది. అంటేమళ్లీ పరీక్షలు రాయాల్సిందేనన్న మాట. గత 15 ఏళ్లుగా విద్యార్థులఉత్తీర్ణత, ఫెయిల్ అనే విధానంపై ఊగిసలాటలో ఉన్న ప్రభుత్వాలు వారి వారి స్థాయిలో పునరాలోచనలో పడ్డాయి. అది తిరో గమనమా? పురోగమనమా? ఎవరూ నిర్దేశించలేదు. కింద తరగతుల్లో 'ఫెయిల్' అనే ప్రస్తావన లేకుండా పై తరగతులకు స్వేచ్ఛగా వదిలిపెడితే పదో తరగతుల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గుతుందన్న విషయం విద్యావేత్తలకు తెలియనిది కాదు.

> వస్త్రధారణ మనసును తెలిపేదిగా ఉండాలి. అంటే వస్త్రాలను బట్టి మనసు శుభ్రతను అర్థం చేసుకోగలగాలి.
>
> మహాత్మాగాంధీ



> మతం మానవుని కోసమే కాని, మానవుడు మతం కోసం కాదు.
>
> అంబేద్కర్



# సామాజిక భద్రతకు స్వర్ణ యుగమా?

**ఉద్యోగ భద్రత, వృద్ధాప్య భరోసా, సామాజిక రక్షణ ఈ మూడు అంశాలు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా ఉంటుంది. వేతన పరిమితి పెంపు, కనీస పెన్షన్ పెంపుపై కేంద్రం తీసుకోబోయే నిర్ణయాలు కోట్లాది కుటుంబాల జీవితాలను ప్రభావితం చేయగలవు. అందుకే ఈఅంశాన్ని కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన కీలక సంస్కరణగా చూడాలి. ఉద్యోగుల ఆశలు నిజమయ్యేలా త్వరితగతిన తుదినిర్ణయాలు తీసుకుని అమలు చేస్తే, అది కేవలం వేతనజీవులకు మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక బలమైన పెట్టుబడిగా నిలుస్తుంది. ఉద్యోగుల శ్రమకు గౌరవం ఇవ్వాలంటేవారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ఉత్తమ మార్గమని ప్రభుత్వం గుర్తిస్తే, ఈ నిర్ణయాలు భారత కార్మిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతాయి.**

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థికాభివృద్ధికి అసలైన చోదకశక్తి ఎవరు అంటే, సందేహం లేకుండా వేతన జీవులు, కార్మికులే అని చెప్పాలి. పరిశ్రమలు, సేవారంగం, నిర్మాణ రంగం, సమాచార సాంకేతిక రంగం ఏ రంగాన్ని చూసినా వారి కృషే దేశ ప్రగతికి పునాది. అయితే, వారి శ్రమకు తగిన సామాజిక భద్రత కల్పించడంలో చాలాకాలంగా కొన్ని లోపాలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భరోసా కల్పించే ఉద్యోగుల భవిష్య నిధి , ఉద్యోగుల పెన్షన్ పథకంలకు సంబంధించిన వేతన పరిమితి, కనీస పింఛన్ అంశాలు ఎన్నో సంవత్సరాలుగా చర్చనీయాంశాలుగా మారాయి. ఇలాంటి నేపథ్యంలో ఉద్యోగుల గరిష్ట వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచే ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ సానుకూలంగా స్పందించినట్లు వెలువడుతున్న సమాచారం లక్షలాది ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. అదే సమయంలోప్రస్తుతం నెలకు రూ.1,000గా ఉన్న కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు వస్తున్న సంకేతాలు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ఈరెండు నిర్ణయాలు అమలులోకి వస్తే ప్రైవేట్ రంగ ఉద్యోగుల సామాజిక భద్రతలో ఒక కీలక మలుపు తిరిగినట్లే అవుతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న రూ.15 వేల వేతన పరిమితి దాదాపు దశాబ్దం కిందటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయించబడింది. కానీ ఈ కాలంలో ద్రవ్యోల్బణం పెరిగింది. జీవన వ్యయం గణనీయంగా అధికమైంది. ఉద్యోగుల వేతనాల్లో కూడా మార్పులు వచ్చాయి. అలాంటి పరిస్థితుల్లో పాత పరిమితిని కొనసాగించడం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదనే అభిప్రాయం చాలా కాలంగా వ్యక్తమవుతోంది. అందుకే వేతన పరిమితిని రూ.25 వేలకు పెంచడం కాలానుగుణమైన సంస్కరణగా పరిగణించవచ్చు. ఈ మార్పు అమలైతే కొత్తగా మరింత మంది ఉద్యోగులు ఉద్యోగుల భవిష్య నిధి, ఉద్యోగుల పెన్షన్ పథకాల పరిధిలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఉద్యోగుల పొదుపు పెరగడమే కాకుండా, భవిష్యత్తులో వారికి లభించే పెన్షన్ కూడా మెరుగయ్యే అవకాశం ఉంటుంది. ఉద్యోగ భద్రతతో పాటు ఆర్థిక భరోసాకూడా బలపడుతుంది. దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇక కనీస పెన్షన్ పెంపు అంశం మరింత కీలకమైనది. ప్రస్తుతం అమల్లో ఉన్న రూ.1,000 నెలవారీ పెన్షన్ నేటి ధరల పరిస్థితుల్లో సరిపోదన్న అభిప్రాయం చాలా కాలంగా వినిపిస్తోంది. మందులు, వైద్య ఖర్చులు, అద్దెలు, నిత్యావసర వస్తువుల




ధరలు పెరిగిన ఈ రోజుల్లో వెయ్యి రూపాయలతో గౌరవ ప్రదమైన జీవితం గడపడం అసాధ్యమే. అందుకే కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని పెన్షనర్ల సంఘాలు ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ ఈ ప్రతిపాదన అమలైతే కోట్లాది పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అది ఆర్థికంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా గొప్ప ఊరటనిస్తుంది. ఉద్యోగ జీవితమంతా కష్టపడి దేశ ఆర్థిక వ్యవస్థకు సేవలందించిన వారికి వృద్ధాప్యంలో కనీస జీవన భద్రత కల్పించడం సంక్షేమ రాజ్య బాధ్యతగా భావించాలి. పెన్షన్ అనేది దానం కాదు, అది ఉద్యోగి తన సేవా కాలంలో సంపాదించుకున్న హక్కు అనే భావనకు మరింత బలం చేకూరుతుంది. అయితే ఈ సంస్కరణలు అమలవ్వాలంటే కేవలం ప్రకటనలతో సరి పోదు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, యజమానులు, కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి సమగ్ర కార్యాచరణను రూపొందించాలి. యజమానులపై అదనపు భారం పడకుండా, అదే సమయంలో ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతినకుండా సమతుల్య విధానం అవసరం.చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఆర్థిక సామర్థ్యాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం అసంఘటిత రంగ కార్మికులది. దేశంలోని భారీ సంఖ్యలో కార్మికులు ఇప్పటికీ సామాజిక భద్రత పరిధిలోకి పూర్తిగా రాలేదు. కాబట్టి వేతన పరిమితి పెంపు, కనీస పెన్షన్ పెంపుతో పాటు అసంఘటిత రంగ కార్మికులను కూడా సామాజిక భద్రతా వ్యవస్థలోకి తీసుకురావడానికి మరింత సమర్థమైన విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే ఈ సంస్కరణల అసలైన లక్ష్యం నెరవేరుతుంది. దేశం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఉద్యోగుల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడాలి. స్థూల దేశీయోత్పత్తి పెరగడం మాత్రమే అభివృద్ధి కాదు, ఆ అభివృద్ధి ఫలాలు ఉద్యోగులకు,పెన్షనర్లకు చేరినప్పుడే అదిసమగ్రాభివృద్ధిగా నిలుస్తుంది. ఉద్యోగ భద్రత, వృద్ధాప్యభరోసా, సామాజిక రక్షణ ఈ మూడు అంశాలు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరంగా ఉంటుంది. వేతన పరిమితి పెంపు, కనీస పెన్షన్ పెంపుపై కేంద్రం తీసుకోబోయే నిర్ణయాలు కోట్లాది కుటుంబాల జీవితాలను ప్రభావితం చేయగలవు.అందుకే ఈఅంశాన్ని కేవలం పరిపాలనా నిర్ణయంగా కాకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన కీలకసంస్కరణగా చూడాలి. ఉద్యోగుల ఆశలు నిజమయ్యేలా త్వరితగతిన తుదినిర్ణయాలు తీసుకుని అమలు చేస్తే, అది కేవలం వేతనజీవులకు మాత్రమే కాదు, దేశ ఆర్థికవ్యవస్థకు కూడా ఒక బలమైన పెట్టుబడిగా నిలుస్తుంది. ఉద్యోగుల శ్రమకు గౌరవం ఇవ్వాలంటేవారి భవిష్యత్తుకు భరోసాకల్పిం చడమే ఉత్తమ మార్గమని ప్రభుత్వంగుర్తిస్తే, ఈ నిర్ణయాలు భారత కార్మికచరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతాయి. •

# చక్కెర తీపి, సామాన్యుడికి చేదు ఎందుకైంది?

కాలగిరిశ్రీనివాస్ రెడ్డి

ఉదయం నిద్రలేచిన వెంటనే ఒక కప్పు టీతో రోజును ప్రారంభించే ప్రతి భారతీయుడి జీవితంలో చక్కెరకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇంట్లో అతిథి వస్తే టీ, పండుగ అయితే పాయసం, పుట్టినరోజు అయితే కేక్, శుభవార్త అయితే స్వీట్లు ప్రతి ఆనందంలో చక్కెరే తీపిని నింపుతుంది. అలాంటి చక్కెర ఇప్పుడు సామాన్యుడి వంటింట్లో విలాస వస్తువులా మారుతోంది. ఒకప్పుడు నిత్యావసర సరుకుల జాబితాలో నిశ్శబ్దంగా ఉండే చక్కెర, నేడు దేశ ఆర్థిక విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న అతిపెద్ద చర్చనీయాంశంగా నిలిచింది. కిలో రూ.45 వద్ద లభించిన చక్కెర ధర ఒక్కసారిగా రూ.65 దాటడం వెనుక కేవలం మార్కెట్‌లో సహజ కొరత మాత్రమే కాదు, ప్రభుత్వ ఇథనాల్ విధానం, మిల్లు యజమానుల వ్యాపార ప్రయోజనాలు, వాతావరణ అనిశ్చితి, ఆహార భద్రత పట్ల నిర్లక్ష్యం కలిసి ఈ సంక్షోభాన్ని సృష్టించాయి. దేశంలో చక్కెర కొరత ఏర్పడటానికి ప్రధాన కారణం చెరకు రసం, బిహెవీ మొలాసెస్‌ను భారీగా ఇథనాల్ తయారీకి మళ్లించడమే. చమురు దిగుమతులను తగ్గించి పెట్రోల్‌లో ఇథనాల్ కలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్లినప్పటికీ, దేశీయ ఆహార అవసరాలను సరిగా అంచనా వేయడంలో విఫలమైంది. దాదాపు 35 నుంచి 45 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తికి సమానమైన చెరకు రసం ఇథనాల్ కర్మాగారాలకు మళ్లిపోవడంతో మార్కెట్‌లో చక్కెర నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇంకోవైపు చక్కెర అమ్మకాలకంటే ఇథనాల్ సరఫరా ద్వారా చమురు కంపెనీల నుంచి వేగంగా, స్థిరంగా నగదు రావడం మిల్లు యజమానులకు మరింత లాభదాయకంగా మారింది. ఫలితంగా వారు చక్కెర ఉత్పత్తి కంటే ఇథనాల్ తయారీకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆహార భద్రత కంటే వ్యాపార లాభాలకే ప్రాధాన్యం దక్కిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయాలపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన చెరకు ఉత్పత్తి రాష్ట్రాల్లో వాతావరణ మార్పుల కారణంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ, ఇథనాల్ మళ్లింపుపై సమయానికి నియంత్రణలు విధించలేదు. ధరలు సామాన్యుడి అందుబాటును దాటిన తర్వాత మాత్రమే స్టాక్ పరిమితులు, దిగుమతి సుంకాల సడలింపు



వంటి చర్యలు తీసుకోవడం వల్ల మధ్యవర్తులు, నిల్వదారులు కోట్ల రూపాయలు ఆర్జించగా, వినియోగదారుడు మాత్రం భారాన్ని మోయాల్సి వచ్చింది. మరోవైపు చెరకు రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎరువులు, డీజిల్, కూలీల ఖర్చులు విపరీతంగా పెరగడం, ఎల్‌నినో ప్రభావంతో దిగుబడి, నాణ్యత తగ్గిపోవడం రైతును తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహ కాల అసలు లాభం మిల్లు యజమానులకు, వ్యాపార వర్గాలకే ఎక్కువగా చేరింది. పంట పండించిన రైతుకు మాత్రం తగిన మద్దతు ధర, స్థిరమైన ఆదాయం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రతి ఉదయం ఒక కప్పు టీతో మొదలయ్యే సామాన్యుడి జీవితంపై ఇలాంటి నిర్ణయాలు నేరుగా ప్రభావం చూపుతున్నాయి. చక్కెర ధర పెరగడం అంటే కేవలం టీ తీపి తగ్గిపోవడం కాదు, ప్రతి ఇంటి నెలవారీ ఖర్చు పెరగడం, చిన్న స్వీట్లు కూడా ఆలోచించి కొనాల్సిన పరిస్థితి రావడం. దేశ ఇంధన భద్రత పేరుతో ప్రజల ఆహార భద్రతను పణంగా పెట్టడం ఏ ప్రభుత్వానికీ సమర్థించదగిన ఆర్థిక విధానం కాదు. ఒక వైపు పెట్రోల్‌లో ఇథనాల్ కలిపి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తున్నామని చెప్పుకుంటూ, మరోవైపు అదే నిర్ణయంతో కోట్లాది కుటుంబాల వంటింటిపై అదనపు భారం మోపడం అభివృద్ధి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం దూర దృష్టితో వ్యవహరించాలి. దేశీయ చక్కెర నిల్వలు తగ్గే ప్రమాదం కనిపించిన ప్రతిసారీ నేరుగా చెరకు రసంనుంచి ఇథనాల్ తయారీపై కఠిన నియంత్రణలు అమలుచేయాలి. పండుగల సీజన్, అధిక డిమాండ్ ఉన్న కాలాల్లో ఇథనాల్ మళ్లింపును తగ్గించి,నిల్వలు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్ర మే పెంచే సౌకర్యవంతమైన విధానాన్ని రూపొందించాలి. రైతుకు గిట్టుబాటు ధర, మిల్లులకు స్థిరమైన వ్యాపారం, వినియోగదారుడికి అందుబాటు ధర ఈ మూడు లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన విజయమని చెప్పుకోవచ్చు. ఎందుకంటే దేశ అభివృద్ధి అంటే పెట్రోల్ ట్యాంక్ నిండడమే కాదు, ప్రతి ఇంట్లో ఉదయం టీ కప్పులో తీపి తగ్గకుండా ఉండటం కూడా అంతే ముఖ్యం. సామాన్యుడి కప్పులోని తీపిని కాపాడినప్పుడే ప్రభుత్వ విధానాలకు నిజమైన తీపి అర్థం వస్తుంది. •

# ప్రజావాక్కు

## ఆర్థిక వాస్తవాలను విస్మరించడమే

**అమెరికా** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌పై విమర్శలతోవిరుచుకుపడటం రెండుదేశాల మధ్య సంబంధాలపైఅనవసరమైన ఉద్రిక్తతను పెంచుతోంది. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ప్రపంచ దేశాలను సుంకాల బెదరింపులతో ఒత్తిడికి గురిచేయడం, అదే సమయంలో అమెరికా ప్రయోజనాలకోసం వాటి సహకారాన్ని కోరడం ఇది భాగస్వామ్యమా, ఆధిపత్యమా అన్న ప్రశ్నను లేవనెత్తుతోంది.ట్రంప్ విధానంలో కనిపించే మరో విరుద్ధత అమెరికా ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని విస్మరించడం. అమెరికా శక్తి కేవలం అమెరికన్ల ప్రతిభతో నిర్మించబడలేదు. ముఖ్యంగాసాంకేతిక,వైద్య, పరిశోధనారంగాల్లో ప్రపంచ ప్రతిభ అమెరికా అభివృద్ధికి కీలకమైన బలం. అటువంటి దేశం విదేశీ ప్రతిభను అనుమానంతో చూడటం, సంస్థలను కేవలం స్థానికులను నియమించుకోవాలని ఒత్తిడి చేయడం ఆర్థిక వాస్తవాలను విస్మరించడమే.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## అతి వినయం ..

**అవసరానికి** మించి అతిగావంగి నమస్కరిస్తూ, వినయం ప్రదర్శించేవారిని అసలు నమ్మకూడదు. వాళ్ళ నిజస్వరూపాన్ని,స్వార్థాన్ని కప్పిపుచ్చుకోవడానికి పైకి నకిలీ వినయాన్ని ప్రదర్శిస్తారు. ఎప్పుడూ తానే ప్రత్యేకంగా కనిపించాలని భావిస్తారు. ఇలాంటి వారు మనకు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటారు. ఎవరైనా మనపై అతిగా పొగడ్తలు కురిపించినా, విపరీతమైన మర్యాద చూపించినా, వారి పట్లఅప్రమత్తంగా ఉండాలి.పొగడ్తలు అవసరమేగానీ వాటిపైనే ఆధారపడకూడదు. పొగడ్తలను జాగ్రత్తగా గమనించకపోతే అన్ని విధాలనష్టపోతాం. కొందరు తమలోని చెడుగుణాలను కప్పిపుచ్చుకునేందుకు ఎదుటివారిముందు చాలా అతివినయం ప్రదర్శిస్తుంటారు. వినయవిధేయతలతో మెలగానేగానీ, అతి వినయం అసలు పనికిరాదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## పాఠాలు నేర్చుకోవాలి

నేపాల్ జల ప్రళయం నుండి భారత్ చాలా పాఠాలు నేర్చుకోవలసిఉంది.ముఖ్యంగాగ్లెషయర్ హిమాని నదాలు తొందరగాకరిగిపోకుండా ఉండేందుకు వాతావరణం సమతుల్యతను కాపాడే చర్యలు ఎన్నో చేయవలసి ఉంది. గ్రీన్ కవర్ పెంచడాన్ని ప్రాథమిక విధిగా చేర్చాల్సిన అవసరం ఉంది.ఇక టెక్నికల్ పేపర్స్ లోను జీవోలలోనూ ఆవిషయాలు దాచకుండా అప్రోచ్ అనేది తక్షణావసరం.

- భారత అవినాష్, జనగామ

## మోడీ, పుతిన్‌ల కారు బంధం

**గత** పర్యటనలలో భారత ప్రధాని మోడీ సాధారణంగా ఉపయోగించే అత్యంత విలాసవంతమైన, కట్టుదిట్టమైన భద్రత ఉండే 'రేంజ్ రోవర్' కారునువదిలి 'టయోటా ఫార్చ్యూనర్‌లో' పుతిన్‌ను తీసుకెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రష్యా అధినేత పుతిన్ కూడా తాను ఎప్పుడూ వాడే అత్యున్నత భద్రతా ప్రమాణాలు ఉన్న తన అధికారిక కారు'ఆరస్ సెనేట్ లిమోసిన్‌లో' కాకుండా 'ఫార్చ్యూనర్'లో ప్రయాణించారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత,ప్రోటోకాల్ నడుమ ప్రయాణాలు సాగించే ఇద్దరు దేశాధినేతలు భద్రతా ప్రమాణాలకు విభిన్నంగా ఒక సాధారణ కారును ఎంచుకోవడం ఇరుదేశాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా భావించవచ్చు. ఇటీవల మోడీతో పుతిన్ మరో సారి తమ ప్రత్యేక స్నేహాన్ని చాటుకున్నారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక భేటీ అనంతరం ఇద్దరు ఒకేకారులో ప్రయాణించారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## కొండ వాహనాలపై నియంత్రణ అవసరం

**తిరుమలలో** కార్లు, జీపులు, ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం కనిపిస్తోంది. భక్తుల నుంచి వారికి ఇష్టం వచ్చినట్లుగా అధిక మొత్తాలను వసూలు చేస్తున్నారు. అందినకాడికి దోచుకునే ఈ విధానాన్ని నియంత్రించాలి. కార్లు, జీపులు ఎక్కడపడితే అక్కడ నిలపకుండా చూడాలి. వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా నిలపడంవల్ల పాదచారులకు, భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. టీటీడీ బస్‌స్టాప్‌లలో కేవలం టీటీడీ ఉచిత బస్సులే ఉండేలా చూడాలి. ప్రైవేట్ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. తిరుమలలో వాహనాల విషయంలో క్రమశిక్షణ, నియంత్రణ తప్పనిసరిగా ఉండాలి. భక్తుల సౌకర్యం కోసం ఈఅంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

మన నిజ జీవితంలో ఏది కొనుగోలు చేయాలన్న విక్రయించాలన్న ప్లాస్టిక్ వాడకం జీవితంలో భాగమైపోయింది. నిరంతరం ప్లాస్టిక్ వినియోగించడం వలన మన జీవిత కాలం తగ్గిపోయే అవకాశంతో పాటు అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయంగా వాడితేనే ఇబ్బందులు ఉండకపోవచ్చు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# నదులలో నీరు ఉన్నా సాగునీరు ఇవ్వలేరా?

బొల్లిముంత సాంబశివరావు

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నదుల్లో నీటి నిల్వలు పడిపోయాయని, అందువల్ల కృష్ణాడెల్టాకు సాగునీరు ఇవ్వలేమని జూలై24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రివర్గ సమావేశం ప్రకటించింది. మంత్రివర్గ నిర్ణయాన్ని సమాచార మంత్రి కె.పార్థసారథి తెలియచేశారు. వరిపంట వేయవద్దని, వరి పంట వేస్తే తర్వాత నీరులేక నష్టపోయేది మీరేనని రైతులకు హెచ్చరిక జారీచేశారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాభావంతోపాటు కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు ఖరీఫ్‌కు చాలా ముందే ప్రకటించారు. ఆవిధంగా కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. కాని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోలేదు. నదుల్లో నీరునిల్వకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అలాంటి చర్యలు తీసుకోకుండా సాగునీటి విడుదల గురించి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. జూన్ 1 నుంచే కాల్వలకు నీరువిడుదల చేస్తామని మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామనాయుడు ప్రకటించారు. కృష్ణాడెల్టాకి జూలై 1 నుంచి, నాగార్జునసాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కేసీ కెనాల్కి వంశధార ఆయకట్టుకు జూలై 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని, రైతులు సేద్యానికి సిద్ధం కావాలని చెప్పారు. కృష్ణా డెల్టా ఆయకట్టుకి 150 టిఎంసిలు అవసరమని, బ్యారేజిలో 461 టిఎంసిల నీరు అందుబాటులో ఉందని కూటమి ప్రభుత్వం ప్రకటించి జూలై1న ప్రకాశం బ్యారేజీ నుంచి ఆర్భాటంగా నీరు విడుదల చేసింది. మంత్రుల ప్రకటనతో రైతాంగం ఖరీఫ్ సేద్యానికి సమాయత్తం అవుతూ ఉండగా రాష్ట్రప్రభుత్వం కృష్ణా డెల్టాకి సాగునీరు విడుదల చేయలేమని జూలై 24న ప్రకటించింది. మంత్రివర్గ ప్రకటన తర్వాత ఇరిగేషన్ శాఖ సమావేశం జరిగింది. ఆ సమావేశం అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరు ఎల్‌నినో ప్రభావం వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గాయని చెప్పారు. రాష్ట్రంలో 51 శాతం, కృష్ణా డెల్టాలో49శాతం లోటు వర్షపాతం ఉందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తాగునీటికే ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. పులిచింతల నీటిని కూడా తాగునీటి అవసరాలకే భద్రపర్చినట్లు వెల్లడించారు. గోదావరి ప్రవాహం తగ్గడంతో పట్టిసీమ ఎత్తిపోతల పంపింగ్‌పై ప్రభావం పడిందని అన్నారు. సీలేరు నీటి లభ్యత కూడా తగ్గిందని చెప్పారు. అందువల్ల కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదని చావు కబురు చల్లగా చెప్పారు. ప్రకాశం బ్యారేజి నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతాంగానికి హెచ్చరిక జారీచేశారు. కుడికాల్వ పరిధిలో రైతులు వరిసాగు చేయవద్దని చెప్పారు. ఆరుతడి పంటలు సాగుచేయాలని పేర్కొన్నారు. జూన్, జూలై నెలల మధ్య సాగు నీరు విడుదల విషయంలో కూటమి ప్రభుత్వ వైఖరిలో మార్పువచ్చింది. జూన్ నెలలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు విడుదల తేదీలను కూటమి మంత్రులు ప్రకటించారు. సాగుకి రైతులు సిద్ధం కావాలని చెప్పారు. మంత్రుల ప్రకటనతో అప్పులు చేసి సేద్యానికి కావాల్సిన వాటిని సమకూర్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఎకరాకు 10 వేలకు పైగా రైతులు సేద్యానికి ఖర్చుచేశారు.



ఇలాంటి పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల ఇప్పుడు సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెప్పడం వల్ల రైతాంగం తీవ్రమైన మనోవేదనకు గురౌతున్నారు. జూలై1లో 461 టిఎంసిల నిల్వఉన్న నీరు జూలై23 నాటికి ఏమైంది. సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం ఎలా చెప్పగలుగుతున్నది. ఎల్‌నినో ప్రభావం ముందుగానే కూటమి ప్రభుత్వానికి తెలుసుగా, తెలిసే సాగునీరు ప్రాంతాల వారిగా విడుదల చేస్తామన్నది గదా! ఇప్పుడు సాగునీరు విడుదల సాధ్యం కాదని చెప్పడం రైతులను మోసం చేయడం కాదా! సేద్యంపైనే చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆధారపడి ఉన్న విషయం కూటమి ప్రభుత్వానికి తెలియదా, ఆ కుటుంబాల పరిస్థితి ఏమికావాలి. సాగునీరు విడుదల గురించి ప్రభుత్వం చెప్పే మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి.జలవనరుల వ్యవస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రకాశం బ్యారేజి నీటినిల్వ 2.978 టిఎంసిలు కాగా, పూర్తి నీటిమట్టం 3.071 టిఎంసిలు. అంటే పూర్తి నీటి మట్టానికి అతితక్కువ మాత్రమే. 96.97 నీటి నిల్వతో సురక్షితంగా ఉన్నందువల్ల సాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేదని నిపుణులు చెబుతున్నారు. డెడ్ స్టోరేజికి చేరాలంటే 2 టిఎంసిల కంటే తక్కువ ఉండాలి. బ్యారేజిలో నీరులేనప్పుడు సాగునీరు ఇవ్వాల్సి వస్తే, నాగార్జున సాగర్లేదా పులిచింతల నుంచి నీరు విడుదల చేయాలి. పులిచింతలలో ప్రస్తుతం 29.039 టిఎంసిలనీరు ఉంది. సాగు, తాగునీటి అవసరాలకు నీటిని దిగువకు విడుదల చేయవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. మరి కూటమి ప్రభుత్వం సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదు. గతంలో బ్యారేజిలో ఇంతకన్నాతక్కువనీరు ఉన్నప్పుడే సాగునీరు విడుదల చేయడం జరిగింది. కృష్ణా డెల్టాలో ప్రధాన సేద్యం వరి. అలాంటి వరిసేద్యం చేయవద్దంటే, రైతులు ఖరీఫ్ సేద్యానికి దూరం కావడమేగదా! ఆగస్టు నెల నాటికి పూర్తిగా సేద్యం జరగాలి. ఆ తర్వాత పంటలు వేసినా ప్రయోజనంలేదు. నల్లరేగడి భూముల్లో ఇప్పుడు ఆరు తడిపంటల సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆరుతడి పంటలకు మళ్లడం కూడా రైతులకు చాలా ఇబ్బందికరం అవుతుంది. వరిసేద్యం జరగకపోతే ఆహార సమస్యకూడా ముందుకు వస్తుంది. రెండు కోస్తాతీర ప్రాంతాల్లోని చాలా జిల్లాల్లో వరిపంట తర్వాత జొన్న, మొక్కజొన్న పంటవేస్తారు. ఈపంటలు రైతులకు కొంత మిగులు ఆదాయాన్ని ఇస్తున్నాయి. ప్రకాశం బ్యారేజి కుడి, ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల చేయకపోతే ఆ పంటల సేద్యం సాధ్యం కాదు. అందువల్ల రైతులకు తీవ్రనష్టం జరుగుతుంది. ఆరుతడి పంటలు వేయమనే కూటమి ప్రభుత్వం, అందుకు అవసరమైన వాటిని కూడా ముందు జాగ్రత్తగా సిద్ధం చేయలేదు. రైతులు వాటిని సమకూర్చుకోవాలంటే అనేక అవస్థలుపడాలి. అవస్థలు పడి ఆరుతడి పంట వేసినా చేతికి వస్తాయనే నమ్మకంలేదు.వరిపంట వల్ల మిగులు ఎక్కువలేకపోయినా నష్టం అనేది తక్కువగా ఉండటంతో రైతాంగం వరిపంట సాగుకే మొగ్గుచూపుతున్నారు.నేడు సాగునీటి సమస్యకు పాలకుల విధానాలే కారణం. ఎల్‌నినో ప్రమాదం గురించి ముందుగానే సమాచారం ఉన్నప్పుడు నదుల నీటినిల్వల గురించి సరైన చర్యలు తీసుకోవాలి. అలాంటి చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకోలేదు.భారతదేశంలో అత్యధిక చెరువులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ముందు ఉంది. 2023లో కేంద్ర ప్రభుత్వ లెక్కలప్రకారం రాష్ట్రంలో 1,90,777 నీటి వనరులుండగా, వాటిల్లో 99.7 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో 81,703 చెరువులు పంచాయతీ ఇరిగేషన్ వంటి ప్రభుత్వశాఖల పరిధిలో ఉన్నాయి. ఈ చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుని, పూడికలు తీసి నీటితో వాటిని నింపి ఉంటే, వాటి ద్వారా సాగునీరు లభించేది.చెరువులను కాపాడే చర్యలను ఏ ప్రభుత్వం తీసుకోలేదు. పట్టిసీమ ఎత్తిపోతల పంపింగ్ గురించి గొప్పలు చెప్పేకూటమి ప్రభుత్వం ముందుగానే కృష్ణాబ్యారేజికి నీరు పంపింగ్ ఎందుకు చేయలేదు. ఇప్పుడు పంపింగ్ చేయడం సాధ్యంకాదని ఎందుకు చేతులుఎత్తింది. చెరువులను నీటితో నింపి, నిర్మాణంలో ఉన్నప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఈపరిస్థితుల్లో కూడా తాగు, సాగునీరు సమస్య తీరేదిగదా! ఇది పాలకుల వైఫల్యం కాదా !. •



మంగళవారం తిరుమలేశుని ఆలయం వద్ద కుటుంబసభ్యులతో కలిసి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

## అంతా మంచి జరగాలని వేడుకున్నాం

### తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**తిరుమల, సెప్టెంబరు 1, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, అంతామంచిజరగాలని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబంతో కలసి ఆయన శ్రీవారి అష్టదళ పాదపద్మారాధన సేవలో పాల్గొని అనంతరం స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పిం చారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కర్నూలులో అనుమానిత ఉగ్రవాది అరెస్టు

### సికిందరాబాద్‌కు చెందన నూర్‌మహమ్మద్‌గా గుర్తింపు

### పాక్ ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు అనుమానాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** సికింద్రాబాద్‌కు చెందిన నూర్ మహమ్మద్ అనే అనుమానిత ఉగ్రవాదిని కేంద్ర నిఘా వర్గాలు మంగళవారం నాడు కర్నూలు నగర శివార్లలోని గొందిపర్ల ప్రాంతంలో గల ఓ ఫ్యాక్టరీలో అరెస్టు చేశాయి. కొన్ని నెలల క్రితం కర్నూకుకు వెళ్లిన ఈ యువకుడు అక్కడ ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. పాక్‌లోని ఉగ్రవాదులతో నూర్ మహమ్మద్ చాటింగ్ చేస్తున్నట్లు భారత్‌లో ఉగ్రవాద కార్యక లాపాలకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. సికింద్రాబాద్‌కు చెందిన ఇతను కొన్నేళ్లుగా ఉగ్రవాదులతో సంబంధాలు కలిగివున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో ఇతనిపై నిఘా వుంచగా సికిందరాబాద్ నుంచి మకాంను కర్నూలుకు మార్చాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న నిఘా వర్గాలు మంగళవారం మధ్యాహ్నం దాడిచేసి పట్టుకున్నాయి. నూర్ మహమ్మద్ అరెస్టు కర్నూలు తో పాటు హైదరాబాద్‌లోనూ కలకలం రేపింది. నిందితుడని హైదరా బాద్‌కు తరలించిన పోలీసులు రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. ఎంతమంది ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఘాటెక్కిన ఉల్లి..

## కిలో రూ.60 పైకి చేరిన ధర

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** హైదరా బాద్‌తో పాటు, రాష్ట్రంలో ఉల్లి ధరలు ఘాటె క్కాయి. రెండు నెలల క్రితం వరకు నగరంలో కిలో ఉల్లి ధర రూ.20 ఉండేది. గత నెలలో రూ.35 వరకు ఉండగా, ప్రస్తుతం ఆ ధరలు రెండింతలు అయ్యాయి. తాజాగా మార్కెట్‌లో ఉల్లి కొనాలంటే కిలోకు రూ.60 పైనే చెల్లించాల్సి వస్తోంది. ఎల్ నినో వర్షాభావం, మరోపక్క కొన్ని రాష్ట్రాల్లో భారీ వర్షాల నేపథ్యంలో ఉల్లి పంట దిగుబడి గణనీయంగా తగ్గుదల చోటు చేసుకుంది. రాబోయే రోజుల్లో ఈ ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా. కాగా హైదరాబాద్ నగరంలో ఉల్లికి భారీగా డిమాండ్ ఉంటుంది. హోటల్స్, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు ఉల్లిని భారీగా కొనుగోలు చేస్తుంటారు. దీంతో గతంలో రోజుకు 20 నుంచి 25 వేల క్వింటాళ్ల వరకు ఉల్లి దిగుమతి అయ్యేది. కానీ ఆగస్టు 31న మాత్రం కేవలం 11,870 క్వింటాళ్ల మాత్రమే దిగుమతి అయింది. ఇక హైదరాబాద్ నగరానికి ప్రధానంగా మహారాష్ట్రలోని నాసిక్ నుంచి అధికంగా ఉల్లి వస్తుంది. అక్కడ వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ పంట సాగు ఆలస్యమైంది. దీనికి తగినట్లుగా పాత ఉల్లి ఉంటే అది అకాల వర్షా లకు తడిసిపోయి దెబ్బతిన్నది. దీంతో సరఫరా తగ్గిపోయింది. కొత్త పంట మార్కెట్‌లోకి వచ్చేందుకు ఆలస్యం కావడం, పాత నిల్వలు అయిపోవడంతో హోల్ సేల్ మార్కెట్‌లోకి వచ్చే ఉల్లి పరిమాణం గణనీయంగా తగ్గిపోయింది. నాణ్యమైన ఉల్లి ధర రూ. 60(కిలో) పలుకు తోంది. రైతుబజార్లలో రూ.35.40 వరకు ఉండగా మహబూబ్‌మాన్షన్, బోయిన్‌పల్లి, గుడి మల్కాపూర్ మార్కెట్లలో క్వింటాల్ రూ.3,200 నుంచి రూ.4 వేల వరకు ఉంది.



మీడియాతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

## కాంగ్రెస్‌ది ప్రజావంచిత పాలన

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొన సాగుతున్న కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదని, ప్రజా వంచిత పాలన అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఘాటుగా విమర్శించారు. మంగళవారం నల్గొండ జిల్లాకు బయలుదేరుతున్న రామచంద్రరావును పోలీసులు తార్నాకలో అడ్డుకుని, అరెస్ట్ చేసి, గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని వెయ్యి రోజుల పాలనా వేడుకలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో మోసపోయారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని, రైతులకు 40వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉండగా 18వేల కోట్లు మాత్రమే చేశారని గుర్తు చేశారు. 40 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ 15వేల కోట్లు ఎప్పుడు మంజూరు చేస్తారని, విద్యార్థులకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లకు బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. వెయ్యి రోజుల్లో వెయ్యి అబద్ధాలు ఆడారని విమర్శించారు. బీసీ, ఎస్సీ రైతు డిక్లరేషన్ ఏమైందన్నారు.

హైదరాబాద్‌లో ప్రజలు 22ఏ తో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తోడు దొంగలని ధ్వజమెత్తారు. త్వరలో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

CHURCH OF SOUTH INDIA - MEDAK DIOCESE
CSI INSTITUTE OF TECHNOLOGY
School of Architecture & Planning
(Approved by Council of Architecture, New Delhi.)
(Affiliated to Jawaharlal Nehru Architecture & Fine Arts University - Hyderabad)
145 McIntyre Road, Sec'bad-03, TG - India.
e-mail : csiit.ts02@gmail.com
B.Arch. Code: CSIT
B.Arch. Admissions- Under 'B' Category
(Management Quota) – Year 2026-27
Applications can be had from the college office on all working days from 10.00 A.M. to 4.00 P.M. The last date for submission of filled-in applications is 08-09-2026.
Tuition Fee per annum Rs.85,000/-.

| Course | Intake | Seats |
| --- | --- | --- |
| B.Arch. | 80 | 24 |

Students who have qualified in NATA-2025/2026 or JEE Paper-2 are eligible to apply.
For further details please visit : www.jnafau.ac.in; https://tgche.ac.in; www.coa.gov.in; https://barchadm.tgche.ac.in; http://csiit-sap.ac.in
PRINCIPAL / MANAGER

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

### నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన

### సాంకేతిక నివేదిక తర్వాత తదుపరి చర్యలు

### కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు1:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. ఢిల్లీలో మంగళ వారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.




తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గురు _చేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. 'భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## కారుతో ఢీకొట్టి పారిపోయిన ఆర్ట్ డైరెక్టర్ కుమారుడు అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఐటి కారిడార్‌లో రోడ్డు దాటుతున్న వ్యక్తిని ప్రమాదాల రూపంలో మృత్యువు వెంటాడింది. ఓ కారు ఢీకొట్టడంతో గాయపడిన వ్యక్తిని రోడ్డుకు అవతలి వైపు ఉన్న ఆసుపత్రికి తరలిస్తుండగా, మరో రెండు కార్లు వేగంగా వచ్చి ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ప్రమాదంలో గాయపడిన క్షత గాత్రుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతన్ని తరలిస్తున్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా మితిమీరిన వేగంతో వచ్చి రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టి కారుతో సహా పరారైన వ్యక్తిని ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి కుమారుడిగా గుర్తించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. రాయ దుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

బీహార్‌కు చెందిన నందకిషోర్ కుమార్ రే(21) బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గచ్చిబౌలిలోని షాగౌస్ హోటల్‌లో వంటపని హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను సోమవారం మధ్యాహ్నం తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లాడు. కాగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఖాజాగూడ రోటరీ వద్ద రోడ్డు దాటుతున్న నందకిషోర్‌ను ఔటర్ రింగురోడ్డు నుంచి



ఖాజాగూడ వైపు వస్తున్న ఇన్నోవా (టిఎస్09 ఈడబ్ల్యు7700) కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నందకిషోర్‌కు గాయాలు కాగా ఇన్నోవా కారు డ్రైవర్ జైద్‌షా ఖాద్రీ(21), మరో క్యాబ్ డ్రైవర్ అమీర్‌తో కలిసి రోడ్డుకు అవతలి వైపు ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. నందకిషోర్‌ను ఇరువైపులా పట్టుకొని రోడ్డు దాటుతుండగా, ఖాజాగూడ నుంచి ఔటర్ రింగురోడ్డు వైపు వేగంగా, నిర్లక్ష్యంతో వెళ్తున్న ఓ మహీంద్రా కారు, మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్షతగాత్రుడు నందకిషోర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, ఇన్నోవా కారు డ్రైవర్ జైద్‌షా ఖాద్రీకి గాయాలయ్యాయి. కాగా ప్రమాదం అనంతరం వీరిని ఢీకొట్టిన మహీంద్రా కారు డ్రైవర్ కారుతో సహా అక్కడి నుంచి పారిపోయాడు.

సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని నందకిషోర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా కారుతో ఢీకొట్టి ప్రమాదానికి కారణమై అక్కడి నుంచి పారిపోయిన మహీంద్రా కారును పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా గుర్తించారు. ఈ కారు ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్ ఆనంద్ కారుగా గుర్తించిన పోలీసులు ప్రమాద సమయంలో సందీప్ ఆనంద్ కారు నడుపుతున్నట్లు తేల్చారు. గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్న సందీప్ ఆనంద్ అతివేగంగా, నిర్లక్ష్యగా కారు నడపడంతో ప్రమాదంలో గాయపడి స్థానికులతో రోడ్డు దాటుతున్న క్షతగాత్రుడు మృతిచెందగా, క్షతగాత్రుడిని రోడ్డు దాటిస్తున్న మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ మేరకు సందీప్ ఆనంద్‌ను అరెస్టు చేసిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (అత్తాపూర్) సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** 8వ తరగతి చదు వుతున్న ఓ విద్యార్థి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన విషాదం ఘటన రాజేంద్ర నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు మండలం గోపాన్ పేట్‌కు చెందిన మోహన్, భార్య జ్యోతి, కూతురు, కుమారుడు ప్రశాంత్‌తో కలిసి బన్సీలాల్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం తండ్రి ఆటో తీసుకొని బయటికి వెళ్లగా తల్లి జ్యోతి కుమార్తెను హాస్టల్‌లో వదిలేయడానికి వనపర్తి వెళ్లింది. ఈ క్రమంలో 8వ తరగతి చదువుతున్న కుమారుడు ప్రశాంత్(14) ఇంట్లోనే ఒంటరిగా ఉన్నాడు. మధ్యాహ్నం తండ్రి కుమారుడికి ఫోన్‌చేసి మాట్లాడాడు. రాత్రి 7 గంటల సమయంలో మళ్లీ కుమారుడు తిన్నడా లేదా అన్ని తెలుసుకోవడానికి తండ్రి ఫోన్ చేయగా స్పందించలేదు. వెంటనే ఇంటికి వచ్చి చూడగా కుమారుడు ఉరివేసుకొని కనిపించాడు. కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అయితే రెండు నెలల క్రితం స్కూల్ వెళ్లమని కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుండి వెళ్లిపోయాడని తిరిగి రెండు రోజుల క్రితం వచ్చినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## డిజిపి ఆనంద్‌ను కలిసిన బిజెపి నేతలు

### కాంగ్రెస్ పార్టీ దాడులపై చర్యలు తీసుకోవాలని వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త: బిజెపి నేతలు పాయల్ శంకర్, కల్యాణ్ నాయక్, తాడూరి శ్రీనివాస్, రవికుమార్ తదితరులు మంగ ళవారం నాడు డిజిపి సి.వి ఆనంద్‌ను కలిశారు. నగరంలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో బిజెపి కార్యాలయాలు, నాయకుల ఇళ్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన దాడులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిజిపిని కోరారు. యూ త్ కాంగ్రెస్ నేతలు సోమవారం నాడు నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంపై దాడులు చేశారని, మంగళవారం ఉదయం నల్లగొండతో పాటు మరికొన్నిచోట్ల ఇదే తరహా దాడులకు పాల్పడ్డారని వారు తెలి పారు. కాంగ్రెస్ పార్టీ దాడులపై తాము మౌనంగా వున్నామని వారు డిజిపికి వివరించారు. ఈ దాడులకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు డిజిపికి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

## బంగారం కొనకండి.. స్వదేశీ వస్తువులే వాడండి

### దేశ ప్రజలకు ప్రధాని మరోసారి పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలున్నా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులు, సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరం లేని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దని చెప్పారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కిర్గిజిస్థాన్ నుంచి మంగళవారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విడుదల చేసిన వీడియోలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో దేశ జిడిపి 7.8 శాతం పెరిగిందని సోమవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి. 'విదేశీ దేశాలకు పర్యటనల కోసం వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దు. 'వెడ్ ఇన్ ఇండియా' నినాదాన్ని పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు అని ప్రధాని మోడీ దేశ ప్రజలకు సూచించారు. భారత్ స్వావలంబన సాధిస్తే స్వాతంత్ర్యం వచ్చిన వందేళ్ల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## ఢిల్లీలో పార్లమెంట్‌హాల్‌లో సిపిఎ కాన్ఫరెన్స్ సన్నాహక సమావేశం

### తెలంగాణ నుంచి హాజరైన మండలి చైర్మన్, స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 1:** కామన్వెల్త్ పార్లమెంటరి అసోసియేషన్ (సిపిఏ) కాన్ఫరెన్స్ సన్నాహక సమావేశం మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ కమిటీ హాల్ లో జరిగింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సన్నాహక సమావేశం జరిగింది. దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో ఈనెల 13 నుండి 19 వరకు జరగనున్న 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సిపిసి)లో పాల్గొనే భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి దిశానిర్దేశం చేయడానికి ఈ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ముఖ్య ముఖ్యాంశాలు:భారత ప్రాతినిధ్యం: ఈ సమావేశంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్, వివిధ రాష్ట్రాల శాసనసభల స్పీకర్లు, డెప్యూటీ స్పీకర్లు, పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.ప్రధాన అజెండా: అంతర్జాతీయ పార్లమెంటరీ ఫోరమ్‌లలో భారతదేశ ప్రాధాన్యతలను, ప్రజాస్వామ్య విలువలను సమర్థవంతంగా వినిపించడంపై స్పీకర్ సభ్యులకు అవగాహన కల్పించారు. చర్చించబోయే అంశాలు: రాబోయే కేప్‌టౌన్ సదస్సులో సాంకేతికత, ఆర్థిక రంగం, పర్యావరణం, భౌగోళిక రాజకీయ మార్పుల వల్ల ప్రజాస్వామ్య సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లపై భారత ప్రతినిధులు చర్చించనున్నారు. మహిళా, యువత ప్రాతినిధ్యం: ఈ సదస్సులో భాగంగా 10వ కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల కాన్ఫరెన్స్, యువత కోసం ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు కూడా జరగనున్నాయి తెలంగాణ నుంచి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి,మండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు,ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఆరోగ్యశాఖలో తుది దశకు భారీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ

### 1,931 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఆరోగ్యశాఖలో మరో భారీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బి) మంగళవారం విడుదల చేసింది. 1:1.25 చొప్పున 1931 పోస్టులకు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసినట్టు బోర్డు పేర్కొంది. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు సెప్టెంబర్ 16 నుంచి 26 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని వెంగల్‌రావ్‌నగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరగనుంది. నిర్ణీత తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు అవ్వని అభ్యర్థులు, సర్టిఫికెట్లు అందజేయలేని అభ్యర్థుల కోసం సెప్టెంబర్ 28వ తేదీని రిజర్వ్‌గా నిర్ణయించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయంలో అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ప్రతి సర్టిఫికెట్‌కు రెండు సెట్ల ఫొటోకాపీలను తీసుకుని హాజరుకావాలని బోర్డు సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయనున్నట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది.ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు ఇతర వైద్య సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని గుర్తించిన ప్రభుత్వం.. ఆరోగ్య శాఖలో రెండున్నర సంవత్సరాల్లోనే 15 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసింది. మరో 2 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

## OBITUARY

With profound grief, we inform you that



**Dr. Latika Mahendra**

Wife of Dr. Nagendra Mahendra

passed away on 31st August 2026.

The funeral procession will leave the residence at 3:00 p.m. on 2nd September 2026 from:

16-11-20/1/4, Saleemnagar Colony, Malakpet, Hyderabad

The last rites will be performed at 5:00 p.m. at Mahaprasthanam, Whisper Valley.

Deeply mourned by
**Mahendra Family**

Contact: 98480 18320 | 94902 34282

## సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

### నవంబరు 17న రాష్ట్రవ్యాప్తంగా

### సిపిఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీ యూనియన్ డిమాండ్ చేసింది. సీపీఎస్ రద్దు కోసం నవంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవును అమలు చేస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ తెలిపారు. సెప్టెంబర్ 1, 2004న జారీ చేసిన జీవో నంబర్లు 653, 654, 655 ద్వారా ఆ రోజు, ఆ తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం రద్దు చేసి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) అమలు చేయబడిందని.. దానికి నిరసనగా సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్‌ల రాష్ట్ర వ్యాప్త సిపిఎస్ ఉద్యోగులు తమ కార్యాలయాల్లో నల్లరిబ్బన్, బ్యాడ్జిలతో, ప్లకార్డ్స్‌తో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరిపినట్టు తెలిపారు. సచివాలయంలో సైతం మధ్యాహ్న భోజన విరామ సమయంలో (లంచ్ అవర్ డెమాన్స్ట్రేషన్) నిరసనలు తెలిపి ప్రభుత్వానికి తమ సామాజిక భద్రత పట్ల ఓపీఎస్ అమలు పట్ల స్పష్టం చేశారని స్థితప్రజ్ఞ తెలిపారు. నవంబరు 17న రాష్ట్రంలోని 2.68 లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ విధిగా సామూహిక సెలవు పాటించాలని, ఓపీఎస్ ఉద్యోగులు సైతం మద్దతు తెలపాలని, రాష్ట్రంలోని రెండు జేఏసీలు కూడా మద్దతు తెలపాలని కోరారు. ఆయా రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకుని సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, దక్షిణాది రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని విజ్ఞప్తి చేశారు.



## శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

### రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు

### కుటుంబసభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మంత్రి సీతక్క హామీ

**భద్రాద్రి కొత్తగుడెం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చవిటిగూడెంలో మంత్రి సీతక్క మంగళవారం పర్యటించారు. ఇటీవల హైదరాబాద్‌లో హత్యకు గురైన నర్సు శిరీష కుటుంబసభ్యులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చిన మంత్రి సీతక్క, గిరిజన యువతి శిరీష హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని, కుటుంబంలో అర్హత కలిగిన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని గ్రామస్తుల సమక్షంలో హామీ ఇచ్చారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ఇలాంటి దారుణ ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బాధిత కుటుంబం ధైర్యంగా ఉండాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని భరోసా కల్పించారు. మంత్రి సీతక్క హామీతో బాధిత కుటుంబ సభ్యులకు కొంత ఊరట లభించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ గెలలకు ఆల్‌టైమ్ రికార్డు

### రూ.24 వేలకు చేరిన టన్ను గెలల ధర

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల పంట పండింది. అంతర్జాతీయ మార్కెట్లలో పామాయిల్ ధరల కదలికలు, ఉత్పత్తి పరిస్థితులు తదితర అంశాల ప్రభావంతో గెలల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్ పామ్ గెలల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. టన్ను గెలల ధర రూ.24,025కు పెరిగింది. దేశంలో ఆయిల్ పామ్ సాగు చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదేనని అధికారులు తెలిపారు. దీంతో ఆయిల్ పామ్ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై నెలలో టన్ను గెలలకు ధర రూ.23,783 అమలులో ఉండగా, ఆగస్టు నెల చివరి నాటికి మరో రూ.242 పెరిగి అది రూ.24,025కు చేరింది. పెరిగిన ధరను ఆగస్టు నెలకు వర్తింపజేయనున్నట్లు తెలంగాణ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఇక గెలల ధర పెరగడమే కాకుండా రైతులకు చెల్లింపుల విషయంలోనూ ఆయిల్‌ఫెడ్ కీలక మైలురాయిని చేరింది. ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా సుమారు రూ.175 కోట్లను ఆయిల్ పామ్ రైతులకు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఒకే నెలలో ఇంత భారీ మొత్తాన్ని రైతులకు చెల్లించడం సంస్థ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఆయిల్ పామ్ పంటకు సాధారణ పంటలతో పోలిస్తే దీర్ఘకాలిక పెట్టుబడి, నిర్వహణ అవసరమైనప్పటికీ గెలల ధరలు మెరుగ్గా ఉంటే రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రికార్డు ధర నమోదవడం వల్ల సాగు విస్తీర్ణం పెంచుకోవాలనుకునే రైతుల్లోనూ ఆసక్తి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

## నూతన మూల్యాంకన విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

### విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయంపై సర్కారు జోక్యం చేసుకోవాలి: ఆర్‌యుపిపి టిఎస్

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** పాఠశాల విద్యలో విద్యార్థుల సమగ్ర వికాసం, ఒత్తిడి లేని అభ్యసనం, నిరంతర మూల్యాంకనం లక్ష్యంగా అమలు లోకి వచ్చిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానానికి విరుద్ధంగా సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ1, ఎస్ఏ2) పరీక్షలకు ఎక్స్‌టర్నల్ ఎవల్యూ షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఆందోళనకరమని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యుపిపి టిఎస్) రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సిములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిరాజు శశియాదవ్ విమర్శించారు. సీసీఈ అనేది కేవలం పరీక్షల విధానం కాదని, విద్యార్థి సమగ్ర వికాసాన్ని నిరంతరం అంచనా వేసే విద్యా ప్రక్రియ అని పేర్కొన్నారు. విద్యార్థిని రోజువారీ తరగతి గదిలో పరిశీలిస్తూ, అతని సామర్థ్యాలు, లోటుపాట్లను గుర్తించి ఎప్పటికప్పుడు సరిదిద్దే బాధ్యత బోధిస్తున్న ఉపాధ్యాయుడి దేనన్నారు. బోధించిన ఉపాధ్యాయుడికి విద్యార్థి అభ్యసన స్థాయి, సామర్థ్యాలు, లోటుపాట్లపై పూర్తి అవగాహన ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో బయట ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించడం వల్ల సీసీఈ మౌలిక ఉద్దేశమే దెబ్బతింటుందన్నారు. ఎక్స్‌టర్నల్ ఎవల్యూషన్ వల్ల విద్యార్థుల్లో గతంలో ఉన్న పరీక్షల భయం, ఒత్తిడి మళ్లీ పెరిగే అవకాశం ఉందని, ఇది భయరహిత అభ్యసనం అనే సీసీఈ లక్ష్యానికి విరుద్ధమన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న కీలకమైన విద్యా విధానంలో మార్పు తీసుకు రావడం సాధారణ పరిపాలనా నిర్ణయం కాదనీ వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాన్ని అమలు చేయాల్సిన శాఖాధిపతి, స్వతంత్రంగా ఆ విధానం స్వరూపాన్నే మార్చే నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఇంత కీలకమైన మార్పుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

### ఖనిజాల పరిశోధనకు త్రిముఖ భాగస్వామ్యం

### మోనాష్-ఐఐటీ హైదరాబాద్-సింగరేణి సంయుక్తంగా

### ముందడుగు: ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు1:** క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ కేవలం వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండ కూడదని, మొత్తం విలువ శృంఖలలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా, వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ భాగస్వామ్యానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి వేదికగా మల చాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం చేయడం ద్వారా ఖనిజాల



అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే విధానాలపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని ఆయన చెప్పారు.

## తెలంగాణ వర్సిటీలతో సహకారానికి బర్మింగ్‌హామ్ వర్సిటీ ఆసక్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** తెలంగాణ విశ్వవిద్యాలయాలతో సహ కారానికి యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ ఆసక్తి చూపించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రొఫెసర్, డిప్యూటీ ప్రోవైస్‌ఛాన్సలర్ (ఇండియా) ప్రొఫెసర్ మార్క్ లీ, బర్మింగ్‌హామ్ గ్లోబల్, రీజినల్ డైరెక్టర్ – సౌత్ ఏసియా అండ్ మిడిల్ ఈస్ట్ దేవేష్ ఆనంద్ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డిని మంగళవారం కలిశారు. సుమారు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌కు వాతావరణ మార్పులు, పర్యావరణం, సస్టైనబిలిటీ స్టడీస్‌తో పాటు స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రాధాన్యత ఉంది. తెలంగాణలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, సంయుక్త పరిశోధనలు, తగిన భాగస్వామ్య విశ్వవిద్యాలయాల గుర్తింపు, బహుళశాఖా, సాంకేతికత నైపుణ్య ఆధారిత కోర్సులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, క్లీన్ ఎనర్జీ, ఏఐ, గవర్నెన్స్, ఎథిక్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పరిశ్రమల భాగస్వామ్యం, సంయుక్త పరిశోధనలు, ప్రచురణలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి ప్రపంచ మార్కెట్‌లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యను తీర్చిదిద్దేందుకు ఉన్నత విద్యామండలి చేపడుతున్న వినూత్న చర్యలను ప్రతినిధులకు వివరించారు. కొత్త అండర్‌గ్రాడ్యుయేట్ కరిక్యులమ్‌లో తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌లు, అనుభవాత్మక అభ్యసనం, సాంకేతికత ఆధారిత కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉపాధి సామర్థ్యం, నైపుణ్యాలు, పరిశ్రమలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. అలాగే పరిశ్రమ–విద్యాసంస్థల భాగస్వామ్యంతో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ భారత క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ఆహ్వానించారు. తెలంగాణలోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్‌లో నిర్వహించనున్న రైజింగ్ తెలంగాణ సమ్మిట్‌లో యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ పాల్గొనాలని ఆయన ఆహ్వానించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలో విద్య, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు మరియు సంస్థాగత భాగస్వామ్యాల విస్తరణకు మరిన్ని అవకాశాలను అన్వేషించవచ్చని తెలిపారు.

## జోనల్ కార్యాలయంలో ఎల్ఐసి ఆవిర్భావ దినోత్సవం



**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ఎల్ఐసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం జోన్ కార్యాలయ భవనంలో ఎల్ఐసి జెండాను దక్షిణ మధ్య జోన్ జోనల్ మేనేజర్ ఎస్. శరవణ రమేష్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రెండవ అత్యంత బలమైన ఇన్సూరెన్స్ బ్రాండ్‌గా ఎల్ఐసి గుర్తింపు పొందడం అందరికీ గర్వకారణమన్నారు. 2025–26లో పాలసీల పరంగా 65.16 శాతం మార్కెట్ వాటాతో, అలాగే మొదటి ఏడాది ప్రీమియం ఇన్‌కమ్‌లో 56.66 శాతంతో ఎల్ఐసి మార్కెట్‌లో నాయకత్వ స్థానాన్ని కొనసాగిస్తోందన్నారు. సంస్థ నిర్వహణలో ఉన్న మొత్తం అస్తుల విలువ 5.08 శాతం పెరిగి రూ.57.29 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. ఎల్ఐసి ఇచ్చిన హామీలు, చేసిన కట్టుబాట్లను నిలబెట్టుకోవడం వల్లనే ప్రజల్లో నమ్మకం ఏర్పడిందని చెప్పారు. మార్కెటింగ్, సర్వీసింగ్‌కు సంబంధించి అనేక అంశాల్లో దేశంలోనే దక్షిణ మధ్య జోన్ అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. పర్యావరణ హితమైన విధానంలో కార్యాలయాలను పూర్తిగా పేపర్‌లెస్‌గా మార్చాలని సూచించారు.

## జిఒ 97ను ప్రభుత్వం విరమించుకోవాలి

### పాలిటెక్నిక్ విద్యను తీసేయాలని చూస్తే ఉద్యమం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ప్రభుత్వం తెచ్చిన జిఒ 97ను విరమించుకోవాలని అలా కాకుండా పట్టింపులకు పోతే కాంగ్రెస్ ప్రభుత్వానిదే పరువు పోతుందని రాజ్యసభ ఎంపి ఆర్. కృష్ణయ్య సూచించారు ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జీవో 97ను రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, బిఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, విద్యార్థి నేతలు జగన్, జనార్ధన్, ఆజాద్, కామగోని శ్రావణ్, సుధీర్, పాలిటెక్నిక్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొనీ మాట్లాడారు. పాలిటెక్నిక్ వ్యవస్థలోనే విద్య, నైపుణ్యం రెండు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం తెచ్చిన జీవో 97ను విరమించుకోవాలని అలా కాకుండా పట్టింపులకు పోతే కాంగ్రెస్ ప్రభుత్వానిదే పరువు పోతుందని రాజ్యసభ ఎంపి ఆర్. కృష్ణయ్య సూచిం చారు. స్కిల్ లేనివాళ్లకు నైపు ణ్యం నేర్పించాలని, డిప్లొమా విద్యార్థులకు ముందునుంచే స్కిల్ ఉందని, ఇందుకు సాక్ష్యం వారు ఏటా పొందుతున్న క్యాంపస్ ఉద్యోగాలేనని తెలిపారు. జీవో నెంబర్ 97పై వెనక్కి తగ్గితేనే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని ఒకవేళ మొండిగా వ్యవహరిస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం జీఓ నెంబర్97పై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీనీ ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా ఉన్న ఏంఎల్సీ ప్రొఫెసర్ కోదండరాం గారు మాట్లాడుతూ ఉన్నత స్థాయి కమిటీలో విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎట్టి పరిస్థితుల్లో వెనుకడనని అని స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉన్నఎస్‌బిటిఈటిను కార్మిక శాఖలోకి కలపడం సరికాదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. తాము స్కిల్ యూనివర్సిటీకి వ్యతిరేకం కాదన్న ఆయన నైపుణ్య అభివృద్ధికి సాంకేతిక విద్యకి తేడా ఉంటదని గుర్తు చేశారు. ఎంత గొప్ప చరిత్ర, ట్రాక్ రికార్డు కలిగిన పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నాశనం చేసేందుకే జీవో 97ను తీసుకువచ్చారని విమర్శించారు. ఇకనైనా కళ్ళు తెరిచి శక్తి స్కీంను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే న్యాయపరంగా కొట్లాడుతామని హెచ్చరించారు. పాలిటెక్నిక్ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే జీవో 97ను తీసుకోవచ్చారని బిఆర్ఎస్‌వి నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఆలోచించి జీవో 97ను రద్దుకు సహకరించాలని కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ఉద్యోగ జేఏసీ నాయకులు, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మాట్లాడారు.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎంపి. ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు

## యాప్ ద్వారా పారదర్శక ఎరువుల పంపిణీ

### కేంద్ర ఫ్రేమ్‌వర్క్ ఫెర్టిలైజర్ సరఫరాపై అవగాహన

### నేటి నుండి మిగిలిన 10 జిల్లాలకు వర్తింపు

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా పారదర్శకంగా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి గోపి వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రైతు నేస్తం భాగంగా మంగళవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఈ యాప్ ద్వారా ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని, మిగిలిన 10 జిల్లాల్లో కూడా ఈ నెల 2వ తేదీ నుండి యాప్ ద్వారా సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు ఈ యాప్ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర యూరియా యాప్ ద్వారా ఇప్పటివరకు 33.97 లక్షల మంది రైతులు 141.93 లక్షల యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, వారిలో 128.93 లక్షల బస్తాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా, ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 15.01 లక్షల క్యూఆర్ కోడ్‌లు జనరేట్ కాగా, 59.78 లక్షల బస్తాలు బుక్ కాబడ్డాయని, వాటిలో 41.68 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేసినట్టు వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏడు రకాల వరి సన్నరకాలు సాగుచేసిన రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, వారికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ వంగడాలు సాగుచేసిన రైతులు తమ విత్తన కొనుగోలు వివరాలను సంబంధిత డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద కొనుగోలు చేయకుండా సొంత విత్తనాలు వినియోగించిన రైతులు స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి, వ్యవసాయ విస్తరణాధికారి వద్ద తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కోరారు. ఈ రెండు అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై కమిషనరేట్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయానికి చెందిన ఎడీఏ (ఫర్టిలైజర్స్) కుమారి మాధవి వివరణాత్మక ప్రసంగం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరాను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్‌ను వినియోగంలోకి తెచ్చినట్లు ఆమె తెలిపారు. ఎరువుల బుకింగ్, పంపిణీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం వల్ల కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. ఈ యాప్ పనితీరుపై ప్రత్యేక వీడియో ప్రదర్శన కూడా రైతులకు అందించారు. ఇదే కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితి, భూగర్భ జలమట్టాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భూగర్భ జల శాఖ సంయుక్త సంచాలకులు, సాగునీటి శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు రైతులకు కీలక సూచనలు అందిం చారు. అకాల వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో ప్రత్యామ్నాయ పంటలు, ప్రస్తుత పంటల నిర్వహణపై పీజేటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లతీఫ్ పాషా అవగాహన కల్పించారు.

## అక్టోబరు 4న రెడ్‌క్రాస్ జిల్లా శాఖల ఎన్నికలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు 1:** తెలంగాణలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా శాఖల నిర్వహణ కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయిం చారు. రాష్ట్రంలోని 30 జిల్లా శాఖలకు ఒకేసారి అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహించను న్నారు. ఇందుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శివప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని 30 జిల్లా శాఖల నిర్వహణ కమిటీల పదవీకాలం పూర్తికావడంతో ప్రస్తుతం అవి ఖాళీగా ఉన్నాయి. ఆయా శాఖల రోజువారీ కార్యకలా పాలను నిర్వహించేందుకు అదనపు కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. సంబంధిత జిల్లా శాఖ అధ్యక్షులైన కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రెడ్‌క్రాస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మే నుంచి ఆగస్టు వరకు నిర్వహించిన ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 66 వేల మందికి పైగా కొత్త సభ్యులు చేరారు. దీంతో తెలంగాణ రాష్ట్ర శాఖ మొత్తం సభ్యత్వం 1.13 లక్షలు దాటింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఛైర్మన్ ఎం. దానకిశోర్ అధ్యక్షతన మాజీ జిల్లా శాఖల కార్యవర్గ సభ్యులతో మంగళవారం సెక్రటేరియట్‌లో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్, మార్గదర్శకాలు, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ఐఆర్ఎస్ చైర్మన్ కార్యవర్గ సభ్యులతో చర్చించారు. మాజీ కార్యవర్గ సభ్యులు చేసిన పలు సూచనలను దానకిశోర్ పరిశీలించి, ఎన్నికల నిర్వహణలో తగిన సూచనలను అమలు చేయడానికి అంగీకరించారు. ఎన్నికల మార్గదర్శకాలు, షెడ్యూల్‌తో పాటు ఓటర్ల జాబితాలను మరో రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్లకు పంపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ, సీఈఓ ప్రొఫెసర్ ఏ. శ్రీరాములు పాల్గొన్నారు.

## ఎసిబి కేసులో అరెస్టయిన డిఎస్‌పి భీంరెడ్డికి బెయిల్ మంజూరు

### చంచల్‌గూడ జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన కేసులో ఎసిబి అరెస్టు చేసిన పోలీసు కంప్యూటర్స్ సైన్స్ వి భాగం డిఎస్‌పి భీం రెడ్డి మంగళవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. గత జూలై నెల ఆరవ తేదీన ఆయనను ఎసిబి అధికారు లు అరెస్టు చేయడం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన జైల్లో వున్నారు. ఎసిబి కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో న్యాయవాదు లు కోర్టు ఉత్తర్వులను జైలు అధికారులకు మంగళవారం సాయంత్రం అందజేశారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు.

## తండ్రినే దుర్భాషలాడిన కవితకు, నన్ను తిట్టడం ఓ లెక్కా

### ఆమె రహస్యంగా కాంగ్రెస్ నేతలను కలవలేదని చెప్పగలరా? మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు1:** కవిత వ్యాఖ్యలపై మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందించారు. తాను విడదీసేందుకు ప్రయత్నించానా, కలపాలని చూశానో కేసీఆర్‌కు తెలుసని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవిత మొండిగా వ్యవహరించి, పార్టీ లైన్ దాటారని చెప్పారు. తాను మొదట్నుంచీ పార్టీలో ఉన్నానన్న ఆయన కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లినట్లు చెప్పారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కేసీఆర్‌కు అండగా ఉన్నది కవితా? తానా గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఎవరితోనూ మంతనాలు జరపలేదని, లక్ష్మీ నరసింహ స్వామిపై ప్రమాణం అని చెప్పారు. కవిత రహస్యంగా కాంగ్రెస్ నేతలను కలవలేదని చెప్పగలరా? అని సవాల్ చేశారు. తండ్రినే దుర్భాషలాడిన కవితకు నన్ను తిట్టడం ఒక లెక్కా అని అన్నారు. కవిత ఎవరికి లాభం కలిగిస్తున్నారో ప్రజలకు తెలుసని విమర్శించారు.

### 1,000 రోజుల పాలనపై 3న మండలాల్లో కాంగ్రెస్ సంబురాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారు సూచించారు. 3న అన్ని మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ప్రచారం పెద్దఎత్తున ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసి సంబరాలు చేయాలని ఆదేశించారు. 4 కానీ 5 తేదీలలో తప్పకుండా జిల్లా కేంద్రాలలో సభలు, ర్యాలీలు పెద్దయెత్తిన నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో డీసీసీ అధ్యక్షులు ప్రత్యేక శ్రద్ధ తీస్కొని కార్యక్రమాలు పెద్దఎత్తున విజయవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు.

## బిజెపి కార్యాలయాలు, నాయకులపై దాడులు హేయమైన చర్య

### దాడులను ఖండించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, అయితే రాజకీయ ప్రత్యర్థుల కార్యాలయాలపై దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, వ్యక్తులపై దాడులకు పాల్పడటం, మహనీయుల చిత్రాలను అవమానించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ అన్నారు. తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం, నల్గొండ జిల్లా బిజెపి కార్యాలయం, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నేతల అరెస్టులు ఖండనీయమని, దాడులకు గురైన నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం, మద్దతు తెలిపేందుకు వెళ్లేందుకు సిద్ధమైన రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితర నాయకులను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని పాయల్ శంకర్ అన్నారు. దాడులకు గురైన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమే అన్నారు. అసలు దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితులకు మద్దతుగా నిలిచేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదు" అని పాయల్ శంకర్ అన్నారు.



# కఠోర శ్రమకు పరీక్ష

క్రీడా పోటీల్లో పాల్గొని తమ శక్తియుక్తులను ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతూ వెళ్తున్న విద్యార్థులకు నిర్వాహకులు కఠిన పరీక్షలు పెట్టినట్లుందీ ఫొటో. దూరమెంతుందో కానీ, టెంపోలో విద్యార్థులను ఐదు పది మంది కాదు పదుల సంఖ్యలో ఓ టెంపోలో తీసుకెళ్లడం విమర్శలు చెలరేగాయి. వాళ్లు మనుషులా, జంతువులా అంటూ మండిపడుతున్నారు. ఏదైనా ఊహించని ప్రమాదం జరిగితే, ఎవరు బాధ్యులంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకీ ఈ ఫొటో క్లిక్ మనిపించింది ఎక్కడంటే, హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున ట్యాంక్ బండ్ వద్ద రాజ్యాంగ రూపకర్త డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలోనే. ఇదండీ మన క్రీడ పోటీల నిర్వాహకుల దమననీతి!

# మృతి చెందిన విద్యుత్తు ఉద్యోగి కుటుంబానికి కోటి బీమా సొమ్ము

## చెక్కును అందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజి ట్రాన్కో) హుజూరాబాద్ 132/11 సబ్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గ్రేడ్ 2 ఉద్యోగి శంకర్‌రెడ్డి భార్య బోడ స్వాతికి మంగళవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందించారు. హుజూరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శంకర్‌రెడ్డి గత ఏడాది అక్టోబర్ 1న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రమాద బీమా చెక్కును అందించారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భం గా అధికారులు తెలిపారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న రూ.కోటి ప్రమాద బీమా పథకం మొదట సింగరేణి సంస్థలో ప్రారంభమై, ప్రస్తుతం



రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల్లో అమలవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిజెవైఎం బాహాబాహీ

## భువనగిరిలో రాజకీయ రణరంగం

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బిజెవైఎం దాడి

### ప్రతీకారంగా బిజెపి ఆఫీసుపై కాంగ్రెస్ దూకుడు

### ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జి

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మంగళవారం రాజకీయ వేడి ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పరస్పర దాడులకు దారితీయడంతో జిల్లా కేంద్రం అట్టుడికింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై బీజేవైఎం కార్యకర్తలు దాడికి దిగడం, కార్యాలయంలోని అద్దాలు, పూలకుండీలు ధ్వంసం చేయడం, ఫ్లెక్సీలు, నేమ్‌బోర్డులపై నల్లరంగు చల్లడం తీవ్ర కలకలం రేపింది. రాష్ట్ర బీజేపీ కార్యాలయం, నల్గొండ జిల్లా బీజేపీ



అధ్యక్షుడి ఇంటితో పాటు పార్టీ కార్యాలయంపై జరిగిన దాడులను నిరసిస్తూ బీజేవైఎం కార్యకర్తలు భువనగిరిలో ఆందోళనకు దిగినట్లు సమా చారం. ఈ క్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్న కార్యకర్తలు ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో కార్యాలయంలోని అద్దాలు, ఇతర సామగ్రి ధ్వంసమైనట్లు తెలుస్తుంది.

ఈ ఘటనతో అప్రమత్తమైన కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. బీజేపీ కార్యాలయం వైపు ప్రతీకార దాడికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొద్దిసేపటికే పరిస్థితి అదుపు తప్పి ఇరువర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు.

ఒకవైపు బీజేపీ కార్యకర్తలు.. మరోవైపు కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం దూసుకెళ్లడంతో క్యాంపు కార్యాలయం పరిసరాలు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు రంగంలోకి దిగారు. ఇరువర్గాలను వెనక్కి పంపేందుకు ప్రయత్నించినప్పటికీ ఘర్షణ ఆగకపోవడంతో పోలీసులు లాఠీచార్జి చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం కొనసాగింది.

ఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షి ంచారు. ఇరువర్గాల నాయకులతో మాట్లాడి శాంతియుతంగా వ్యవహరించాలని సూచించారు. అయినప్పటికీ అక్కడక్కడా కార్యకర్తలు గుమిగూడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

ఇదిలా ఉండగా, భువనగిరి ఘటనకు కొనసాగింపుగా బీజేపీ కార్యాలయం వద్ద కూడా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రాజకీయ కార్యాలయాల వద్ద పోలీసులు బందోబస్తు పెంచారు. బీజేపీ,కాంగ్రెస్ పరస్పర దాడుల నేపథ్యంలో మరోసారి ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.

# ఎపిలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు

## మొత్తం 13,278 గ్రామ పంచాయతీలున్నాయి: ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు దిశలో రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్వరంగాన్ని సిద్ధం చేసుకుంటుంది, ఈ క్రమంలోనే ఎపిలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్టు ఎస్ఇసి అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. మొత్తం గ్రామపంచాయతీలు 13,278 ఉన్నాయని వివరించారు. అందులో వార్డులు 1,33,128 ఉన్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలలోనూ సమగ్రంగా జిల్లా కలెక్టర్లు పోలింగ్ స్టేషన్లు నిర్ణయించారని చెప్పారు. వీటిపై జిల్లాలో అన్ని స్థాయిల్లో ఆగస్టు 23 నుంచి 26 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నారని, తుదిగా ఈ సంఖ్య నిర్ణయించినట్టు అనిల్ చంద్ర పునేఠా వివరించారు. మరోవైపు సమగ్ర ఓటర్ల నమోదు ప్రత్యేక జాబితా (సర్) ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కీలక పోలింగ్ కేంద్రాల జాబితా తయారీని పూర్తి చేశారు. గరిష్ఠంగా 650 మంది ఓటర్లను మించకుండా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ మేరకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియను వివిధ జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. 61 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ మొదలైంది. సెప్టెంబర్ 3న తుది జాబితాలు ప్రకటిస్తారు. రిజర్వేషన్లు ప్రకటించేందుకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బిసిల వివరాలను వాటిలో నుంచి గుర్తించనున్నారు. అదేవిధంగా డివిజన్లు, వార్డుల పునర్విభజనపై హైకోర్టులో తాజాగా వేసిన కేసులు, వైఎస్సార్సీపీ సర్కార్‌లో పంచాయతీలను నగర పంచాయతీలుగా ఉన్నతీకరించడం, పంచాయతీలు సమీప పుర, నగరపాలక సంస్థల్లో విలీనానికి వ్యతిరేకంగా వేసిన కేసులు కొలిక్కి వచ్చాక మరో 62 నగరాలు, పట్టణాల్లోనూ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తారు.స్థానిక సంస్థల ఎన్నికలకు అదనంగా 1.50 లక్షల బ్యాలట్ బాక్సుల కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50వేలకు పైగా బ్యాలట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి.

# ఎంపి లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం తగదు

## క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలి: కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు1:** ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ.16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు, స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యా యని తెలిపారు.

# బ్లాక్‌మనీతో 8 బిలియన్ల ల్యాప్‌టాప్‌లు కొనొచ్చు

## రికవరీ అవుతున్నది 1 శాతం కంటే తక్కువే

## సుప్రీంకోర్టు సిజెఐ సూర్యకాంత్

## ఆర్థిక నేరాల కట్టడికి ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాలని సూచన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మనీలాండరింగ్ భారీ స్థాయిని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ ఎత్తిచూపారు. ఒక్క సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా తరలించబడే అక్రమ సంపదతో, సిద్ధాంతపరంగా భూమిపై ఉన్న ఎనిమిది బిలియన్ల ప్రజలలో ప్రతి ఒక్కరికీ ఒక మోస్తరు ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేయవచ్చని, అయితే అందులో 1 శాతం కన్నా తక్కువ మాత్రమే తిరిగి రికవరీ అవుతోందని ఆయన అన్నారు. కేంబ్రిడ్జ్‌లో జరిగిన 43వ అంతర్జాతీయ ఆర్థిక నేరాల సదస్సు ముగింపు సమావేశంలో సిజె సూర్యకాంత్ ప్రసంగిస్తూ, ఆర్థిక నేరాలపై ప్రపంచ పోరాటం నేరపూరిత సొమ్మును గుర్తించడం, స్తంభింపజేయడం, రికవరీ చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. "మనీ లాండరింగ్‌పై ప్రపంచ అంచనాలు సుమారుగా సరైనవే అయినా, ఈ రోజు భూమిపై జీవిస్తున్న ఎనభై కోట్ల మంది ప్రజలలో ప్రతి ఒక్కరికీ ఒక మోస్తరు ల్యాప్‌టాప్ కొనివ్వడానికి సరిపడా డబ్బును ప్రపంచం ఒక్క సంవత్సరంలోనే లాండరింగ్ చేస్తుంది, ఇంకా ఖజానాలో కొంత చిల్లర కూడా మిగిలిపోతుంద్ద అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. "ఆర్థిక నేరం అనేది ఆధునిక దృగ్విషయం కాదని, సాంకేతికత, ఆర్థిక వ్యవస్థలతో పాటు పరిణామం చెందిన ఒక పురాతన దుర్గుణం అని సిజెఐ అన్నారు. క్రీ.పూ. నాల్గవ శతాబ్దానికి చెందిన గ్రీకు వ్యాపారి హెగెస్ట్రాటోస్‌ను, ఆర్థిక మోసానికి ఒక తొలి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. డిజిటల్ అరెస్ట్ మోసాల లాంటి కొత్త రకం నేరాలను అరికట్టడంలో మన దేశ న్యాయవ్యవస్థ ముందుండి పనిచేస్తుందని ఆయన చెప్పారు.

"మన దేశంలో పిఎంఎల్ఏ 2002, పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల చట్టం 2018 వంటి చట్టాలు అమల్లో ఉన్నాయి. అయితే, ఈ చట్టాలన్నీ పూర్తిగా తప్పులు లేనివని నేను అనట్లేదు" అని సిజెఐ వివరించారు. ఆర్థిక మోసాలను అడ్డుకోవడానికి దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నల్లధనంలో ప్రతి వంద భాగాలకు కేవలం ఒక్క భాగం మాత్రమే వెనక్కి వస్తోందని గుర్తుచేశారు.

పిఎంఎల్ఏ చట్టాన్ని దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయంటూ ఆరోపణలు వస్తున్నాయని సిజెఐ తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితులకు అండగా నిలవడానికి, వ్యవస్థలో ఉన్న తప్పులను సరిదిద్దడానికే న్యాయవ్యవస్థ జోక్యం చేసుకుంటోందని ఆయన తెలిపారు.



సిఎం ప్రజావాణికి భారీగా తరలివచ్చిన నిరుద్యోగ అభ్యర్థులు

# గురుకుల టీచర్ల నాన్‌జాయినింగ్ ఖాళీల్లో తదుపరి మెరిట్ అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వాలి

## ప్రజావాణిలో 152 దరఖాస్తులు

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికై, నియామక ఉత్తర్వులు పొందిన అనంతరం విధుల్లో చేరని కారణంగా ఏర్పడిన ఖాళీలను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరుతూ నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున సీఎం ప్రజావాణికి తరలివచ్చారు.మంగళవారం బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 252వ సీఎం ప్రజావాణి కార్యక్రమానికి గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు పరీక్షలు రాసిన మెరిట్ అభ్యర్థులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపికైన కొందరు అభ్యర్థులు విధుల్లో చేరకపోవడంతో ఏర్పడిన నాన్‌జాయినింగ్ ఖాళీల్లో తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థులకు అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.అభ్యర్థుల సమస్యలను విన్న సీఎం ప్రజావాణి రాష్ట్ర ఇన్‌చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి కె. విద్యాసాగర్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సీఎం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 152 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 66, మున్సిపల్ శాఖకు 19, హోంశాఖకు 15, ఇతర శాఖలకు 52 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా సామాజిక సంక్షేమ శాఖకు సంబంధించిన సమస్యలపై ఒక బృందంగా 102 మంది, విద్యాశాఖకు సంబంధించి ఒక బృందంగా ముగ్గురు, కార్మిక శాఖ సమస్యలపై ఒక బృందంగా 13 మంది సీఎం ప్రజావాణికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ ఉమేందర్, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల్లో రవాణా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

## 347.76 కోట్ల ప్రయాణాలు.. రూ.12167 కోట్ల ఆదా

## 2,932 కొత్త బస్సుల కొనుగోలు.. 1,024 ఎలక్ట్రిక్ బస్సుల సేవలు

## రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** 1000 రోజుల ప్రజా పాలనలో ప్రభుత్వం రవాణా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిందని, మహిళా సాధికారత, ఉద్యోగ సంక్షేమం, ఆధునిక ప్రజా రవాణాకు పెద్దపీ వేసిందని రవాణా, బీసీ సంక్షేమ శాక మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని, 1,024 ఎలక్ట్రిక్ బస్సుల సేవలను వినియోగిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో రోడ్డెక్కనున్నాయని, ఆర్టీసీని దేశంలోనే నంబర్1గా నిలిపేందుకు కృషివిజన్ 2047కి అనుగుణంగా మరింత ముందుకు సాగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం బస్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా శాఖ, ఆర్టీసీ ప్రగతిని వివరించారు.ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆధునిక ప్రజా రవాణా అందించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా మహిళలు సుమారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని చెప్పారు. ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక సాధికారత పెరిగిందని, కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మరింత అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ఆర్టీసీ ఆక్యుపెన్సీ సుమారు 67 శాతం ఉండగా, ప్రస్తుతం 89 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు. మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా రవాణా రంగంలో యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా సెర్ప్/మహిళా సంఘాల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేయించి వాటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని మంత్రి తెలిపారు.ప్రతి బస్సుకు నెలకు సుమారు రూ.69,468 చొప్పున ఈఎంఐ చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు సుమారు రూ.29.31 కోట్లు చెల్లించామని చెప్పారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, హైదరాబాద్ నగరంలో త్వరలో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించనున్నామని చెప్పారు. పీఎం ఈ డ్రైవ్ కార్యక్రమం కింద హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నామని, ఇప్పటికే 240 డీజిల్ బస్సులను రెట్రోఫిట్ చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల విధానాన్ని అమలు చేస్తూ సుమారు రూ.1,400 కోట్ల మేర పన్ను మినహాయింపులు కల్పించామని మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.4,538 ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, అందులో 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. అలాగే 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు.

నియామకాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలీస్ శాఖ ద్వారా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టామని చెప్పారు.విధి నిర్వహణలో మరణించిన లేదా అకాల మరణానికి గురైన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల సమస్యను పరిష్కరిం చామని మంత్రి తెలిపారు.

ఈ సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



# మాజీ మావోయిస్టు నేత మల్లోజులకు ఉద్యోగం

## గోండ్వానా వర్సిటీ కో-ఆర్డినేటర్‌గా నియామకం

**గడ్చిరోలి(మహారాష్ట్ర), సెప్టెంబరు 1:** ఆయుధ మార్గాన్ని వీడి లొంగిపోయిన మావోయిస్ట్ మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి, మహారాష్ట్రలోని గడ్చిరోలిలో గిరిజన గ్రామస్తుల హక్కులకు సంబంధించిన పరిపాలనాపరమైన పనులను పర్యవేక్షించేందుకు ఒక విశ్వవిద్యాలయ కార్యక్రమానికి సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టారని అధికారులు మంగళవారం తెలిపారు. తెలంగాణలోని పెద్దపల్లిలో జన్మించిన వేణుగోపాల్, కరీంనగర్‌లో డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో మాస్టర్స్ చదివేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడే ఆయన మావోయిస్ట్ భావజాలం పట్ల ఆకర్షితులై అజ్ఞాతంలోకి వెళ్లారు. ఒకప్పుడు భయంకరమైన నక్సల్ కమాండర్‌గా ఉన్న భూపతి, గత యేడాది ఆయుధాలు వదిలి లొంగిపోయారు. ఒకప్పుడు పూర్తిగా భిన్నమైన దృక్పథంతో చూసిన ప్రాంతాల్లోని గిరిజన వర్గాలకు చట్టపరమైన హక్కులను కల్పించేందుకు ఆయన తన కృషిని అంకితం చేయనున్నారు. ఈ మాజీ నక్సలైట్ గోండ్వానా యూనివర్సిటీ 'ఏకల్ప్' కార్యక్రమం కోసం మూడు నెలల కాంట్రాక్ట్ ప్రాతిపదికన, నెలకు రూ.30వేలు గౌరవ వేతనంతో నియమితులయ్యారు. క్షేత్రస్థాయి అనుభవం, పరిజ్ఞానం కారణంగా భూపతి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారని గడ్చిరోలి ఎస్పీ ఎం. రమేష్ తెలిపారు. ఎస్పీ ఆయన దరఖాస్తును గోండ్వానా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌కు సిఫార్సు చేశారు. ఇంటర్వ్యూ నిర్వహించిన తర్వాత వైస్‌ఛాన్సలర్ ఆయనకు ఉద్యోగం కల్పించారు. భూపతి గడ్చిరోలిలోని ట్రైబల్ రీసెర్చ్ సెంటర్‌లో పనిచేస్తూ పరిశోధన పనుల్లోనూ పాలుపంచుకుంటారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ పథకాల పర్యవేక్షణలోనూ సహాయపడతారని ఆ పోలీస్ అధికారి పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

## ● పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు ● నాలుగు నదుల్ని దాటుకుంటూ.. తూర్పు కనుమల్లోకి గోదావరి

**విజయవాడ, సెప్టెంబరు 1 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదారమ్మ ఉత్తరాంధ్రవైపు పరుగులు పెట్టనుంది. నాలుగు నదుల్ని దాటుకుంటూ తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి కదలి రానుంది. రేపు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలకు హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ఆన్ చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడిచి పెట్టనున్నారు. రేపు మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి, పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే జలాలకు జల హారతి ఇచ్చి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని సంకల్పం చేసిన సీఎం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరనుంది. ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్ల ఖర్చు చేసింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు ఈ జిల్లాల్లో ఉన్న పంపా, తాండవ, వరాహ, శారద నదుల్ని దాటుకుని, ఏలేరు కాలువ, తూర్పు కనుమలపై సంక్లిష్టమైన నిర్మాణాల మీదుగా ఉత్తరాంధ్రకు చేరుకోనున్నాయి.

# మిలటరీ ఆయుధాల చోరీలో ఇంటిదొంగలు?

## అనుమానిత సిబ్బందిని ప్రశ్నిస్తున్న మిలటరీ అధికారులు

## పోలీసు విచారణ వేగవంతం

## ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిన రక్షణ శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** సికిందరాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (ఎఒసి) ప్రాంగణంలో గల మద్రాస్ రెజి మెంట్‌లో వెలుగుచూసిన ఆయుధాల చోరీ వెనుక ఇంటి దొంగల హస్తంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ చోరీ జరిగినట్లు అటు రక్షణ శాఖ, ఇటు పోలీసు విభాగం నిర్ధారణకు వచ్చాయి. పటిష్ట భద్రత, సాయుధుల కాపాలావుండే ప్రాంతంలో రక్షణ శాఖ పోరాట దళంలో కీలకమైన మద్రాస్ రెజిమెంట్ సాయుధ గోదాము నుంచి ఏకంగా ఎకె-47, ఇన్సాస్ తుపాకులతోపాటు చిన్నపాటి పిస్టళ్లు మందు గుండు సామాగ్రి చోరీ కావడం రక్షణ శాఖ వర్గాలను షాక్‌కు గురిచేసింది.

దీనిపై రక్షణ శాఖ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించగా తెలంగాణ సబ్ ఏరియా మిలటరీ విభాగం దీనిపై దర్యాప్తు మొదలుపెట్టి అనుమానిత సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మరోవైపు బొల్లారం పోలీసులు ఆయుధ చోరీపై నిగ్గు తేల్చేందుకు ఆరు ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. మిలటరీ పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రక టించి, ఆ ప్రాంతాన్ని దిగ్బంధం చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలో మిలటరీ సాయుధ గోదాము నుంచి తొలిసారిగా ఆ యుధాలు చోరీ అవడం దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి. దీనిపై ఆ రెజిమెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మయాంక్ గోవిత్రికర్ బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. మొదట ఆయుధాల చోరీపై పోలీసులతో పాటు మిలటరీ అధికారులు అనుమానం వ్యక్తం చేసి ఘటనా స్థలిని పరిశీలించిన తరువాత దొంగతనం జరిగిందని నిర్ధారణకు వచ్చారు. ఆయుధాలు భద్రపరచిన గది తాళాలు బద్ధలు కొట్టి వుండడం, గదిలో ఆయుధాలు వుంచిన బాక్స్‌ల తాళాలు సైతం బద్ధలుకొట్టి వుండడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఆయుధాలను దొంగిలించినట్లు మిలటరీ, పోలీసు అధికారులు నిర్ధారణకు వచ్చారు. పాక్‌తో జరిగిన రెండు యుద్ధాలతోపాటు కార్గిల్ వార్‌లో ముందు వరుసలో వుండి పోరాటం చేసిన సైనిక పటాల్లో మద్రాస్ రెజిమెంట్ కూడా ఒకటి. సికింద రాబాద్ కంటోన్మెంట్‌కు ఇటీవలే వచ్చిన ఈ రెజిమెంట్ తమ ఆయుధా లను సాయుధ కాపలావుండే చోట భద్రంగా వుంచింది. కొన్నిసార్లు ఆయుధాలను ఒకచోట వుంచి మరోచోట వాటి లెక్కలు చూపడం జరుగుతుంటాయి. అయితే తాజా ఘటనలో ఆయుధాలు దొంగతనానికి గురైనట్లు స్పష్టంగా కనిపిస్తుండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యా హ్నం దీనిపై బొల్లారం పోలీసులకు ఫిర్యాదు రాగా వెంటనే ఉన్నతాధి కారులు రంగంలో దిగి ఘటనా స్థలిని పరిశీలించి చోరీ అయినట్లు ఆధా రాలు వుండడంతో కేసు నమోదు చేశారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని మంగళవారం మల్కాజిగిరి కమిషనర్ సుమతి పరిశీలించారు. ఈ కేసును మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ పర్యవేక్షణలో విచారణ చేస్తున్నారు. ఘటనాస్థలి నుంచి కొన్ని ఆధారాలను పోలీసులు సేకరించారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని సిసి కెమెరాలను పరిశీలించి కొన్ని ఫుటేజిలను జప్తు చేశారు.

ఇదిలా వుండగా కంటోన్మెంట్ ప్రాంతంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ వెనుక మిలటరీ సిబ్బంది లేదా మాజీ సిబ్బంది పాత్రపై అనుమానాలు వస్తున్నా యి. కొందరు అనుమానితులను వారు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ చోరీలో నలుగురు వ్యక్తులు పాల్గొని వుంటారని భావిస్తున్నారు. చోరీ అయిన ఆయుధాలను ఇదే ప్రాంతంలో దాచివుంచి వుంటారని అనుమానాలు వ్యక్తం అవుతుం డడంతో ఈ ప్రాంతంలో సెలవు ప్రకటించిన మిలటరీ అధికారులు ముమ్మరంగా సోదాలు చేబట్టారు.

# గోవా కేంద్రంగా నైజీరియన్ స్మగ్లర్ల డ్రగ్స్‌దందా

- దేశ వ్యాప్తంగా అనేక నగరాలలో నెట్ వర్క్,
- వేలాది మంది కస్టమర్లు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** భారత్‌లో మూడు దశాబ్దాలకు పైగా డ్రగ్స్ దందాలు సాగిస్తున్న నైజీరియన్లు పంథాను మార్చారు. నిన్నటి వరకు ఢిల్లీ, ముబాయి కేంద్రంగా తమ మాఫియా కార్యకలాపాలు సాగించిన నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్లు ఇప్పుడు గోవాలోని సెంట్రల్ జైల్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలను స్థావరాలుగా చేసుకుని స్మగ్లింగ్ చేస్తున్నారు. గోవా సెంట్రల్ జైల్‌లో రిమాండు ఖైదీలు, శిక్ష అనుభవిస్తున్న కొందరు నైజీరియన్ డ్రగ్స్ డాన్‌లు జైలు నుండే తమ కార్యకలాపాలను సాగిస్తున్న వైనం దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతుండగా వీరి ఆగడా లను ఈగల్ పోలీసులు వరుసగా రట్టు చేస్తున్నారు. దేశంలోని ఒక ప్రధాన నగరంలోని జైల్లో వున్న ఖైదీలు డ్రగ్స్ కేసులో కీలక నిందితులుగా మారడం ఎన్‌డిపిఎస్ అధికారులను ఆశ్చర్యపరుస్తోంది. దేశంలోని మెట్రో నగరాలలో నైజీరియన్లు మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడడం అనేది చాలా కాలంగా కొనసాగుతున్నా ప్రముఖ పర్యాటక ప్రాంతం గోవాను సురక్షిత స్థావరంగా చేసుకున్న వైనం దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల పోలీసులను ఆశ్చర్య పరుస్తోంది. ఐదేళ్ల క్రితం పట్టుబడ్డ టోనీ గ్యాంగ్ డ్రగ్స్ ముఠా వ్యవహారం అప్పట్లో సంచలనం రేపింది. టోనీ వాస్తవానికి నైజీరియన్‌కు చెందిన అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్. ఇత ను భారత్‌తో పాటు అనేక దేశాలకు కొకైన్‌తో పాటు అనేక రకాల మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేసేవాడు. ఇందుకుగానూ ఆయా దేశాలలో తన కు నమ్మకంగా వుండే నేరగాళ్లను ఏజెంట్లుగా నియమించుకుంటాడు. భారత్‌లో టోనీకి నమ్మినబంటుగా ముంబాయికి చెందిన ఇమ్రాన్ బాబు షేక్ అనే నేరగాడితో పాటు మరికొందరు ఏజెంట్లుగా వున్నారు. భారత్‌లో టోనీ గ్యాంగ్ కార్యకలాపాలు ఇమ్రాన్ బాబు షేక్ కనుసన్నలలోనే జ రుగుతుంటాయి. ఆఫ్రికా దేశాల నుంచి అతి తక్కువ ధరకు మాదకద్రవ్యాలను ఖరీదు చేసి, వాటిని అనేక మార్గాల ద్వారా తన కస్టమర్లుండే దే శాలకు పంపడంలో టోనీ దిట్టగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. టోని తరపు ఏజెంట్లు ఇంతకు ముందు భారత్‌లోని పలు నగరాలలో ప ట్టుబడిన ఉదంతాలున్నాయి. టోనీకి భారత్‌లో 25 వేల మంది కస్టమర్లున్నట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. టోనీకి నమ్మిన బంటుగా వున్న ఇమ్రాన్ హైదరాబాద్‌లో పట్టుబడగా మరికొందరు గోవాలోని జైల్లో వుంటూ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు తేలింది. కాగా రాష్ట్రంలో నాటి టి.నాబ్ ఇప్పటి ఈగల్ ఏర్పాటయ్యాక రాష్ట్రంలో డ్రగ్స్ దందాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్న తరుణంలో గోవా స్థావరంగా చేసుకుని కొందరు నైజీరియన్ స్మగ్లర్లు సాగిస్తున్న దందాలు వెలుగు చూశాయి. వీరిలో అనేక మంది పట్టుబడగా మరికొందరు పరారీలో వున్నా రు. వీరి నుంచి కోట్ల రూపాయల డ్రగ్స్‌ను జప్తు చేశారు. వీరిలో కొందరు నేరగాళ్లు గోవా జైల్లో వుంటూ దేశ వ్యాప్తంగా డ్రగ్స్ దందాలు సాగిస్తున్నట్లు తేలింది. వీరి ఆగడాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు పావులు కదుపుతున్నారు. డ్రగ్స్ వినియోగదారులపై చర్యలతో కొత్తవారిలో భయం ఇదిలావుండగా గోవా డ్రగ్స్ ముఠాల నుంచి మాదకద్రవ్యాలు కొనుగోలు చేసిన వారిని, చేస్తున్న వారిని వరుసగా ఈగల్ పోలీసులు పట్టు కుంటుండడంతో కొత్తగా డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్న వారిలో భయం వెంటాడుతోంది. గడచిన రెండేళ్ల వ్యవధిలో ఈగల్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మంది వరకు డ్రగ్స్ బానిసలను గుర్తించి వీరిలో మెజారిటీ కేసులకు సంబంధించి యువతీ, యువకులను పున రావాస కేంద్రాలకు తరలించి వైద్యం అందించారు. వీరిలో 90 శాతం మంది మళ్లీ డ్రగ్స్ జోలికి వెళ్లబోమని ప్రతిజ్ఞ చేయడం గమనార్హం. డ్ర గ్స్ వ్యసనపరులను ఈగల్ పోలీసులు వెంటాడుతుండడం మరో ముఖ్యాంశం.

## గిన్నిస్‌బుక్‌లో ఘట్‌కేసర్ విద్యార్థులకు చోటు




గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ మోడల్స్, రికార్డులు అందుకుంటున్న విద్యార్థులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన దొడ్డిగర్ల కన్నయ్య కూతురు ప్రసస్థ, కుమారుడు ప్రహర్ష, ఫాస్టర్ దొడ్డిగర్ల యేసు రమేశ్ కుమారుడు రోహన్‌కులకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని మెరిట్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ప్రసస్థ, ప్రహర్ష, ఎన్‌ఎఫ్‌సీనగర్ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోహన్‌లు గత ఫిబ్రవరి 2న మిస్టర్ అగస్టీన్ దండిగి వేణుగోపాల్ హాలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా 777 మంది విద్యార్థులలో ప్రసస్థ, ప్రహర్షలు కూడా కీబోర్డు ప్లే చేయడంలో ప్రావీణ్యం సాధించారు. బౌతనియా ప్రార్ధణా మందిరం ఫాస్టర్ యేసు రమేశ్, కల్వరీ మార్గం మినిస్ట్రీస్ బ్రదర్ పాల్ పృథ్వీ, సుజాత పృథ్వీల చేతుల మీదుగా విద్యార్థులు మోడల్స్, రికార్డ్స్‌లు అందకున్నారు. గాంధీనగర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు వారి ప్రతిభను గుర్తించి గిన్నిస్‌రికార్డ్స్‌లో స్థానం కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సాయాజీ సీడ్స్‌తో నష్టపోయాం

- రైతు కమిషన్‌ను ఆశ్రయించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** సాయాజీ సీడ్స్ కంపెనీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన రైతులు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ను ఆశ్రయించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ ఎం. కోదండ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2024-25లో కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్ల సూచనల మేరకు సంకరజాతి వరి విత్తనాలు సాగు చేసినా ఎకరానికి కేవలం 2-4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చి తీవ్రంగా నష్టపోయామని రైతులు తెలిపారు. దిగుబడి తగ్గితే నష్టపరిహారం చెల్లిస్తామని కంపెనీ హామీ ఇవ్వడంతో పంటను కంపెనీకి అప్పగించినప్పటికీ, ఏడాది కాలంగా పరిహారం చెల్లించకుండా వాయిదా వేస్తోందని ఆరోపించారు. ఇతర కంపెనీలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పరిహారం చెల్లించగా, సాయాజీ సీడ్స్ మాత్రం పరిహారం ఇవ్వలేదని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, వరి కోత యంత్రం, రోగింగ్ ఛార్జీలు చెల్లిస్తామని చెప్పి చెల్లించలేదని, రా సీడ్‌కు తూకం ధర చెల్లిస్తామని చెప్పి 10 శాతం తరుగు తీసుకున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యపై చర్చించేందుకు అహ్మదాబాద్‌లోని కంపెనీ కార్యాలయానికి వెళ్లిన ఐదుగురు రైతులను సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బయటకు పంపించారని తెలిపారు. దాదాపు 18-20 గ్రామాలకు చెందిన 230 మంది రైతులు సుమారు 480 ఎకరాల్లో నష్టపోయినట్లు రైతులు కమిషన్‌కు వివరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి పంట నష్టాన్ని అంచనా వేసి, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఫిర్యాదులను విన్న కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, విచారణ చేపట్టి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషన్ ఛైర్మన్‌తో పాటు, సభ్యులు కే.వీ.ఎన్. రెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

## ఎపిలో సర్ గడువు పొడిగింపు

**10 తేదీదాకా అభ్యంతరాల దాఖలుకు అవకాశం**

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి చేసిన అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోయినా ఈ గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఈ తేదీలు మారాయి. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేరులో తప్పులు, చిరునామా మార్పులు లేదా ఇతర వివరాల్లో సమస్యలు ఉంటే నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించి సవరించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# వ్యవసాయ పరిశోధకులను తీర్చిదిద్దాలి

- ఐకార్-నార్మ్ 51వ వ్యవస్థాపక దినోత్సవంలో పద్మభూషణ్ డా. ఆర్.ఎస్.పరోడా



ఐకార్-నార్మ్ 51వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న భారత వ్యవసాయ పరిశోధనా మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డా. ఆర్.ఎస్. పరోడా,ఇతర అధికారులు

**అత్తాపూర్ సెప్టెంబరు1 ,ప్రభాతవార్త :** వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సంస్థాగత భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరిశోధకులను సమర్థవంతమైన నాయకులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పద్మభూషణ్, భారత వ్యవసాయ పరిశోధనా మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డా. ఆర్.ఎస్. పరోడా అన్నారు. మంగళవారం రాజేం ద్రనగర్‌లోని ఐకార్ నార్మ్‌లో నిర్వహించిన 51వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. కె.వి. రామన్ స్మారక ఉపన్యాసాన్ని ప్రారంభించి ప్రసంగించారు. వ్యవసాయ పరిశోధకులకు శిక్షణ అందించే సంస్థగా మాత్రమే కాకుండా, భవిష్యత్ వ్యవసాయ రంగానికి అవసరమైన నాయకులను తయారు చేసే సంస్థగా నార్మ్ ఎదగాలని డా. పరోడా సూచించారు. బృంద స్ఫూర్తి, క్రమశిక్షణ, సమగ్ర ఆలోచనా విధానం, నిరంతర మార్పులకు అనుగుణంగా పనిచేసే సంస్కృతిని సంస్థలో పెం పొందించాలని అన్నారు. అర్థవంతమైన, సు స్థిరమైన మార్పు మొదట సంస్థలోనే ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. నార్మ్ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయాలని, దేశంలోని వివిధ విద్యా సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో భాగ స్వామ్యాలను విస్తరించాలని సూచించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారాన్ని పెంచుకోవడం ద్వారా వ్యవసాయ రంగంలో మరిన్ని అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ నాయకత్వ అభివృద్ధి, భవిష్యత్ వ్యవసాయ పరిస్థితులపై అధ్యయన కేంద్రం ఏర్పాటు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, బాధ్యతాయుతమైన సాంకేతిక ఆధారిత వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం, వ్యవసాయ శాస్త్రం ద్వారా కలిగే ప్రభావాన్ని అం చనా వేయడం వంటి అంశాలకు భవిష్యత్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని డా. పరోడా సూచిం చారు. నైపుణ్యవంతమైన మానవ వనరులే కీలకండేర్ కార్యదర్శి, ఐకార్ డైరెక్టర్ జనరల్ డా. మాంగి లాల్ జాట్ మాట్లాడుతూ వ్యవసాయ రం గానికి సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలు, నిర్వహణ సామర్థ్యాలతో కూడిన మానవ వనరులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉం దన్నారు. వ్యవసాయ రంగంలో నాయకత్వ లక్షణాలను పెం పొందించడంతో పాటు, మారుతున్న అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మార్చాలని అన్నారు. ఐకార్ విద్యా విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. యశ్‌పాల్ సింగ్ మాలిక్ ఆన్‌లైన్‌లో పాల్గొని ప్రసంగించారు. కృత్రిమ మే ధస్సు, ఆన్లైన్ విద్యా విధానాలు, డిజిటల్ ఆధారిత అభ్యాస వ్యవస్థల అభివృద్ధిలో నార్మ్ చే స్తున్న కృషిని అభినందించారు. విజయవంతమైన వంద వ్యవసాయ ఆధారిత కొత్త సంస్థలను అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని అభినందించారు. రైతులకు చేరువగా కొత్త సేవలు2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం కోసం వ్యవసాయ పారిశ్రామికవేత్తల అభివృద్ధి" అనే అంశంతో నిర్వహించిన వేడుకల్లో నార్మ్ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం సంస్థ ఐదు దశాబ్దాల ప్రస్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. జాయింట్ డైరెక్టర్ డా. గోపాల్ లాల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయం, ఆధునిక సమాచార సాంకేతికత ఆధారిత వ్యవసాయం తదితర అంశాలపై రూపొందించిన పలు ప్రచురణలు, విధాన పత్రాలు, సాంకేతిక నివేదికలను విడుదల చేశారు. రైతులకు అవసరమైన సమాచారాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు చివరి స్థాయి వరకు అనుసంధానాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రైతుల సమాచార భాండాగారం, నార్మ్ గ్రంథాలయ మొబైల్ అనువర్తనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థాగత, క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో విశిష్ట సేవలు అందించిన శాస్త్రీయ, సాంకేతిక, పరిపాలనా, ఆర్థిక విభాగాల సిబ్బందిని ప్రశంసాపత్రాలు, పురస్కారాలతో సత్కరించారు.

# ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే సమగ్ర దేశ నిర్మాణం

- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్ దోమల్‌గూడ ఏ.వి.కళాశాలలో పోషణ మాసోత్సవం-2026 ప్రారంభం



**ముషీరాబాద్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ స్పష్టం చేశారు. మంగళవారం దోమలగూడలోని ఏ.వి.కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషణ మసోత్సవం-2026పై ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ నిర్మాణం అంటే ఇటుకలు, సిమెంటు, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రితో కట్టడాలు నిర్మించటం మాత్రమే కాదని, చిన్నారులను ఆరోగ్యవంతులుగా ధృఢంగా తీర్చిదిద్దటమే నిజమైన దేశ నిర్మాణమని అన్నారు. ధృఢమైన చిన్నారులతోనే ధృఢమైన భారత్, ఆరోగ్యవంతమైన భారత్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. పాశ్చాత్య నాగరికతలో పడి మన సాంప్రదాయ వంటలను విస్మరిస్తున్నామని, పోషకాహారంపై అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శనను ఏర్పాటుచేయటం అభినందనీయమని, సీబీసీని డాక్టర్ లక్ష్మణ్ అభినందించారు. మోదీ కలలు కన్న ఫిట్ ఇండియా, హెల్దీ ఇండియా, హెల్దీ నేషన్ సాకారం కావాలంటే మనము, మనతో పాటు మన చుట్టూ ఉన్న సమాజం కూడా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. పోషకాహార అవగాహనా కార్యక్రమంలో విద్యార్థులు, యువత క్రియాశీల కార్యకర్తలుగా భాగస్వాములుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ పోషకాహారంపై అవగాహనను ఆరోగ్యకరమైన అలవాట్లుగా మార్చి, మరింత ఆరోగ్యవంతమైన, బలమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడటం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. సెప్టెంబర్ 1నుంచి 5 వరకు జరిగే ఈ కార్యక్రమంలో దాదాపు 40 పోషకాహార సమాచార ప్యానెళ్లతో ప్రదర్శన, నిపుణుల ప్రసంగాలు, ఐఈసీ స్టాళ్లు, ప్రదర్శనాత్మక కార్యక్రమాలు ఉంటాయని, పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులపై సందేశాలను అందించే ఒగ్గుకథ, వీధి నాటకం, కోలాటం, యక్షగానం వంటి సంప్రదాయ జానపద కళా ప్రదర్శనలు కూడా ఈ కార్యక్రమంలో భాగం అవుతాయని వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి అచ్చుత్ ప్రసాద్‌రెడ్డి, ఏవి కళాశాల ప్రిన్స్‌పల్ డాక్టర్ పద్మ, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా కోసం పోరాటం అవసరం

**మాజీ డీజీపీ డా.జె.పూర్ణచంద్రరావు**




క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీజీపీ డా. జె.పూర్ణచంద్రరావు, చిత్రంలో బక్క పరంజ్యోతి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** దళిత క్రైస్తవులపై జరుగుతున్న సామాజిక, పరిపాలనా వివక్షను ఎదుర్కొనేందుకు ప్రార్థనతో పాటు సంఘటిత కార్యాచరణ, రాజకీయ చైతన్యం అవసరమని మాజీ డీజీపీ డా. జె.పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజీలో క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళిత క్రైస్తవులు మతం మారినంత మాత్రాన వారి సామాజిక స్థితి, కుల వివక్ష అంతరించిపోదని అన్నారు. 'మతం మారితే కులం మారుతుందా?' అని ప్రశ్నిస్తూ, దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా సమస్య కేవలం మతపరమైనది కాకుండా అస్తిత్వం, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వాలు ఉన్నా దళిత క్రైస్తవుల సమస్యలను సమగ్రంగా పరిష్కరించే రాజకీయ సంకల్పం కనిపించడం లేదని విమర్శించారు. ఉభయ రాష్ట్రాల్లో లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న సమస్యపై రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్లు కోరడం తప్ప బలమైన ఉద్యమాలు చేపట్టడం లేదన్నారు. క్రైస్తవ బిషపులు, పాస్టర్లు, మత పెద్దలు సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకులుగానే కాకుండా సామాజిక నాయకత్వాన్ని తీర్చిదిద్దే బాధ్యత కూడా తీసుకోవాలని డా. పూర్ణచంద్రరావు కోరారు. మన సమాజం తరఫున రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడగల నాయకత్వాన్ని తయారు చేయాలి. కమిటీలు ఏర్పాటు చేసి ఆగిపోకుండా వారం వారీగా, నెలవారీగా ఏ కార్యక్రమం చేపట్టాలో నిర్ణయించాలి అని ఆయన సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బక్క పరంజ్యోతి మాట్లాడుతూ మన హక్కుల కోసం మనమే రాజకీయ శక్తిగా ఎదగాలని, క్రైస్తవులు, దళిత క్రైస్తవులు తమ రాజ్యాంగ హక్కులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. మన హక్కులను ఎవరో వచ్చి కాపాడతారని ఎదురుచూడటం సరైంది కాదు. మన కోసం మనమే పోరాడితేనే పౌరులుగా ఆత్మగౌరవంతో నిలబడగలం అన్నారు. క్రైస్తవుల ప్రార్థనా స్వేచ్ఛ, చర్చిల రక్షణ, మత స్వేచ్ఛ వంటి రాజ్యాంగ హక్కుల అమలుపై నిరంతర నిఘా అవసరమన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎన్.ఏ.డి. పాల్, బిషప్ డొక్కా డేనియల్, బ్యాంకు రిటైర్డ్ ఏజీఎం అశోక్ కుమార్, ప్రభుదాస్, పాస్టర్ ప్రకాష్ రావు , దయానంద గురువు, రాష్ట్ర, జిల్లా నాయకులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

# వికటించిన క్లోరోక్విన్ మాత్రలు, చిన్నారి మృతి

**చింతూరు, సెప్టెంబర్ 1 (ప్రభాత వార్త):** క్లోరోక్విన్ మాత్రలు వికటించి ఒక విద్యార్థిని మృతి చెందగా మరో 27 మంది విద్యార్థులు అశ్వత్థకు గురైన విషాద ఘటన ఇది. పోలవరం జిల్లా ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ పరిధిలోని గొల్లగుప్ప గ్రామంలో మలేరియా నివారణకు సంబంధించిన క్లోరోక్విన్ మాత్రలు తీసుకున్న అనంతరం విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం సాయంత్రం మన్యంలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఏడేళ్ల చిన్నారి జమీనా మృతి చెందగా, మరో 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. గత వారం రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఒకరు మలేరియతో మృతి చెందారు . దాంతో అప్రమత్తం అయిన వైద్య ఆరోగ్య శాఖ గొల్లగుప్ప గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పాఠశాల విద్యా ర్థులకు కూడా మలేరియా నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించడంతో పాటు విద్యార్థులకు మలే రియా నివారణ మాత్రలు మింగించారు. మొత్తం 75 మంది మాత్రలు తీసుకున్నారు. గ్రామస్తులకు కూడా మాత్రలను పంపిణీ చేశారు. అయితే సాయంత్రం ఐదు గంటల ప్రాంతం నుంచి మాత్రలు తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గుర వుతుండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి విషమంగా ఉన్న ఏడేళ్ల చిన్నారి జమీనా ను తొలుత లక్ష్మీపురం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చిన్నారి మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన గొల్లగుప్ప గ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అస్వస్థతకు గురైన విద్యార్థులను ట్రాక్టర్ల సహాయంతో ప్రధాన రహదారి వరకు తరలించి, అక్కడి నుంచి అంబులెన్సుల ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. పాఠశాలలోని మొత్తం 28 మంది విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా, మరో 27 మంది అస్వస్థతకు గురైనట్లు సమాచారం. రాత్రి 9 గంటల సమయంలో ఒక అంబులెన్స్‌లో ఏడుగురు విద్యార్థులను భద్రాచలం తరలించగా, మరో అంబులెన్స్‌లో మరో నలుగురిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 14 మంది చిన్నారులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా మిగిలినవారని లక్ష్మీపురం పిహెచ్ సి లో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. మిగిలిన విద్యార్థులను కూడా పరిస్థితిని బట్టి ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలు

**తక్షణమే పరిష్కరించాలి: ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి**




ధర్నాలో పాల్గొన్న ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ నేతలు

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఉద్యోగ ఉపా ధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపా ల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమా ండ్ చేశారు. మంగళ వారం ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ యూనియన్ (పిఆం `టియూ) తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఇం దిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంకు ముఖ్యఅతిధిగా హాజరై శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం పీఆర్‌సీని వెంటనే అమలుచేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్‌లు మాట్లాడుతూ వందరోజుల్లో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేటి వరకు హామీలు అమలుచేయకపోవటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. 2003 డిఎస్సీ వారికి ఓపీఎస్ అమలుచేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పెన్షనర్ల సంగం అధ్యటఉలు పేరి వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, త్రివేణి, శ్రీనివాసాచారి మరియు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 100 అడుగుల శివాజీ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైన ఏర్పాటు చేయాలి



ఫోటోలను ఆవిష్కరిస్తున్న శివసేన నాయకులు

**సైఫాబాద్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** 100 అడుగుల ఎత్తుగల ఛత్రపతి శివాజీ మ హారాజ్ భారీ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైన ఏ ర్పాటు చేయాలని, ఇం దుకోసం ప్రభుత్వం ఒక కమిటీని నియమించాలని శివసేన రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ విగ్రహం ఏర్పాటుకు భక్తులు, అభిమానులే విరాళాలను సమీకరించుకుంటారని, ఈ బాధ్యతలను తమ పార్టీకి అప్పగిస్తే నిర్మించడానికి సిద్ధంగా ఉందని కమిటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింకార శివాజీ, జి. సుధాకర్ మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరారు. అలాగే వారు విఘ్నేశరుడి, శివాజీ, బాలగంగాధర్‌తిలక్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. హుస్సేన్‌సాగర్ పేరును 'వినాయక సాగర్'గా మార్చాలని, ట్యాంక్‌బండ్‌పైన గణేషుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాల వద్ద జాతీయ జెండాలను, తిలక్ చిత్రపటాలను ఉంచాలని, సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినంగా ప్రభుత్వం ప్రకటించి, అధికారికంగా నిర్వహించాలని, జాతీయ జెండాలను ఎగరవేయాలని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్‌తిలక్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించాలని, ఆయన ఆశయాలను స్మరించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రోస్టర్ పాయింట్లపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్**




**సైఫాబాద్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మాలలకు విద్యా , ఉద్యోగ రంగాలలో నష్టం జరిగే విధంగా ఉన్న రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం సవరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. ఈ విషయంపై మాల ప్రజా ప్రతినిధులు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి తమ గొంతును వినిపించాలని, లేని పక్షంలో మాలల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం మింట్‌కాంపౌండ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో గ్రూప్-3లోని 26 ఎస్సీ కులాలకు 5 శాతం రిజర్వేషన్‌లు కల్పించినప్పటికి విద్యా, ఉద్యోగ రంగాలలో నోఫికేషన్‌లో రెండు శాతం కూడా మాలలకు అవకాశం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం మాలలకు రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాడమేనన్నారు. ఈ విషయంపై మాలలంతా గత 16 నెలలుగా పోరాటం చేస్తున్నప్పటికి మాల ప్రజాప్రతినిధులు నీమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్ర మ ంత్రి వివేక్‌వెంకటస్వామి, ఎమ్మెల్యే నాగరాజు మాత్రమే మాలల పక్షాన మాట్లాడుతున్నారని, మిగతావారు ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాలలే కారణమని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాలలను అణిచివేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ రోస్టర్ పాయింట్లను సవరించి మాలలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో వచ్చే అన్ని ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు జంగా శ్రీనివాస్, బైండ్ల శ్రీనివాస్, శ్రీకాంత్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన టోలీచౌకి ఎస్ఐ ఆర్. పాండు నాయక్

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త :** రూ.10 వేలు లంచం తీసుకుంటూ టోలిచౌకి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై ఆర్. పాండు నాయక్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మంగళవారం సిటీ రేంజ్-1 ఏసీబీ అధికారులు వలపన్ని ఎస్ ఐని అదుపులోకి తీసుకున్నారు. తన తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా కుటుంబ సభ్యుల మధ్య సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని, ఫిర్యాదుదారుడి పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు ఎస్ ఐ రూ.10 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకుని, అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విధులను నిజాయితీగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని, ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఒకే వేదికపై భారత్, పాక్ ప్రధానులు

**- షాంఘై సదస్సులో దేశాధినేతలతో ప్రధాని మోడీ గ్రూప్ ఫొటో - దాయాది చిల్లర చేష్ట.. గ్రూప్ ఫొటోలో మోడీని క్రాప్ చేసిన పాక్ - షెహబాజ్ షరీఫ్‌తో ఉన్న పూర్తి ఫొటోను పంచుకున్న భారత్**



**బిష్కెక్, సెప్టెంబర్ 1:** భారత్ - పాకిస్థాన్ ప్రధాన మంత్రులు నరేంద్రమోడీ, షెహబాజ్ షరీఫ్ కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు వేదికగా కలుసుకున్నారు. అయితే, ముఖాముఖీ కాదు, ఈ ప్రాంతీయ కూటమి కీలక చర్చల్లో భాగంగా ఇతర దేశాధినేతలతో కలిసి గ్రూప్ ఫొటోగ్రాఫ్‌లో పాల్గొన్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఇతర దేశాల నేతలతో కలిసి ఒకే వేదికపై ఫొటోలకు పోజిచ్చారు. అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ తన సంకుచిత మనస్తత్వాన్ని మరోసారి చాటుకుంది. షాంఘై సహకార సంస్థ దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా తీసిన సామూహిక గ్రూప్ ఫొటో నుంచి భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రాన్ని తొలగించి (క్రాప్ చేసి) ఆ దేశం ప్రచురించింది. ఈ ఫొటోను పాకిస్థాన్ ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పంచుకునే క్రమంలో, అందులో ఉన్న భారత ప్రధాని మోడీని కత్తిరించి పక్కనపెట్టింది. కేవలం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఇతర నేతలు ఉన్న భాగాన్ని మాత్రమే ప్రచురించింది. ఈ చర్యపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మరోవైపు, భారత్ మాత్రం ఈ విషయంలో ఎంతో హుందాగా వ్యవహరించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సహా నేతలందరూ ఉన్న పూర్తి ఫొటోను అధికారికంగా విడుదల చేసింది. ఈ రెండు ఫొటోలను పోలుస్తూ నెటిజన్లు పాకిస్థాన్ తీరుపై మండిపడుతున్నారు. ఇది పాక్ ప్రదర్శించిన సంకుచిత వైఖరి అని, వారి దిగజారుడు మనస్తత్వానికి ఇది నిదర్శనమని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట

**కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు హైకోర్టు అనుమతి**



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 1:** అవినీతి సంబంధిత కేసుల్లో జైలుశిక్ష అనుభవిస్తోన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీకి భారీ ఊరట లభించింది. రావల్పిండిలోని అడియాలా కారాగారంలో ఉన్న ఈ ఇద్దరిని జైలులో ఒంటరిగా నిర్బంధించకుండా చూడాలని అధికారులను ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశించింది. నిబంధనలకు అనుగుణంగా ఇమ్రాన్‌ను కుటుంబసభ్యులు కలిసేందుకు అనుమతించాలని, తన కుమారులతో ఆయన టెలిఫోనలో మాట్లాడేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపింది. ఇమ్రాన్‌ఖాన్, బుష్రాబీబీలను జైలులో ఒంటరిగా నిర్బంధించారని ఆరోపిస్తూ.. కుటుంబసభ్యులు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ఆగస్టు 6న తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం దాన్ని వెలువరించింది. ఇమ్రాన్‌ఖాన్‌కు రోజూ వార్తాపత్రికలు, పుస్తకాలు ఇవ్వాలని, వైద్య సౌకర్యాలు అందేలా చూడాలని సూచించింది. కోర్టు ఉత్తర్వుల అమలుపై 15 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్‌ఖాన్ జైల్లోనే ఉన్నారు. కుటుంబసభ్యులను కలవనీయకుండా, తగిన వైద్య సేవలు అందనీయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆయన మద్దతుదారులు, బంధువులు పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది. ఇటీవల పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో వైద్యపరీక్షల అనంతరం ఇమ్రాన్‌ను తిరిగి జైలుకు తరలించింది. అల్ షిఫా ఆస్పత్రి డాక్టర్ల సమక్షంలో వైద్యపరీక్షలు నిర్వహించామని, ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లు తేలిందని ప్రకటించింది.

## మరిన్ని ఎస్400 క్షిపణుల సమీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్1:** భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్400 ట్రయంఫ్ క్షిపణి గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. ఈనేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎస్400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది.

## రైతు ఇంటికి సిఎం విజయ్



**చెన్నై, సెప్టెంబర్ 1:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పర్యటనలో ఒక రైతు కుటుంబానికి అనూహ్య రీతిలో ఆశ్చర్యాన్ని కలిగించారు. మంగళవారం సేలం జిల్లాలో పర్యటించిన ఆయన, ఒక గ్రామంలో ఆకస్మికంగా ఆగి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఒక వృద్ధురాలు చూపిన ఆత్మీయతకు ముగ్ధుడైన ఆయన, తాను ధరించిన కళ్లజోడును ఆమెకు బహుమతిగా అందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సేలం జిల్లాలోని మెట్టూరు డ్యామ్ గేట్లను తెరిచి, సాగునీటిని విడుదల చేసే క్రమంలో ముఖ్యమంత్రి విజయ్ అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని చెన్నైకి తిరుగుప్రయాణమైన ఆయన, మార్గమధ్యలోని చిన్నకావూరు గ్రామం వద్ద తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. నేరుగా రామస్వామి అనే రైతు నివాసానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పలకరించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షాతిరేకలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఒక వృద్ధురాలు ముఖ్యమంత్రిని చూడగానే అమితానందానికి లోనయ్యారు. ఆత్మీయంగా ఆయన్ను ఆలింగనం చేసుకుని, చేతిని గట్టిగా పట్టుకుని తన అనురాగాన్ని చాటుకున్నారు. అనంతరం తన పెరట్లోని తోటను ఆయనకు చూపించారు. ఆమె అభిమానానికి చలించిన విజయ్, తక్షణమే తాను ధరించిన కళ్లజోడును తీసి ఆమెకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత గ్రామంలోని వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, విజయ్ ఆ బామ్మకు బహూకరించిన సన్ గ్లాసులు వరల్డ్ క్లాస్ సంస్థ 'క్రిస్టియన్ డయోర్' తయారు చేసినవి. వీటి ధర రూ.50 వేలకు పైనే ఉంటుంది.

## ఉక్రెయిన్‌పై రష్యా వైమానిక దాడి భారతీయుడు సహా 12 మంది మృతి



**కీవ్, సెప్టెంబరు 1:** రష్యా మరోసారి ఉక్రెయిన్‌పై భారీ వైమానిక దాడికి పాల్ప డింది. మంగళవారం తెల్లవారుజామున కీవ్ సహా పలు ప్రాంతాలపై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతోపాటు డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోగా.. మృతుల్లో ఒక భారతీయుడు ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. మరో 18 మందికిపైగా తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు. మొత్తం 218 డ్రోన్లు, బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను రష్యా ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. వీటిలో దాదాపు మూడో వంతు జెట్ ఇంజియణన కలిగిన డ్రోన్లు ఉన్నట్లు తెలిపింది. ఈ దాడిలో కీవ్‌లోని నివాస భవనాలు, రైల్వే సదుపాయాలు దెబ్బతిన్నాయి. బోరిస్‌పిల్‌లో ఐదు అంతస్తుల భవనం దెబ్బతినడంతో అధికారులు ఖాళీ చేయించారు. దాడి అనంతరం కీవ్, చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు 350 మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. రష్యా దాడులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో రవాణా, మౌలిక వసతులు దెబ్బతిన్నట్లు జెలెన్స్కీ తెలిపారు. పౌరుల ప్రాణాలను కాపాడేందుకు మరిన్ని బాలిస్టిక్ క్షిపణి నిరోధక వ్యవస్థలు తమకు అవసరమని ఆయన అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.

## పెరుగుతున్న సముద్ర మట్టాలు

**- తీరప్రాంతాలకు పెనుప్రమాదం: ఐక్యరాజ్యసమితి హెచ్చరిక**

**జెనీవా, సెప్టెంబర్ 1:** వాతావరణ మార్పులకు తోడు సముద్ర మట్టాలు వేగంగా పెరుగు తుండటంతో తీర ప్రాంతాలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. భారత్‌లోని కోల్‌కతా, ముంబై నగరాలతో పాటు దక్షిణాసియాలోని దాదాపు 1.4 కోట్లకు పైగా ప్రజలు తమ ఇళ్లను, నివాసాలను కోల్పోయే తీవ్ర ప్రమాదంలో ఉన్నారని పేర్కొంది. ఐరాస సెక్రటరీ జనరల్ సమర్పించిన 'సముద్ర మట్టాల పెరుగుదల- ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాల్లు' అనే నివేదికలో ఈ విషయాలను వెల్ల డించారు. 2014 నుంచి 2023 మధ్య కాలంలో ఏటా సగటున 4.7 మిమీ చొప్పున పెరిగిన సముద్ర మట్టం, 2024లో ఏకంగా 5.9 మి.మీ పెరిగి నూతన రికార్డును నమోదు చేసిందని నివేదికలో తెలిపారు. ఈ తీవ్రమైన వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి దీర్ఘ కాలిక ప్రణాళికలు, ముందస్తు జాగ్రత్తలు, తగినన్ని నిధులను సమ కూర్చుకోవాలని సభ్య దేశాలకు ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. మానవ తప్పిదాల వల్ల జరుగు తున్న గ్లోబల్ వార్మింగ్, గ్లేసియర్లు కరగడం, మహాసముద్రాలు వేడెక్కడం వల్ల చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని ఐరాస స్పష్టం చేసింది. దీంతో దక్షిణాసియాలోని లోతట్టు డెల్టా ప్రాంతా లైన కోల్‌కతా, ముంబై, ఢాకా నగరాల్లో జలాలు ముంచెత్తడం వల్ల 1.4 కోట్ల మంది నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందన్నారు.

## ఎయిర్‌ఫోర్స్‌లో శక్తి శర్మ రికార్డు

**- ఎయిర్ వైస్ మార్షల్ ర్యాంక్ సాధించిన తొలి మహిళా ఆఫీసర్‌గా గుర్తింపు**



**కోల్‌కతా, సెప్టెంబర్ 1:** భారత వైమానిక దళంలో ఓ చరిత్రాత్మక ఘట్టం నమోదైంది. నాన్‌మెడికల్ విభాగంలో 'ఎయిర్ వైస్ మార్షల్' ర్యాంక్‌ను సాధించిన మొదటి మహిళా అధికారిణిగా శక్తి శర్మ చరిత్ర సృష్టించారు. మంగళవారం ఆమె ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో 'అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (ఎడ్యుకేషన్)'గా అధికార బాధ్యతలు స్వీకరించారు. 1994 జూన్ 18న భారత వైమానిక దళానికి చెందిన ఎడ్యుకేషన్ బ్రాంచ్‌లో శక్తి శర్మ అధికారిణిగా విధుల్లో చేరారు. దాదాపు ముప్పై యేళ్లకు పైగా విశిష్ట సేవలు అందించిన ఆమె ట్రైనింగ్ సెంటర్లు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌తో పాటు ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఐఐటీ కాన్పూర్, పుణె యూనివర్సిటీలలో డిఫెన్స్ సహకారాన్ని పెంచేలా 'ఐఎఫ్ చైర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయడంలో శక్తి శర్మ ప్రముఖ పాత్ర పోషించారు. అంతేకాదు, సైనిక దళాల చరిత్రలోనే ఒక సైనిక స్కూల్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా (కపూర్తలా సైనిక స్కూల్ ప్రిన్సిపాల్‌గా) వ్యవహరించిన తొలి మహిళా అధికారిణిగా కూడా ఆమె రికార్డు సాధించారు.

# ఒకే ఇంట్లో 24 మృతదేహాలు నేపాల్‌లో ఎటుచూసినా విషాదమే



**ఖాట్మండ్, సెప్టెంబర్ 1:** నేపాల్‌లో బురదతో కూడిన వరద విలయం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే శక్తివంతమైన ఆ బురద ధాటికి అనేక ఇండ్లు ధ్వంసం అయ్యాయి. ఆ శిథిలాల్లో చిక్కుకున్న వారిని రక్షి స్తున్నారు. కొన్ని ఇండ్లల్లో మృతదేహాలను వెలికి తీస్తున్నారు. నువాకోట్ జిల్లాలో తీవ్ర విషాద ఘటన జరిగింది. బిదుర్ మున్సిపాల్టీలోని బేత్రావతి వద్ద ఓ ఇంట్లో 24 మంది మృతదేహాలను బయటకు తీశారు. హెలికాప్టర్ల సహాయంతో నేపాల్ ఆర్మీ గాలింపు చర్యలు చేపడుతున్నది. అయితే వరద ప్రభావానికి గురైన ఓ ఇంటిని పరిశీలిస్తున్న సమయంలో ఆ ఇంట్లో అనూహ్య రీతిలో 24 మంది శవాలను గుర్తించారు. ఈ విషయాన్ని ఆ జిల్లా ఎస్పీ బిపిన్ రెగ్మీ ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాల తుది సంఖ్య తర్వాత వెల్లడించనున్నట్లు తెలిపారు. అయితే ఆ ఇళ్లు ఎవరికి చెందినదో తెలియదు. దాని యజమాని ఎవరో తెలియదు. స్థానిక అధికారుల సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు. బహుశా ఆ బిల్డింగ్ ఓ హోటల్ లేదా గెస్ట్ హౌస్ అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### నేపాల్ విపత్తును ముందే పసిగట్టిన 'నైసర్'శాటిలైట్

నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఘోర విపత్తు నేపథ్యంలో, ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నైసర్' ఉపగ్రహం పనితీరుపై వచ్చిన విమర్శలు నిరాధారమని తేలింది. విపత్తును ముందుగా హెచ్చరించడంలో ఈ శక్తిమంతమైన శాటిలైట్ విఫలమైందన్న ఆరోపణలను తాజా విశ్లేషణలు పటాపంచలు చేశాయి. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే నైసర్ స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను పంపిందని వెల్లడైంది.

చైనాలోని చాంగాన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి జెన్‌షియాంగ్ లియు, నైసర్ చిత్రాలను విశ్లేషించి ఈ కీలక విషయాలను వెల్లడించాడు. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే ప్రమాదకర ప్రాంతంలోని పర్వత వాలులో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు అతడు గుర్తించాడు. అక్కడి మంచు, రాతి పొరలు తీవ్ర ఒత్తిడికి గురై, ఆ ప్రాంతం ఏకంగా కొన్ని మీటర్ల మేర పక్కకు జరిగినట్లు తేలింది.

ఈ కదలికలు ఒకేచోట కేంద్రీకృతం కావడం, రాబోయే కొండచరియల విపత్తుకు స్పష్టమైన సంకేతమని లియు తన విశ్లేషణలో పేర్కొన్నాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) సంయుక్తంగా ఈ 'నైసర్' (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందే గుర్తించి, హెచ్చరికలు జారీ చేసే లక్ష్యంతో దీన్ని గత ఏడాదే ప్రయోగించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భూ పరిశీలన ఉపగ్రహాల్లో ఒకటి. మేఘాలు, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ పగలు, రాత్రి తేడా లేకుండా స్పష్టమైన చిత్రాలను తీయగల రెండు సింథటిక్ అపెర్చర్ రాడార్లను (ఎల్‌బ్యాండ్, ఎస్‌బ్యాండ్) కలిగి ఉన్న తొలి శాటిలైట్ ఇదే.

ఈ వివరాల ప్రకారం, నైసర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిందని, విపత్తుకు సంబంధించిన కీలక సమాచారాన్ని ముందే అందించిందని స్పష్టమవుతోంది.

అయితే, ఆ సంకేతాలను సరైన సమయంలో విశ్లేషించి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టడంలోనే అసలు సవాలు ఉందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

## కళ్లెదుటే ప్రళయం

**- ప్రాణభయంతో పరుగులు, కిందపడ్డా ఆగని ఫోన్ రికార్డింగ్!**

**ఖాట్మండ్, సెప్టెంబర్ 1:** నేపాల్‌లో సంభవించిన భారీ వరద బీభత్సానికి సంబంధించిన ఒక హృదయవిదారక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బురద నీటి ప్రళయం వేగంగా దూసుకొస్తుండగా, ఒక వ్యక్తి దాన్ని తన ఫోన్‌లో చిత్రీకరిస్తూ ప్రాణభయంతో పరుగులు తీయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. అతను కిందపడిపోయినా, ఫోన్ మాత్రం రికార్డింగ్ ఆపకుండా అక్కడి భయానక వాతావరణాన్ని రికార్డ్ చేస్తూనే ఉంది. ఈ వీడియో ప్రారంభంలో, కొందరు వ్యక్తులు ఒక వరద కాలువ సమీపంలోని పొదల వద్ద నిలబడి ఉండగా, బురద నీటి ప్రవాహం గోడలా దూసుకురావడం కనిపిస్తుంది. ప్రమాదాన్ని పసిగట్టిన వారు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు. కెమెరా వేగంగా కదులుతూ, వారు చెట్లు, పొదల గుండా పరుగెత్తిన దృశ్యాలను రికార్డ్ చేసింది. చివరకు ఆ ఫోన్ కిందపడిపోయి, రాతి నేలను చూపిస్తూ రికార్డింగ్ కొనసాగించింది.

ఈ వీడియోలో ఉన్నవారు వరదలో కొట్టుకుపోయి చనిపోయారని, వారి చివరి క్షణాలను ఈ ఫోన్ రికార్డ్ చేసిందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ వీడియో ప్రామాణికతను గానీ, ఇది ఎక్కడ జరిగిందనే విషయాన్ని గానీ స్వతంత్రంగా ధ్రువీకరించలేమని పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. వీడియోలో ఎవరైనా వరదలో కొట్టుకుపోయినట్లు స్పష్టంగా కనిపించకపోవడం గమనార్హం.

# రష్యా సైన్యంలో భారతీయుల రిక్రూట్‌మెంట్

## 227 మంది చేరగా 51 మంది మృతి : కేంద్రం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** రష్యా సాయుధ బలగాల్లో చేరిన భారతీయ పౌరులకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. విదేశాంగ కార్యదర్శి విక్రమ్‌మిస్రీ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇప్పటివరకు లభించిన నిర్ధారిత సమాచారం ప్రకారం మొత్తం 227 మంది భారతీయ పౌరులు రష్యా ఆర్మీలో రిక్రూట్ అయ్యారని తెలిపారు. అయితే తీవ్రదిగ్భ్రాంతికరంగా వారిలో 51 మంది ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఇక మిగిలిన వారిని సురక్షితంగా రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**139 మంది డిశ్చార్జ్..**

**బాధితుల కోసం నిరంతర యత్నాలు**

విదేశాంగ కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీలో చేరిన 227 మందిలో ఇప్పటికే 139 మంది భారత పౌరులు సేవల నుంచి విడుదలయ్యారు. మిగిలిన వారిని కూడా వీలైనంత త్వరగా విడుదల చేసి, వారి కుటుంబాల వద్దకు క్షేమంగా చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది.

మాస్కోలోని భారత రాయబార కార్యాలయం ఈ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రష్యన్ అధికార యంత్రాంగంతో మాట్లాడి తుది ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దౌత్య మార్గాల ద్వారా ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక భేటీ జరిగింది. ఈ సమావేశంలో విదేశాంగ కార్యదర్శి మిస్రీ మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గత సదస్సు సందర్భంగా భారతదేశంలో నిర్వహించిన 'రష్యన్ ఇంపోర్టర్స్ ఫోరమ్' విజయ వంతమైందని, రాబోయే వార్షిక సమ్మిట్ వేళ రష్యాలో 'ఇండియన్ ఎక్స్‌పోర్టర్స్ ఫోరమ్'ను నిర్వహించబోతున్నామని ఆయన వివరించారు. దీనిపై అధ్యక్షుడు పుతిన్ కూడా సానుకూలంగా స్పందిస్తూ.. భారతీయ ఎగుమతిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు రష్యా వేదికను కల్పిస్తుందని హామీ ఇచ్చారని చెప్పారు.

# సంక్షిప్త వార్తలు

## ధ్వంసమైన జైషే స్థావరం పునరుద్ధరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన జైషే మహ్మద్ (జెఇఎం) ప్రధాన కార్యాలయాన్ని పాకిస్థాన్ మళ్లీ పునరుద్ధరించినట్లు భారత నిఘా వర్గాలు తెలిపాయి. బహావల్‌పూర్‌లోని 'మర్కజ్ సుభానల్లా' కేంద్రం పునర్నిర్మాణానికి పాక్ అధికారులు సుమారు రూ.25 కోట్ల పాకిస్థానీ కరెన్సీ కేటాయించినట్లు వెల్లడించాయి. గతేడాది మేలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సాయుధ బలగాలు ఈ స్థావరంపై దాడి చేశాయి. స్థావరంలో కార్యకలాపాలు మళ్లీ మొదలైనప్పటికీ జెఇఎం నేతలకు పాక్ అధికారులు పలు ఆంక్షలు విధించినట్లు సమాచారం.

## మమత మేనకోడలు అనుమానాస్పద మృతి



**కోల్‌కతా, సెప్టెంబర్ 1:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మేనకోడలు బిర్భూమ్ జిల్లాలో అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. 28యేళ్ల బృష్టి ముఖర్జీ ఫటక్ మృతదేహాన్ని రామ్‌పూర్‌హాట్‌లోని ఆమె ఇంట్లో పోలీసులు మంగళవారం గుర్తించారు. ఇంటి రెండో అంతస్తులోని ఓ గదిలో మధ్యాహ్నం మృతదేహం కనిపించడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని రామ్‌పూర్‌హాట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఆమె మృతికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియలేదని పోలీసు అధికారి తెలిపారు.

## పాక్‌లో పురాతన ఆలయం కూల్చివేత

**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 1:** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శతాబ్ద కాలం నాటి చరిత్ర కలిగిన ఒక హిందూ దేవాలయాన్ని కూల్చివేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నరోవల్ నగరం పరిధిలోని సిరాజ్ గ్రామంలో ఆగస్టు 21న ఈ సంఘటన చోటుచేసుకుంది. సమీపంలోని ఒక మదర్సా విస్తరణ కోసమే ఈ ఆలయాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని మైనారిటీ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. పాకిస్థాన్ మసీహా మిల్లత్ పార్టీ (పిఎంఎంపి) ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. కొందరు వ్యక్తుల పథకం ప్రకారం ఈ ఆలయ నిర్మాణాన్ని కూల్చివేశారని ఆ పార్టీ చైర్మన్ అస్లాం పర్వేజ్ సహోత్రా ఆరోపించారు.

## పిఎన్‌బిలో నకిలీ నోట్ల కలకలం

**సహారన్‌పూర్, సెప్టెంబర్ 1:** పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో భారీగా నకిలీ నోట్లు బయటపడ్డాయి. ఉత్తర్‌ప్రదేశ్ సహారన్‌పూర్‌లోని పిఎన్‌బి కరెన్సీ చెస్ట్‌లో సుమారు రూ.7.40 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ నోట్లు ఉన్నట్లు ఆడిట్‌లో తేలినట్టు తెలుస్తోంది. బ్యాంకు భద్రతా వ్యవస్థను దాటి నకిలీ నోట్లు కరెన్సీ చెస్ట్‌లోకి ఎలా వచ్చాయనే విషయం కలకలం రేపుతోంది. కరెన్సీ చెస్ట్‌లో భద్రపరిచిన అసలు నోట్లను మాయం చేసి, వాటి స్థానంలో నకిలీ నోట్లను ఉంచినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు బెదిరింపు లేఖ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాస్వాన్‌కు బెదిరింపు లేఖ వచ్చింది. పోస్ట్ ద్వారా వచ్చిన ఆ లేఖలో సంతకం కూడా లేదు. 'కరుడుగట్టిన ఉగ్రవాదులు త్వరలోనే నిన్ను హత్య చేస్తార్లు' అని హెచ్చరించినట్లు కేంద్ర మంత్రి కార్యాలయం మంగళవారం వెల్లడించింది. ఈ లేఖలో రెండు మొబైల్ నంబర్లను కూడా పేర్కొన్నారు.

ఈ బెదిరింపు లేఖపై కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ అదనపు ప్రైవేట్ కార్యదర్శి ఆలోక్ కుమార్ కేంద్ర హోంశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

# అఫ్ఘానిస్థాన్ టి20.. టీమిండియా ఖరారు

## ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి బుమ్రా, నితీష్ ఎంపిక



**న్యూఢిల్లీ:** సెప్టెంబర్ 1 (ఐఏఎన్ఎస్) సెప్టెంబర్ 13 నుంచి న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం భారత జట్టును ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ లకు ఎంపికలు ఖరారయ్యాయని, అయితే ఈ నలుగురు ఆటగాళ్ల భాగస్వామ్యం ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ ధృవీకరించింది. శ్రేయస్ అయ్యర్ మెన్ ఇన్ బ్లూ జట్టుకు నాయకత్వం వహించనుండగా, తిలక్ వర్మ అతనికి డిప్యూటీగా కొనసాగుతాడు. ఈ జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి వంటి రెగ్యులర్ ఆటగాళ్లు ఉన్నారు. జూలైలో జింబాబ్వేలో ఆడిన జట్టులో కొన్ని మార్పులు జరిగాయి. జింబాబ్వే టీ20లకు ఎంపిక కాని సంజు సామ్సన్ జట్టులోకి తిరిగి రాగా, బౌలింగ్ విభాగంలో రెగ్యులర్ స్పీడ్‌స్టర్లు తిరిగి రావడంతో మార్పులు చోటుచేసుకున్నాయి. అర్ష్‌దీప్‌తో పాటు బుమ్రా, హర్షిత్ జట్టులో చేరగా, జింబాబ్వే పర్యటన జట్టులో ఉన్న ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్ వంటి వారికి జట్టులో చోటు దక్కలేదు. వార్తలకు విరుద్ధంగా, హార్దిక్ పాండ్యాకు జట్టులో స్థానం లభించలేదు. జూలైలో ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డేల సందర్భంగా గాయపడి, అప్పటి నుంచి ఆటకు దూరమైన బుమ్రా తిరిగి రావడమే అతిపెద్ద పరిణామం. గత టీ20లో కడరాల నొప్పితో ఇంగ్లండ్ వండేలకు దూరమైన హర్షిత రాణా కూడా జట్టులోకి తిరిగివచ్చాడు. భారత్ జట్టులో శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్‌కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్, అక్షర్‌పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోరి, హర్షతిత్ బిష్టోయి, రవి రానా, వైభవ్ సూర్యవంశి ఉన్నారు.

## దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ఈస్ట్ జోన్

# 4 వికెట్ల తేడాతో సెంట్రల్ జోన్ ఓటమి



**బెంగుళూరు:** సెంట్రల్ జోన్‌పై ఈస్ట్ జోన్ విజయం సాధించి దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో దూసుకెళ్లింది. బెంగుళూరులో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జట్టు 159 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్ల తేడాతో ఛేదించి, డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్‌ను టోర్నమెంట్ నుండి నిష్క్రమించేలా చేసింది. మూడవ రోజు మంగళవారం ఆట ప్రారంభంలో సెంట్రల్ జట్టు 45/3తో కష్టాల్లో పడగా, ఈస్ట్ బౌలర్లు వికెట్లు తీస్తూనే ఉన్నారు. ముఖేష్ కుమార్ 4, షమీ 3 వికెట్లు దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌లో అభిజిత్ కె. సర్కార్ మొదట నైట్‌వాచ్‌మన్ ఆర్యన్ పాండేను అవుట్ చేయగా, ఆ తర్వాత షమీ, ముఖేష్‌లు యశ్ రాథోడ్, అమన్ మోఖడేలను పెవిలియన్‌కు పంపారు. ఈస్ట్ బౌలర్ల దూకుడుతో సెంట్రల్ జట్టు 97/8తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత హర్ష్ దుబే, అర్షద్ ఖాన్ పోరాటం మొదలుపెట్టి, తొమ్మిదో వికెట్‌కు 43 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 266 పరుగులకు అదనంగా సెంట్రల్ జట్టు 158 పరుగులకే ఆలౌట్ అయింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఈస్ట్ బ్యాటింగ్‌కు వచ్చింది. సూర్యవంశీ 43 పరుగులు చేయగా, అదే 14వ ఓవర్‌లో పాటిదార్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో అతను అవుటయ్యాడు. హర్ష్ మరో రెండు బంతుల్లో 2 వికెట్లు తీశాడు. అతను కుమార్ కుశాగ్ర, అనుకుల్ రాయ్‌లను అవుట్ చేయడంతో, ఇంకా 34 పరుగులు అవసరమైన తరుణంలో ఈస్ట్ జట్టు 124/5 స్కోరుకు పడిపోయింది. కానీ కిషన్ సంయమనం కోల్పోకుండా, సుదీప్ కుమార్ ఘరామీ వికెట్ కోల్పోయినప్పటికీ, 4 వికెట్లు మిగిలి ఉండగానే విజయ తీరాన్ని చేరుకున్నారు.

## యుఎస్ ఓపెన్..

# బెరెట్టినీ చేతిలో వావ్రింకా ఓటమి

**న్యూఢిల్లీ:** బెరెట్టినీ చేతిలో ఓటమితో వావ్రింకా భావోద్వేగభరితమైన యూఎస్ ఓపెన్ నుండి నిష్క్రమించింది. తొలి రౌండ్‌లో మాటియో బెరెట్టినీ చేతిలో 7-6(4), 7-6(3), 6-0 తేడాతో ఓటమి పాలైన తర్వాత, మాజీ యూఎస్ ఓపెన్ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా చివరి గ్రాండ్ స్లామ్ మ్యాచ్ ఓటమితో ముగిసింది. స్విస్ ఛాంపియన్ మొదటి రెండు సెట్‌ల పాటు తనకంటే చిన్న వయసున్న ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేసినా, మూడవ సెట్‌లో వెనుకబడ్డాడు. సుదీర్ఘంగా సాగిన గేమ్‌లో వావ్రింకా ఒక సెట్ పాయింట్ సాధించాడు. కానీ బెరెట్టిని నాలుగు డ్యూస్‌లను తట్టుకుని టైబ్రేక్‌కు దారితీశాడు. 30 ఏళ్ల అతను మరోసారి తన సంయమనాన్ని కోల్పోకుండా, వరుసగా మూడు పాయింట్లు గెలిచి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్‌లో వావ్రింకాకు మరో అవకాశం లభించింది. తర్వాత బెర్రెటినీ సర్వ్‌ను అతను తొందరగా బ్రేక్ చేశాడు. కానీ స్విస్ ఆటగాడు తన ఆధిక్యాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతనికి మూడు సెట్ పాయింట్లతో సహా ఏడు బ్రేక్ పాయింట్లు లభించినప్పటికీ, బెరెట్టిని మరో టైబ్రేక్‌కు దారితీసి, దానిని గెలిచి విజయానికి ఒక సెట్ దూరంలోకి వచ్చాడు. మాజీ ప్రపంచ ఆరో ర్యాంకర్, సుదీర్ఘ పోరాటం తర్వాత మూడు బ్రేక్‌లలో మొదటిదాన్ని సాధించి, వావ్రింకా యొక్క అద్భుతమైన గ్రాండ్ స్లామ్ కెరీర్‌కు తెరదించేలా బేగెల్‌ను అందించాడు.






## చైనా మాస్టర్స్.. తొలి రౌండ్‌లో నిష్క్రమించిన

# ఉన్నతి, హరిహరన్-అర్జున్

**షెన్‌జెన్:** చైనా మాస్టర్స్ సూపర్ 750లో భారత షట్లర్లకు నిరాశాజనకమైన ఆరంభం లభించింది. మంగళవారం సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అలాగే హరిహరన్ అమ్సకరుణన్-ఎంఆర్ అర్జున్‌ల పురుషుల డబుల్స్ జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఉన్నతి, తనకంటే ఉన్నత ర్యాంకు క్రీడాకారిణి అయిన దక్షిణ కొరియాకు చెందిన కిమ్ గాయూన్ చేతిలో 10-21, 18-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. ప్రపంచ 25వ ర్యాంర్ ఉన్నతి, ప్రపంచ 12వ ర్యాంకు క్రీడాకారిణి అయిన కిమ్ ముందు ఒత్తిడితో బరిలోకి దిగింది. ఆమె తొలి గేమ్‌లో కేవలం 10 పాయింట్లు మాత్రమే సాధించి పేలవంగా ప్రారంభించింది. రెండవ గేమ్‌లో, ఆ 18 ఏళ్ల అమ్మాయి మరింత పోరాటపటిమను కనబరిచి, పోటీతత్వాన్ని ప్రదర్శిస్తూ స్కోర్లను 18-18తో సమం చేసింది. అయితే, ఆమె ఆ ఊపును కొనసాగించలేక చివరి మూడు పాయింట్లను కోల్పోయి, వరుస గేమ్‌లలో ఓడిపోయింది. మరోపక్క హరిహరన్-అర్జున్‌ల భారత్ పురుషుల డబుల్స్ జోడీ మొదటి గేమ్ మధ్యలోనే వైదొలగాల్సి వచ్చింది. చైనాకు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేతలు చెన్ బో యాంగ్-లియు ద్వయంతో జరిగిన మ్యాచ్‌లో, ఆట మధ్య విరామ సమయంలో 8-11తో వెనుకబడి ఉన్న ఈ ద్వయం, గాయం కారణంగా మ్యాచ్‌ను వదులుకున్నారు.

## ఇంగ్లాండ్ టెస్ట్ ఎఫెక్ట్

# పాక్ క్రికెట్‌లో ప్రకంపనలు

## ఏడుగురు ఆటగాళ్లు, కోచ్‌లపై వేటు

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో వరుసగా తొలి రెండు మ్యాచ్‌లలో ఓడిపోయి సిరీస్ కోల్పోవడంతో పాకిస్థాన్ జట్టు యాజమాన్యం తీవ్ర చర్యలు చేపట్టింది. జట్టులో ఉన్న ఏడుగురు ఆటగాళ్లను తక్షణమే పర్యటన నుంచి తొలగించి స్వదేశానికి తిప్పి పంపింది. ఈ జాబితాలో మాజీ పరిమిత ఓవర్ల సారథి సల్మాన్ అఘా, వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్‌లతో పాటు ఆమిర్ జమాల్, ఖుర్రం షెహజాద్, అలీ ఉస్మాన్, మహమ్మద్ అవైస్ జఫార్ ఉన్నారు. ఇటీవల ఆడిన ఆరు టెస్టుల్లో ఐదింటిలో ఓడిపోవడం, ఆటగాళ్ల ప్రదర్శన ఘోరంగా ఉండటంతో బోర్డు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేవలం ఆటగాళ్లపైనే కాకుండా బౌలింగ్, హెడ్ కోచ్‌లపై కూడా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చర్యలు తీసుకుంది. ప్రస్తుత టెస్ట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను బాధ్యతల నుంచి తొలగించింది. వీరి స్థానంలో పరిమిత ఓవర్ల క్రికెట్ హెడ్ కోచ్‌గా ఉన్న న్యూజిలాండ్ మాజీ దిగ్గజం మైక్ హెస్సన్‌కు టెస్ట్ జట్టు బాధ్యతలను కూడా అప్పగించింది. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్ పూర్తయ్యే వరకు మైక్ హెస్సన్ పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు మార్గదర్శకం వహిస్తారు.



ఇక మూడో టెస్టు మ్యాచ్ ఈ నెల 9 నుంచి బర్మింగ్‌హామ్ వేదికగా ప్రారంభం కానుంది. దీనికోసం సామ్ ఆయుబ్, అబ్దుల్లా ఫజాల్‌లను జట్టులోకి తీసుకున్నారు. వారితో పాటు అరా ఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, మహమ్మద్ ఇమ్రాన్‌లను నూతనంగా జట్టులోకి ఎంపిక చేశారు. వీరికి వీసాలు లభించిన వెంటనే ఇంగ్లాండ్‌లోని జట్టుతో కలవనున్నారు.

# బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్ల పతనం

## వరుసగా రెండో రోజు నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబై, సెప్టెంబరు 1:** అమెరికా- ఇరాన్ మధ్య మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో, బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా మంగళవారం కీలక సూచీలు వరుసగా రెండో రోజు నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 12.99 పాయింట్లు (0.02 శాతం) తగ్గి 76,944.28 వద్ద ముగియగా, విస్తృత సూచీ అయిన నిఫ్టీ 24.60 పాయింట్లు (0.1 శాతం) క్షీణించి 24,055.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సాంకేతిక స్థితిగతులపై స్పందిస్తూ, నిపుణులు 24,150-24,200 స్థాయిలు తక్షణ 'రెసిస్టెన్స్ జోన్'గా పనిచేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. "సూచీ స్థిరపడటానికి, 24,300-24,400 స్థాయిల వైపు కోలుకోవడానికి 24,200 పైన నిలకడగా కదలడం అవసరం. సూచీ ఈ స్థాయిలను తిరిగి బలంగా అధిగమించే వరకు, అధిక స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది" అని ఒక మార్కెట్ నిపుణుడు తెలిపారు. "అదే సమయంలో, 24,000 అనే కీలకమైన మానసిక స్థాయికి దిగువన నిలకడగా ట్రేడింగ్ జరిగితే, సూచీ 23,900-23,800 స్థాయిల వైపు పడిపోయే ప్రమాదం ఉంది" అని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. నిఫ్టీలోని షేర్లలో శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకి ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచి, సూచీలపై ఒత్తిడిని పెంచాయి. విస్తృత మార్కెట్ కూడా ఒత్తిడిలోనే కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.39 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.23 శాతం మేర క్షీణించాయి.

వివిధ రంగాల సూచీలు మిశ్రమ ఫలితాలను నమోదు చేశాయి. నిఫ్టీ హెల్త్‌కేర్, నిఫ్టీ ఆటో, నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ ఫార్మా రంగాలు విస్తృత మార్కెట్ కంటే బలహీనమైన పనితీరును కనబరిచాయి. మరోవైపు, నిఫ్టీ ఎఫ్ఎంసిజి, నిఫ్టీ ఐటీ రంగాలు మెరుగైన పనితీరును కనబరిచి, భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్య మొత్తం మార్కెట్‌కు కొంత మద్దతు నిచ్చాయి. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక స్థిరత్వం, మార్కెట్ సెంటిమెంట్‌పై ఆందోళనలను పెంచడం, అలాగే అస్థిరత అధికంగా ఉండటంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారని మార్కెట్ నిపుణులు తెలిపారు.

# ఆగస్టు జిఎస్‌టి వసూళ్లు రూ.1.99 లక్షల కోట్లు




**ముంబై, సెప్టెంబరు 1:** 2026 ఆగస్టు జిఎస్‌టి వసూళ్లు రూ.1.99 లక్షల కోట్లకు చేరాయి. మంగళవారం ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం, దిగుమతి చేసుకున్న వస్తువులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడం వల్ల, ఆగస్టు నెలలో భారతదేశం స్థూల జిఎస్‌టి వసూళ్లు యేడాది ప్రాతిపదికన 14.8 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే ఆగస్టులో జిఎస్‌టి వసూళ్లు పెరిగినప్పటికీ, జులై నెలతో పోలిస్తే మాత్రం స్వల్ప తగ్గుదల కనిపించింది. జూలైలో స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆగస్టులో నమోదైన మొత్తం వసూళ్లలో, దేశీయ ఆదాయం వాటా రూ. 1.37 లక్షల కోట్లుగా ఉంది (గత ఏడాది ఆగస్టులో ఇది రూ.1.25 లక్షల కోట్లుగా ఉండేది, అంటే 9.3శాతం వృద్ధి నమోదైంది). మరోవైపు, దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం 29శాతంపెరిగి ఆగస్టులో రూ.62,604 కోట్లకు చేరింది. మొత్తం స్థూల జిఎస్‌టి ఆదాయంలో, కేంద్ర జిఎస్‌టి (సిజిఎస్‌టి) వాటా రూ.38,413 కోట్లు, రాష్ట్ర జిఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి) వాటా రూ.46,316 కోట్లు, సమీకృత జిఎస్‌టి (ఐజిఎస్‌టి) వాటా రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఆగస్టులో మొత్తం జిఎస్‌టి రీఫండ్లు (వాపసులు) 67.9శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. గత యేడాది ఆగస్టులో ఇవి రూ.18,935 కోట్లుగా ఉండేవి. ఇందులో దేశీయ రీఫండ్లు రూ.18,490 కోట్లు, ఎగుమతి రీఫండ్లు రూ.13,305 కోట్లుగా ఉన్నాయి. ఈ రీఫండ్లను (వాపసులను) పరిగణనలోకి తీసుకున్న తర్వాత, ఆగస్టు 2026లో మొత్తం నికర జిఎస్‌టి ఆదాయం 8.3శాతం పెరిగి రూ.1.68 లక్షల కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలోని ఇదే నెలలో ఇది రూ.1.55 లక్షల కోట్లుగా ఉండేది. నికర దేశీయ జిఎస్‌టి ఆదాయం 3.4శాతం పెరిగి రూ. 1.18 లక్షల కోట్లకు చేరగా, నికర కస్టమ్స్ ఆదాయం 22.3శాతం పెరిగి రూ.49,299 కోట్లకు చేరింది. "స్థూల జిఎస్‌టి ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14.8శాతం పెరగగా, దేశీయ వసూళ్లు 9.3శాతం వృద్ధి చెందాయి. అదే సమయంలో దిగుమతి సంబంధిత జిఎస్‌టి వసూళ్లు 29శాతం మేర భారీగా పెరిగాయి.

ఆదాయ వృద్ధిలో వాణిజ్య సంబంధిత కార్యకలాపాల వాటా అసమానంగా అధికంగా ఉంటోందని ఇది సూచిస్తోంది" అని గ్రాంట్ థోర్టన్ భారత్‌కు చెందిన భాగస్వామి, పన్ను వివాదాల నిర్వహణ విభాగం అధిపతి మనోజ్ మిశ్రా పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే, మహారాష్ట్రలో దేశీయ వసూళ్లు 8శాతం పెరిగి రూ.28,779 కోట్లకు చేరాయి.

కర్ణాటకలో వసూళ్లు 13శాతం పెరిగి రూ.14,148 కోట్లుగా నమోదయ్యాయి, గుజరాత్‌లో 15శాతం పెరిగి రూ.12,047 కోట్లకు, అలాగే ఉత్తరప్రదేశ్‌లో 19శాతం పెరిగి రూ.9,092 కోట్లకు చేరాయి. మరోవైపు, కొన్ని రాష్ట్రాల్లో వసూళ్లలో స్వల్ప తగ్గుదల కనిపించింది. తమిళనాడులో వసూళ్లు 1శాతం తగ్గి రూ.10,189 కోట్లకు, రాజస్థాన్‌లో 2శాతం తగ్గి రూ.4,148 కోట్లకు, ఒడిశాలో 7శాతం తగ్గి రూ. 3,895 కోట్లకు పరిమితమయ్యాయి.

# చక్కెర నిల్వలపై కేంద్రం కొరడా

## 2 వేల క్వింటాళ్ల వరకే నిల్వకు పరిమితి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** దేశీయ మార్కెట్‌లో చక్కెర లభ్యతను సమృద్ధిగా ఉంచడానికి, పండుగ సీజన్‌లో ఈ నిత్యావసర వస్తువును నిల్వ ఉంచి కృత్రిమ కొరతను నిరోధించడానికి ప్రభుత్వం మంగళవారం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, చక్కెర డీలర్ల నిల్వ పరిమితిని 4వేల క్వింటాళ్ల నుండి 2వేల క్వింటాళ్లకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిబంధన సెప్టెంబరు 15 నుండి నవంబరు 30వరకు అమల్లోఉంటుంది. ప్రస్తుతం, దేశవ్యాప్తంగా చక్కెర డీలర్లపై 4వేల క్వింటాళ్ల నిల్వ పరిమితి అమల్లోఉంది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ప్రకారం, నిల్వపరిమితిని 2వేల క్వింటాళ్లకు తగ్గించడం ద్వారా ప్రభుత్వం అదనపు చర్యలు చేపట్టింది. ఈ కొత్త గడువు కాలంలో, చక్కెర డీలర్ తాము పొందిన చక్కెర నిల్వలను 30 రోజుల కంటే ఎక్కువ కాలంపాటు తమ వద్ద ఉంచుకోకూడదు.

అలాగే, దేశంలో ఎక్కడైనా సరే, ఏ సమయంలోనైనా 2వేల క్వింటాళ్లకు మించి చక్కెర నిల్వలను కలిగి ఉండకూడదు. అయితే, మెట్రోపాలిటన్ ప్రాంతాలతోపాటు, ఆయా ప్రాంతాల మార్కెట్ అవసరాలను దృష్టిలోఉంచుకుని మాత్రం నిల్వ పరిమితి 4వేల క్వింటాళ్లుగానే కొనసాగుతుందని అధికారిక ప్రకటనపేర్కొంది. "ఈచర్య నిల్వలను అక్రమంగా దాచి ఉంచడాన్ని అరికట్టడం, చక్కెరనిల్వలు అధికంగాపేరుకుపోకుండా చూడటం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది చక్కెర సజావుగా రవాణా అయ్యేలా చేస్తుంది" అని ఆ ప్రకటన తెలిపింది.



# ఆర్‌బిఐ కొత్త ఇడిగా సుమన్ రే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు1:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మంగళవారం సుమన్ రేను తక్షణమే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి)గా నియమించింది. ఇడిగా పదోన్నతి పొందక ముందు, రే మహారాష్ట్ర ప్రాంతీయ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, రే డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ విభాగం, ప్రాంగణాల విభాగాన్ని పర్యవేక్షిస్తారు. సెంట్రల్ బ్యాంక్ ప్రకటన ప్రకారం, రేకు రిజర్వ్ బ్యాంక్‌లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఆయన కరెన్సీ నిర్వహణ, ఆర్థిక సమ్మిళితం, చెల్లింపు, పరిష్కార వ్యవస్థ, వినియోగదారుల విద్య, రక్షణ, మానవ వనరులతో సహా పలు రంగాలలో పనిచేశారు. రే వెస్ట్రన్ ఏరియా లోకల్ బోర్డుకు కార్యదర్శిగా కూడా పనిచేశారు.

# రాష్ట్రాల సహకారంతోనే ఆర్థిక వృద్ధి

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**యాష్‌విల్లే, సెప్టెంబరు 1:** ప్రపంచ స్థాయి సవాళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారం, వ్యాపార నిర్వహణలో నిబంధనల భారం తగ్గించడం, వ్యాపార సంస్థలతో నిరంతర సంప్రదింపులు భారత్ బలమైన ఆర్థిక వృద్ధిని కొనసాగించడంలో సహాయపడ్డాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన జి20 ఆర్థిక మంత్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌'ను మెరుగుపరిచే కేంద్రం ప్రయత్నాలలో రాష్ట్రాలు భాగస్వాములు అయ్యాయని ప్రశంసించారు. చట్టాలలో సంస్కరణలు తీసుకురావడం, నిబంధనలను సరళీకరించడం, కాలం చెల్లిన నిబంధనలను తొలగించడం ద్వారా పౌరులు, వ్యాపార సంస్థలపై భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేసిందని ఆర్థిక మంత్రి తెలిపారు. "వెయ్యికి పైగా చట్టాలను తొలగించాము, 40వేల నిబంధనలను సరళీకరించాము" అని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. కంపెనీలు, వాణిజ్య సంస్థలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం కూడా ప్రభుత్వ విధానంలో భాగమని ఆమె పేర్కొన్నారు. ఆర్థిక కార్యకలాపాలు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలలో భాగంగా, భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేస్తూనే, పెట్టుబడిదారుల రక్షణ ఒప్పందాల దిశగా కూడా అడుగులు వేస్తోందని సీతారామన్ తెలిపారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ, ఆర్థిక పునాదులపై ఉన్న విశ్వాసానికి విదేశీ కరెన్సీ డిపాజిట్లు, ప్రవాస భారతీయుల పెట్టుబడులు నిదర్శనమని ఆర్థిక మంత్రి చెప్పారు. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని తాము కోరుకుంటున్నామన్నారు. "ప్రపంచవ్యాప్త సవాళ్లు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం, ప్రజల కఠోర శ్రమ ఫలితాలను ఇస్తోందనడానికి సంకేతం కావడం సంతోషకరం" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాల్లోనూ భారతదేశం ఇదే విధమైన వృద్ధి రేటును కొనసాగించగలదని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.